www.trinetnews.com

# త్రైనెట్ తెలంగాణ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

సంపుటి 01 | సంచిక 30 | ఎడిటర్ :వెంకటేశ్వర్లు రాపోలు | సోమవారం సెప్టెంబర్ 07, 2026 | పేజీలు:12 | వెల.10/-

**అసెంబ్లీ**
**వ్యూహం ఖరారు**



2లో




## త్వరలోనే ప్రజల్లోకి వస్తా..
# నదీ జలాలపై యుద్ధం చేస్తా

- లక్ష మంది రైతులతో పాదయాత్ర
- కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టుల సందర్శన
- బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం
- కాంగ్రెస్ 1000 రోజుల పాలన అట్టర్ ఫ్లాప్
- రేవంత్ హయాంలో తెలంగాణ ఫాలింగ్
- ప్రజా సమస్యలపై అసెంబ్లీలో పోరాటం

**హైదరాబాద్:**
బీఆర్ఎస్ ఎల్పీ సమావేశంలో గులాబీ బాస్, మాజీ సీఎం కేసీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. త్వరలోనే ప్రజల్లోకి వస్తానని.. నదీ జలాల విషయంలో అవసరమైతే యుద్ధం చేస్తానని సంచలన ప్రకటన చేశారు. లక్ష మంది రైతులతో కలిసి పాదయాత్రగా వెళ్లి కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులను సందర్శిస్తానని తెలిపారు. తెలంగాణలో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం 100 శాతం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణవార్తలు
సోమవారం (సెప్టెంబర్ 7) నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం (సెప్టెంబర్ 6) ఎర్రవల్లిలో కేసీఆర్ అధ్యక్షతన బీఆర్ఎస్?ఎల్పీ సమావేశం జరిగింది. అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాలకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందరూ తప్పకుండా హాజరు కావాలని సూచించారు. శాసన సభ, మండలిలో జరిగే ప్రతి చర్చలో పాల్గొనాలని.. అసెంబ్లీ సమావేశాలను ఎవరూ తేలిగ్గా తీసుకోవద్దని దిశానిర్దేశం చేశారు. ఉభయ సభల్లోనూ కాంగ్రెస్, బీజేపీ విధానాలను ఎండగట్టాలన్నారు. స్పీకర్ పక్షపాత ధోరణి.. అప్రజాస్వామిక విధానాలు ఎండగట్టాలని సూచించారు.
ఉభయ సభల్లోనూ ప్రజా సమస్యలపపై ప్రభుత్వాన్ని నిలదీయాలని సూచించారు. అసెంబ్లీలో ప్రజల అజెండానే బీఆర్ఎస్ అజెండాగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రతిపక్షంలో ఉన్న తమకు సంఖ్యాబలమే ముఖ్యమని పేర్కొన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని.. ఆ విషయాన్ని అసెంబ్లీలో చెప్పే బాధ్యత ప్రతిపక్ష ఎమ్మెల్యేలదేనని అన్నారు. అసెంబ్లీ సమావేశాలను 20 నిర్వహించాలని బీఏసీ మీటింగ్ లో పట్టుబట్టాలని సూచించారు.

**కాంగ్రెస్ 1000 రోజుల పాలన అట్టర్ ఫ్లాప్:**
కాంగ్రెస్ 1000 రోజుల పాలన, సీఎం రేవంత్ రెడ్డిపై కేసీఆర్ ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ 1000 రోజుల పాలన డిజాస్టర్, అట్టర్ ఫ్లాప్ అని అభివర్ణించారు.

మిగతాద్ది 2 లో

## గ్రామ నిధులు నేరుగా సర్పంచులకే అందేలా త్వరలో కొత్త బిల్లు: మంత్రి సీతక్క

- గ్రామ నిధులు నేరుగా సర్పంచులకే
- త్వరలో కొత్త బిల్లు: సీతక్క
- నిధుల విడుదలలో ఇబ్బందులకు చెక్
- సర్పంచులకు మానసిక స్థైర్యం అవసరం
- గ్రామాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- నైతిక విలువలకు సర్పంచులే నాయకత్వం



2లో

**గచ్చిబౌలి:**
గ్రామ సర్పంచులు నిత్యం ఎదురయ్యే ఒత్తిళ్లు, విమర్శలను తట్టుకొని మానసిక స్థైర్యంతో ముందుకు సాగాలని మంత్రి సీతక్క అన్నారు. నిధుల విడుదల విషయంలో ఉప సర్పంచుల చెక్ పవర్‌కు సంబంధించి గత ప్రభుత్వ హయాంలో వచ్చిన చట్టంలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయన్నారు. ఈ అంశాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు మంత్రి తెలిపారు. గ్రామాలకు అభివృద్ధి నిధులు ఆగిపోకుండా.. నిధులు నేరుగా సర్పంచులకే అందేలా త్వరలో అసెంబ్లీలో కొత్త బిల్లు ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. ఆదివారం గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్‌లో సర్పంచుల కోసం 'సమర్థవంతమైన నాయకత్వం ద్వారా గ్రామ ప్రగతి' అనే అంశంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.



## "పెంపుడు జంతువుల కోసం ఖర్చు చేసే డబ్బు కంటే తక్కువ"

**న్యూఢిల్లీ:**
ఆశ్రమ పాఠశాలల్లో మృతి చెందిన ఆదివాసీ విద్యార్థుల కుటుంబాలకు మహారాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పరిహారంపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మండిపడ్డారు. ఆ పరహారం కొంతమంది రాజకీయ నాయకులు

2లో

## ప్రతిపక్ష నేత హోదాకు
# కేసీఆర్ న్యాయం చేయాలి

- అసెంబ్లీకి రాకపోతే పదవి మరొకరికి ఇవ్వాలి
- ప్రజా తీర్పును అపహాస్యం చేయొద్దు
- ఫామ్‌హౌస్‌కే పరిమితమైన కేసీఆర్
- తెలంగాణలో 'నీళ్లు--నిధులు--నియామకాలు' కుటుంబానికే దక్కాయి
- పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు: మహేశ్‌కుమార్‌గౌడ్
- ప్రతి నియోజకవర్గానికి 2,500 ఇళ్లు మంజూరు
- ప్రభుత్వ విద్య, వైద్య రంగాల బలోపేతం
- ఆర్థిక ఇబ్బందుల్లోనూ సంక్షేమం కొనసాగింపు



2లో

**హైదరాబాద్:**
ప్రజలు ఇచ్చిన ప్రతిపక్ష నేత హోదాకు మాజీ సీఎం కేసీఆర్ న్యాయం చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఎమ్మెల్యే పదవికి కేసీఆర్ రాజీనామా చేయాలంటూ ఇందిరాపార్క్ వద్ద పీసీసీ ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నాలో ఆయన మాట్లాడారు.



## అంబేద్కర్ సాంస్కృతిక కేంద్రానికి శంకుస్థాపన

- ఇబ్రహీంపట్నంలో కేంద్రం నిర్మాణం
- శంకుస్థాపన చేసిన మంత్రి వివేక్ వెంకటస్వామి
- నిధుల కోసం సహకరిస్తాం: వివేక్
- అంబేద్కర్ ఆశయాలే స్ఫూర్తి
- సామాజిక సమానత్వం, విద్యకు ప్రాధాన్యం

రంగారెడ్డి జిల్లా ఇబ్రంహీంపట్నం మండలంలోఅంబేద్కర్ సాంస్కృతిక కేంద్రానికి శంకుస్థాపన చేశారు మంత్రి వివేక్ వెంకటస్వామి. 2026 సెప్టెంబర్ 06న అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ,

## కవితపై అసభ్య వ్యాఖ్యలు.. కానిస్టేబుల్‌పై చర్యలు

- కానిస్టేబుల్‌ను అరెస్ట్ చేయాలి: కవిత
- సస్పెన్షన్ కాదు.. కేసు పెట్టాలి
- డీజీపీ తీరుపై కవిత ఆగ్రహం
- చర్యలు లేకుంటే అంతర్జాతీయ వేదికలపై ఎండగడతా



మిగతాది 2లో

## బీఆర్ఎస్ వైఖరి మారకపోతే..
# మరో పదేళ్లు రోడ్లపైనే

- అసెంబ్లీకి వస్తే సమాధానం చెప్తాం: శ్రీధర్‌బాబు
- కేసీఆర్ సభకు వచ్చి అనుభవం పంచుకోవాలి
- విపక్షాల సోషల్ మీడియా విషప్రచారాన్ని తిప్పికొట్టాలి
- రైతుల ఖాతాల్లో రూ.1.60 లక్షల కోట్లు జమ చేశాం
- ఆరు గ్యారంటీలను పూర్తిగా అమలు చేస్తాం
- రూ.8 లక్షల కోట్ల అప్పు రాష్ట్రాన్ని అప్పగించారు
- అప్పులు చెల్లిస్తూనే సంక్షేమం కొనసాగిస్తున్నాం
- బీఆర్ఎస్ పదేళ్లలో ఒక్కసారి కూడా గ్రేడ్--1 నియామకాలు లేవు



మిగతాది 2లో



## తీవ్ర విషాదం.. కల్తీ మద్యం సేవించి 10 మంది మృతి

**భోపాల్:**
మధ్యప్రదేశ్‌లో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. సాగర్ జిల్లాలో కల్తీ మద్యం సేవించి పదిమంది మృతిచెందారు. మృతులంతా అక్కడి ఘూఘర్, నౌరాజ్, బరాజ్ తదితర గ్రామాలకు చెందినవారిగా అధికారులు గుర్తించారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణచేపట్టనున్నట్లు పేర్కొన్నారు.




## పొన్నం సత్తయ్య జీవిత సాఫల్య పురస్కారాలకు ముగ్గురు ఎంపిక

- వ్యవసాయం: ఎం. కోదండరెడ్డి
- సాహిత్యం: వెలిచాల కొండలరావు
- కళలు: గొట్టే కనకవ్వ
- తొలిసారిగా వ్యవసాయ రంగానికి అవార్డు
- ఈ నెల 13న రవీంద్రభారతిలో పురస్కారాల ప్రదానం
- ముగ్గురికీ రూ.50 వేల నగదు పురస్కారం
- మెమెంటో, ప్రశంసాపత్రంతో సత్కారం
- సత్తయ్య ఆశయాలకు అనుగుణంగా ప్రతిభావంతులకు గౌరవం

2లో..



## "మా అమ్మ ఏం తప్పు చేసింది?"

- కన్నీరు పెట్టుకున్న సుస్మిత
- సురేఖను ఎందుకు అవమానించారు?
- "నా తప్పుకి నన్ను శిక్షించాలి"
- రేవంత్‌పై సుస్మిత తీవ్ర ఆరోపణలు
- "మా అమ్మ, నాన్న కాంగ్రెస్‌లోనే"

కొండా సురేఖ భర్తరఫ్ వ్యవహారంపై ఆమె కూతురు కొండా సుస్మిత స్పందించారు. మంత్రి పదవి నుంచి తొలగించడంపై 2026 సెప్టెంబర్ 6న వీడియో రిలీజ్ చేశారు. తన తల్లి ఏం తప్పు చేసిందని ఇంత అవమానించారంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు. రాజకీయవార్తలు చదవండి అమ్మా, నాన్నా నన్ను క్షమించండి అంటూ కన్నీళ్లు పెట్టుకుంటూ భోరున ఏడ్చిన వీడియో రిలీజ్ చేశారు కొండా సుస్మిత . పార్టీలో నేనైనా ఉండాలి, ఆమె అయినా ఉండాలి అనే స్థాయికి ఒక ముఖ్యమంత్రి దిగజారుతాడా?

మిగతాద్ది 2 లో

# అసెంబ్లీ
# వ్యూహం ఖరారు

- కాంగ్రెస్ ద్రోహాలపై సభలో నిలదీస్తాం
- అసెంబ్లీ నెలరోజులు జరపాలి
- కేసీఆర్‌పై మాట్లాడే హక్కు మీకు లేదు
- కాళేశ్వరం, రంగారెడ్డి ఎత్తిపోతలపై కార్యాచరణ
- స్పీకర్‌పై అవిశ్వాసానికి వెనకాడం



**సిద్ధిపేట:**
(సోమవారం, సెప్టెంబర్ 07వ తేదీ) ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో తమ పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలను ఖరారు చేసుకున్నామని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావు స్పష్టం చేశారు. ఈరోజు ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో కేసీఆర్ అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ఎల్పీ సమావేశం అనంతరం హరీష్ మీడియాతో మాట్లాడారు. అన్ని వర్గాలకు కాంగ్రెస్ నష్టం చేసిందని, ఆ పార్టీ ప్రజలకు చేసిన ద్రోహాల మీద అసెంబ్లీలో నిలదీస్తామన్నారు.

2లో..

2లో



## వికారాబాద్ హైవేపై ఆల్టో కారు, కాంక్రీట్ టిప్పర్ ఢీ.. పూర్తిగా కాలిపోయిన కారు..

వికారాబాద్ జిల్లా పరిగి మండలం గడిసింగాపూర్ సమీపంలోని చింతల్ చెరువు దగ్గర బీజాపూర్ హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. 2026 సెప్టెంబర్ 06వ తేదీన ఆల్టో కారు, టిప్పర్ లారీ బలంగా ఢీకొన్నాయి. ప్రమాద తీవ్రతకు కారులో ఒక్కసారిగా భారీగా మంటలు చెలరేగాయి. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురిలో నర్సింహులు అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు.

ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక

సోమవారం సెప్టెంబర్ 07, 2026

www.trinetnews.com

# పొన్నం సత్తయ్య జీవిత సాఫల్య పురస్కారాలకు ముగ్గురు ఎంపిక

మొదటిపేజీ తరువాయి

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తండ్రి పొన్నం సత్తయ్య స్మారకార్థం ఏటా అందిస్తోన్న... పొన్నం సత్తయ్య జీవిత సాఫల్య పురస్కారాలకు ఈఏడాది ముగ్గురిని ఎంపిక చేసినట్లు పొన్నం సత్తయ్య ఛారిటబుల్ ట్రస్టు ప్రకటించింది. వ్యవసాయ రంగంలో విశేష కృషి చేస్తున్న రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి, సాహిత్య రంగంలో వెలిచాల కొండలరావు, కళారంగంలో విశేష సేవలందిస్తున్న గొట్టే కనకవ్వలను ఈ ఏడాది జీవిత సాఫల్య పురస్కారాలకు ఎంపిక చేసినట్లు ట్రస్టు ఉపాధ్యక్షులు పొన్నం అశోక్ గౌడ్ తెలిపారు.

అవార్డుల జ్యూరీ కమిటీ కన్వీనర్ డా. పొన్నం రవిచంద్ర సారథ్యంలో కేంద్ర సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్, ప్రముఖ పాత్రికేయులు దిలీప్ రెడ్డి, సివిల్ సప్లయిస్ డైరెక్టర్ జి.వి. శ్యాంప్రసాద్ లాల్, బి.సి. స్టడీ సర్కిల్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, రచయిత్రి అయినంపుడి శ్రీలక్ష్మి సభ్యులుగా ఉన్న జ్యూరీ కమిటీ అవార్డులకు ఎంపిక చేసిన జాబితాను (ఆదివారం) ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ పొన్నం ప్రభాకర్ కు అందజేసింది.

గత నాలుగు సంవత్సరాలుగా సాహిత్య రంగంలో నాలేశ్వరం శంకరం, నలిమెల భాస్కర్, చంద్రబోస్, అంపశయ్య నవీన్లకు, కళారంగంలో ఒగ్గు ధర్మయ్య, కామ్రేడ్ విమలక్క, బలగం కొమురమ్మ, అంతడుపుల రమాదేవిలకు పొన్నం సత్తయ్య జీవిత సాఫల్య పురస్కారాలను అందజేశారు.ఈ ఏడాది నుంచి వ్యవసాయ రంగాన్ని కూడా పురస్కారాల పరిధిలోకి తీసుకువచ్చి తొలిసారిగా వ్యవసాయ రంగంలో విశిష్ట సేవలందించిన వ్యక్తికి అవార్డును అందజేస్తున్నారు.

పొన్నం సత్తయ్య 16వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 13వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు రవీంద్రభారతిలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పొన్నం అశోక్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అవార్డులకు ఎంపికైన ముగ్గురికి రూ.50 వేల నగదు పురస్కారంతో పాటు మెమెంటో, ప్రశంసాపత్రం అందజేయనున్నట్లు వెల్లడించారు.

పొన్నం సత్తయ్య ఆశయాలను కొనసాగిస్తూ సమాజానికి వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న ప్రతిభావంతులను గుర్తించి గౌరవించడమే ఈ పురస్కారాల ప్రధాన ఉద్దేశ్యమని ఆయన తెలిపారు.ఈ అవార్డును పొన్నం సత్తయ్య ఛారిటబుల్ ట్రస్టు ఏటా అందజేస్తోంది.

# తీవ్ర విషాదం.. కల్తీ మద్యం సేవించి 10 మంది మృతి

మొదటిపేజీ తరువాయి

అయితే నిన్న శనివారం మద్యం సేవించిన అనంతరం బాధితుల ఆరోగ్యం ఒక్కసారిగా క్షీణించింది. దీంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు వారిని ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే పరిస్థితి విషమించడంతో వారు మృతిచెందినట్లు వైద్యులు ప్రకటించారు. మరి కొంతమందికి చికిత్స అందిస్తున్నారు. అయితే ఈ మరణాలకు కల్తీ మద్యమే కారణమై ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నప్పటికీ, పోస్టుమార్టం నివేదికలు వచ్చే వరకు అధికారికంగా కారణాన్ని నిర్ధారించలేదు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

### యూపీ నుంచి కల్తీ మద్యం సరఫరా?

ఈ ఘటనపై ప్రాథమిక దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. సాగర్‌కు సరిహద్దుగా ఉన్న ఉత్తరప్రదేశ్‌లోని లలిత్‌పూర్ కేంద్రంగా ఓ అక్రమ మద్యం సరఫరా నెట్‌వర్క్ పనిచేస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.నిందితులు లలిత్‌పూర్‌లో నకిలీ మద్యాన్ని తయారు చేసి, సాగర్ సరిహద్దు గ్రామాలకు తరలించినట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు సమాచారం.

నకిలీ మద్యాన్ని అసలైన బ్రాండ్ల మాదిరిగా కనిపించేలా నకిలీ లేబుళ్లు, క్యాప్‌లు, క్యూఆర్ కోడ్‌లు ఉపయోగించినట్లు పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. కార్లు, మోటార్‌సైకిళ్ల ద్వారా ఈ మద్యాన్ని వివిధ ప్రాంతాలకు తరలించినట్లు అనుమానిస్తున్నారు.బాంద్రీ, బరోడియా, ఘూఘూరా ఖుర్ద్, నౌరాజ్, బరాజ్ తదితర గ్రామాలకు ఈ నకిలీ మద్యం చేరినట్లు దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. మద్యం ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరెవరు సరఫరా చేశారు? స్థానికంగా ఎవరైనా ఈ అక్రమ నెట్‌వర్క్‌కు సహకరించారా? అనే కోణాల్లో పోలీసులు విచారణ చేస్తున్నారు.

### ఘటనపై సీఎం సీరియస్

సాగర్‌లో జరిగిన మరణాలపై మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ తీవ్రంగా స్పందించారు. ఘటనాస్థలికి సంబంధిత మంత్రి, ఉన్నతాధికారులు వెళ్లి పరిస్థితిని పరిశీలించాలని ఆదేశించారు. పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

# అసెంబ్లీ వ్యూహం ఖరారు

మొదటిపేజీ తరువాయి

'ఈ అసెంబ్లీ కనీసం నెల పెట్టాలని మేము బీఏసీలో డిమాండ్ చేయబోతున్నాం. కాంగ్రెస్ పార్టీ ద్రోహాల మీద నిలదీస్తాం. 22ఘ అంశం పై కూడా ప్రభుత్వాన్ని నిలదీస్తాం. రాబోయే కొద్ది రోజుల్లో లక్షలాది మందితో కాళేశ్వరం ఎత్తిపోతల, రంగారెడ్డి ఎత్తిపోతల విషయంలో కేసీఆర్ ప్రత్యక్ష కార్యాచరణకు దిగనున్నారు. కేసీఆర్ గురించి మాట్లాడే నైతిక హక్కు మీకు లేదు.

రాజీనామా చేయాల్సి వస్తే మీరే చేయాలి. అన్ని విషయాల్లో ఫెయిల్ అయిన మీరే రాజీనామా చేయాలి.ప్రధాన ప్రతిపక్ష నేతకు గౌరవం ఇవ్వడం లేదు. సీఎం బూతులు తిడుతున్న ఈ సభ కు కేసీఆర్ రావాల్సిన అవసరం లేదు అని అందరం ఎమ్మెల్యేం చెప్పాం. మీ తమ్ముడు కనీసం వార్డు మెంబర్ కూడా కాదు. ఆయనకు ఎందుకు గన్‌మెన్‌లను ఇచ్చి ఖర్చు పెడుతున్నారు. అసెంబ్లీ కనీసం నెలరోజులు జరగాలని మేము స్పీకర్ ను కోరుతాం.సభలో మాకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని స్పీకర్‌ను అడుగుతాం. మాకు తగిన సమయం ఇవ్వకపోతే స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టడానికి కూడా వెనకాడం' అని హెచ్చరించారు.

# త్వరలోనే ప్రజల్లోకి వస్తా.. నదీ జలాలపై యుద్ధం చేస్తా

మొదటిపేజీ తరువాయి

తమ ప్రభుత్వం పోవడం ఖాయమని కాంగ్రెస్ నేతలకు అర్థమైందని.. అందుకే అడ్డగోలు దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు.

### సీఎం రేవంత్ పై కేసీఆర్ ఫైర్:

ముఖ్యమంత్రి హోదాలో ఉన్న రేవంత్ రెడ్డి పాలన చేతకాక బూతులు మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ బూతుల వీరుడు చర్చలకు అసెంబ్లీకి నన్ను రమ్మంటున్నాడు. బూతులు మాట్లాడే వారితో చర్చించేందుకు నేను అసెంబ్లీకి రావడం అవసరమా..? నేను అసెంబ్లీ రావాలా..? వద్దా..? మీరే చెప్పండని అన్నారు. నా చావు కోరుతూ పదేపదే స్పీచ్లు ఇస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌ది థర్డ్ క్లాస్ పాలన అని.. రేవంత్ హయాంలో తెలంగాణ రైజింగ్ కాదు.. ఫాలింగ్ కనిపిస్తోందని విమర్శించారు.

# గ్రామ నిధులు నేరుగా సర్పంచులకే అందేలా త్వరలో కొత్త బిల్లు: మంత్రి సీతక్క

మొదటిపేజీ తరువాయి

ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సీతక్క మాట్లాడుతూ.. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయడమే కాదు ప్రజల్లో నైతిక విలువలను పెంపొందించే దిశగా సర్పంచులు నాయకత్వం వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన 9 రకాల ఆదర్శ గ్రామ అంశాలను సర్పంచులు ప్రతి ఒక్కరూ అనుసరించాలని సూచించారు. మానసిక ఆరోగ్యం పరిరక్షణ పట్ల సర్పంచులకు అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రాజయోగిని బ్రహ్మకుమారి సంతోష్ దీదీ మాట్లాడుతూ.. సర్పంచులు నిస్వార్థంగా ప్రజాసేవ చేయాలని అన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్, శాంతి సరోవర్ డైరెక్టర్ కుల్‌దీప్ తదితరులు పాల్గొన్నారు.

# వికారాబాద్ హైవేపై ఆల్టో కారు, కాంక్రీట్ టిప్పర్ ఢీ.. పూర్తిగా కాలిపోయిన కారు..

మొదటిపేజీ తరువాయి

తీవ్రంగా గాయపడిన నర్సింహులు భార్య అంజమ్మ, వారి తమ్ముడి కుమారుడు అభిరామ్‌ల పరిస్థితి విషమంగా మారింది. బాధితులను పూడూరు మండలం గొంగుపల్లికి చెందిన ఒకే కుటుంబ సభ్యులుగా గుర్తించారు.

వీరంతా సొంత పనుల నిమిత్తం కోస్గి వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం వికారాబాద్‌కు తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

# "పెంపుడు జంతువుల కోసం ఖర్చు చేసే డబ్బు కంటే తక్కువ"

మొదటిపేజీ తరువాయి

ఏడాదిలో తమ పెంపుడు జంతువుల కోసం ఖర్చు చేసే డబ్బు కంటే కంటే కూడా తక్కువగా ఉందని చెప్పారు. ఎక్స్‌లో దీప్కే స్పందిస్తూ.. 590 మందికి పైగా ఆదివాసీ విద్యార్థుల కుటుంబాలకు కేవలం రూ.2 లక్షల చొప్పున పరిహారం మాత్రమే ఇచ్చారని పేర్కొన్నారు.

"కేవలం 2 సంవత్సరాల్లో మహారాష్ట్రలోని ఆశ్రమ పాఠశాలల్లో 590 మందికి పైగా ఆదివాసీ విద్యార్థులు మృతి చెందారు. వారి కుటుంబాలకు కేవలం రూ.2 లక్షల చొప్పున పరిహారం మాత్రమే అందింది" అని దీప్కే పేర్కొన్నారు. విద్యార్థులకు భద్రతను ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందని, నిర్లక్ష్యం కారణంగానే వారు మృతి చెందారని దీప్కే ఆరోపించారు.

"వారి భద్రత, సంక్షేమాన్ని ప్రభుత్వం నిర్ధారించడంలో విఫలమైంది. నిర్లక్ష్యం, శ్రద్ధ లేకపోవడం, నిర్వహణ లోపం కారణంగా విద్యార్థులు మృతి చెందినప్పుడు వారి కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున అందజేస్తున్నారు. కొంతమంది రాజకీయ నాయకులు ఏడాదిలో తమ పెంపుడు జంతువుల కోసం ఖర్చు చేసే మొత్తం కంటే ఇది తక్కువే కావచ్చు. రాష్ట్రం దృష్టిలో ఆదివాసీ విద్యార్థి జీవితం విలువ ఇంతేనా?" అని ఆయన ప్రశ్నించారు.

ప్రభుత్వ ఉద్యోగాల్లో షెడ్యూల్డ్ ట్రైబ్ అభ్యర్థులను నియమించాలని, గిరిజన పిల్లల కోసం నిర్వహిస్తున్న వసతి పాఠశాలల పరిస్థితులను మెరుగుపరచాలని డిమాండ్ చేస్తూ గిరిజన విద్యార్థులు నిరసనలు ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దీప్కే ఈ వ్యాఖ్యలు చేశారు.

గడ్చిరోలి జిల్లాలోని ఒక వసతి పాఠశాలలో పాముకాటుకు గురై ముగ్గురు గిరిజన బాలికలు మృతి చెందిన ఘటన తర్వాత పుణె, నాగ్‌పూర్, నాసిక్‌లలో నిరసనలు ప్రారంభమయ్యాయి. గిరిజన వసతి గృహాల్లో ఉంటూ, గిరిజన వసతి పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి రూ.10 కోట్ల బీమా కవరేజీ కల్పించాలని కూడా నిరసనకారులు డిమాండ్ చేశారు.

# తెలంగాణలో 369 పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు టెండర్లు



రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని మరింత వేగవంతం చేయడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ మౌలిక వసతులను భారీగా విస్తరించేందుకు తెలంగాణ పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీజీ రెడ్కో) కీలక చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా మొత్తం 369 పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు, నిర్వహణ, అప్‌గ్రేడేషన్, వాణిజ్య నిర్వహణ కోసం ప్రైవేట్ ఛార్జ్ పాయింట్ ఆపరేటర్ల (సీపీఓలు) కోసం టెండర్లు ఆహ్వానించింది. రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో వాటికి అనుగుణంగా పబ్లిక్ ఛార్జింగ్ మౌలిక సదుపాయాలను విస్తరించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.

పెరుగుతున్న ఈవీ మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రైవేట్ రంగం ఈ అవకాశాలను అందిపుచ్చుకునేలా ఈవీ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని రెడ్కో వీసీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ పేర్కొన్నారు. హైదరాబాద్ పరిధిలో గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరిలోని పలు ప్రాంతాలను కవర్ చేస్తూ రెడ్కో సంస్థ ఏర్పాటు చేసిన 200 పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్లను ఆరు క్లస్టర్లుగా అభివృద్ధి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఎంపికైన సీపీవోలు వీటి ఆపరేషన్, మెయింటెనెన్స్, అప్‌గ్రేడేషన్, వాణిజ్య నిర్వహణ బాధ్యతలను చేపడతారని, ప్రాజెక్టు కాంట్రాక్ట్ కాలం 10 సంవత్సరాలు ఉంటుందన్నారు. టీజీఎస్పీడీసీఎల్ పరిధిలోని వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లోని 16 ప్రాంతాల్లోనూ 169 పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు.

రెండు ప్రాజెక్టుల్లోనూ వినియోగదారుల కోసం ఈవీ ఛార్జింగ్ టారిఫ్‌ను యూనిట్‌కు రూ.13 (+జీఎస్టీ అదనం)గా నిర్ణయించామన్నారు. కాంట్రాక్ట్ కాలం మొత్తం ఇదే టారిఫ్ అమల్లో ఉంటుంది అని ఆయన స్పష్టం చేశారు. 169 ఛార్జింగ్ స్టేషన్ల ప్రాజెక్టుకు సెప్టెంబర్ 7న ఉదయం 11.30 గంటలకు, 200 ఛార్జింగ్ స్టేషన్ల ప్రాజెక్టుకు అదే రోజు ఉదయం 11 గంటలకు ప్రీ-బిడ్ సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. బిడ్ల సమర్పణ ప్రక్రియ సెప్టెంబర్ 8 నుంచి ప్రారంభమై సెప్టెంబర్ 22న ముగుస్తుందన్నారు. టెండర్లను తెలంగాణ ఈ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ ద్వారా సమర్పించాలని చెప్పారు.

# బీఆర్ఎస్ వైఖరి మారకపోతే.. మరో పదేళ్లూ రోడ్లపైనే: మంత్రి శ్రీధర్ బాబు

మొదటిపేజీ తరువాయి

భారత రాష్ట్ర సమితి నేతలతో రోడ్లపై మాట్లాడించడం కాదు.. అసెంబ్లీకి వస్తే సమాధానం చెప్తామని తెలంగాణ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. పదేళ్లు సీఎంగా పనిచేసిన కేసీఆర్ సభకు వచ్చి.. వారి అనుభవాన్ని పంచుకోవాలన్నారు. ఇందిరాపార్క్ వద్ద పీసీసీ ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నాలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్‌తో పాటు ముఖ్యనేతలు జగ్గారెడ్డి, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ జవాబుదారీతనంతో పని చేస్తోందన్నారు.

"విపక్షాలు సోషల్ మీడియాలో చేస్తున్న విష ప్రచారాలను తిప్పికొట్టాలి. ఆర్టీసీ బస్సుల్లో కాంగ్రెస్ కార్యకర్తలు మాత్రమే ఉచిత ప్రయాణం చేస్తున్నారా? పేదల ఇళ్లకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. రాష్ట్రంలో పేదలకు రేషన్ కార్డు కూడా ఇవ్వకుండానే దౌర్భాగ్య పాలన పదేళ్లపాటు సాగింది. బీఆర్ఎస్, భాజపా కార్యకర్తలకు రేషన్ కార్డు రాలేదా? సన్నబియ్యం తీసుకోవట్లేదా? రెండున్నరేళ్లలోనే రైతుల ఖాతాల్లోకి రూ. 1.60 లక్షల కోట్లు జమచేశాం. మళ్లీ ఎన్నికలకు వెళ్లేలోపు.. ఆరు గ్యారంటీలను సంపూర్ణంగా అమలు చేస్తాం. రూ. 8 లక్షల కోట్ల అప్పు ఉన్న రాష్ట్రాన్ని కేసీఆర్ మాకు అప్పగించారు. ఆ అప్పుపై అసలు, వడ్డీ చెల్లిస్తూ.. సంక్షేమం కూడా అమలు చేస్తున్నాం. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్కసారి కూడా గ్రేడ్ 1 నియామకాలు జరగలేదు. ఇకనైనా బీఆర్ఎస్ నాయకుడి వైఖరి మారకుంటే.. మరో పదేళ్లు కూడా వాళ్లు రోడ్ల మీదనే ఉంటారు" అని శ్రీధర్ బాబు అన్నారు.

# ప్రతిపక్ష నేత హోదాకు కేసీఆర్ న్యాయం చేయాలి

మొదటిపేజీ తరువాయి

ప్రజలు ప్రతిపక్ష పాత్ర పోషిస్తుంటే.. కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని విమర్శించారు. ప్రజా తీర్పును అపహాస్యం చేయొద్దని.. అసెంబ్లీకి రాకపోతే ప్రతిపక్ష నేత పదవిని మరొకరికి అప్పగించాలని హితవు పలికారు.

"నీళ్లు, నిధులు, నియామకాల కోసమే తెలంగాణ ప్రజలు పోరాడి స్వరాష్ట్రం సాధించుకున్నారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చాక అవి కేవలం కేసీఆర్ కుటుంబానికే దక్కాయి. ఉన్నత చదువులు చదివితే సరిపోదు.. సంస్కారం కూడా ఉండాలని కేటీఆర్ గ్రహించాలి. ఉద్యమకారుల కుటుంబాలకు న్యాయం చేస్తున్నాం. సీఎం రేవంత్‌రెడ్డి కృషితో హైదరాబాద్ రూపురేఖలు మారుతున్నాయి. నగరానికి అనుబంధంగా ఫ్యూచర్‌సిటీ మరో గొప్ప నగరంగా ఎదుగుతోంది. సొంతిల్లు కట్టుకోవాలనే పేదల కల.. పదేళ్లపాటు నెరవేరలేదు. ప్రతి నియోజకవర్గానికీ 2,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నాం. అర్హులైన ప్రతి పేదవాడికీ ఇల్లు నిర్మించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యం. ఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ సంక్షేమాన్ని కొనసాగిస్తున్నాం. ప్రభుత్వ విద్య, వైద్య రంగాన్ని బలోపేతం చేస్తున్నాం"అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.

# "మా అమ్మ ఏం తప్పు చేసింది?"

మొదటిపేజీ తరువాయి

నేను మాట్లాడిన మాటల్లో తప్పులేదని ఇప్పటికీ చెప్తున్నాను. ఒకవేళ తప్పు ఉన్నా కూడా, నా తప్పు కాబట్టి నామీద అక్రమ కేసు పెట్టి నన్ను జైల్లో వేయాల్సింది.. కానీ మా అమ్మను ఎందుకు అవమానించారని ప్రశ్నించారు.

ఒక సామాన్య కార్యకర్త నుంచి మంత్రి స్థాయికి ఎదిగిన మహిళపై రేవంత్ రెడ్డి ఇంత పగ పెట్టుకుంటాడని అనుకోలేదని అన్నారు. తాను పార్టీని ఎక్కడ కించపరచలేదని.. కేవలం ఒక వ్యక్తి గురించి మాత్రమే మాట్లాడానని అన్నారు. తన తల్లి చేసిన ఒక్క తప్పు చూపించండి.. తన శాఖలో చిన్న అవినీతి కూడా జరగలేదని అన్నారు.

రేవంత్ రెడ్డిని తిట్టమని మా అమ్మ, అతని సహచర మంత్రి ఎందుకు చెప్తుంది? ఎమ్మెల్సీ కోసం ప్రయత్నిస్తున్న మా నాన్న రేవంత్ రెడ్డిని తిట్టమని ఎందుకు చెప్తాడు? అధిష్టానం మొత్తం మా అమ్మకే మద్దతుగా ఉంది.. కానీ రేవంత్ రెడ్డి బ్లాక్‌మెయిల్ చేయడం వల్లనే అధిష్ఠానం ఈ నిర్ణయం తీసుకుందని ఆరోపించారు. ప్రభుత్వనిర్ణయాలు తెలుసుకోండి

రేవంత్ రెడ్డి సోదరుల అక్రమాల చిట్టా తన దగ్గర ఉందని.. దాని గురించి తర్వాత మాట్లాడతానని అన్నారు. మా అమ్మ, నాన్న కాంగ్రెస్ పార్టీలోనే ఉంటారు.. మా అమ్మను ఇంత అవమానిస్తారని తెలిస్తే అలా మాట్లాడేదాన్ని కాదు.. అంటూ భావోద్వేగానికి గురయ్యారు.

# అంబేద్కర్ సాంస్కృతిక కేంద్రానికి శంకుస్థాపన

మొదటిపేజీ తరువాయి

చేసిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి.. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సాంస్కృతిక కేంద్రం నిర్మాణం చేయాలనుకోవడంపై నిర్వాహకులను అభినందించారు. నగరపర్యటనలను అన్వేషించండి

ఎక్కడ అణిచివేత జరిగితే అక్కడ అంబేద్కర్ ఉండేవారని.. ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. ఈ అంబేద్కర్ కళా భవనం ఏర్పాటు చేయడం చాలా ఉపయోగకరమని అన్నారు. ఏం ఫండ్స్ కావాలన్నా సహాయ సహకారం అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమం ఏర్పాటు చేసిన అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీకి అభినందనలు తెలిపారు.

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తారామతిపేట్‌లోని సైబర్ మెడోస్ వెంచర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి వివేక్ తో పాటు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తదితర నేతలు పాల్గొన్నారు.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలు, సామాజిక సమానత్వం, విద్య, కళలు, సాంస్కృతిక విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లే ఉద్దేశంతో ఈ సాంస్కృతిక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శంకుస్థాపన కార్యక్రమానికి కళాకారులు, ప్రజాప్రతినిధులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు.

# నాపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన కానిస్టేబుల్‌ను అరెస్ట్ చేయాలి: కవిత

మొదటిపేజీ తరువాయి

సామాజిక మాధ్యమాల్లో తనపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన చేసిన కానిస్టేబుల్‌ను సర్వీస్ నుంచి రిమూవ్ చేయకుండా రాష్ట్ర డీజీపీ సస్పెండ్‌తోనే సరిపెట్టారని తెలంగాణ రక్షణసేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. అతడిపై కేసు పెట్టి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే చర్యలు చేపట్టకుంటే.. అంతర్జాతీయ వేదికలపై ప్రభుత్వం తీరును ఎండగడతానని హెచ్చరించారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణసేన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో కవిత మాట్లాడారు.మహిళలపై అసభ్యంగా మాట్లాడిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలో భారతీయ న్యాయ సంహిత సెక్షన్లు చెబుతున్నాయని, అవి డీజీపీకి తెలియదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడేళ్లయినా.. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు కల్లలు గానే మిగిలిపోయాయన్నారు. బీసీల కోసం ధర్నాలు చేస్తామని కాంగ్రెస్ నేతలు చెప్పడం పెద్ద జోక్ అని కవిత అన్నారు. 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి మోసం చేశారని ఆక్షేపించారు. మాజీ మంత్రి కొండా సురేఖ

# డీజీపీ. నన్ను అసభ్యంగా కామెంట్ చేసిన పోలీస్ ను అరెస్ట్ చెయ్యి

**అధికారం కోసం ఉద్యమకారులను వాడుకోని రేవంత్ రెడ్డి మోసం చేశాడు**

**తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 6:**
ఇటీవల కాలంలో మహిళలందరినీ ఇబ్బంది పెట్టే విధంగా దారుణంగా ట్రోలింగ్స్ జరుగుతున్నాయని,
అయినా సరే ఎలాంటి చర్యలు తీసుకోకుండా పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని
తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ముఖ్యంగా శాంతి భద్రతలను రక్షించాల్సింది పోలీసులు నాలాంటి వ్యక్తిపైనే అత్యంత అసభ్యంగా దూషణలు చేస్తున్నా సరే పోలీసులు పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.
ఇక సామాన్య మహిళలకు ఇబ్బందులు వస్తే వాళ్లు ఎవరికీ చెప్పుకుంటారు? మహిళలపై అసభ్యంగా కామెంట్స్ చేస్తే 3 ఏళ్ల జైలు శిక్ష విధించాలని ఐటీ చట్టంలో ఉందని ఆమె స్పష్టం చేశారు
. డిపార్ట్ మెంట్ లో ఎవరిమీదనైనా చర్యలు తీసుకుంటే ఆ చర్యలు అసంపూర్తిగా ఉండకూడదన్న చట్టం ఉన్న సంగతి డీజీపీకి తెలియదా? అని ప్రశ్నించారు.
డీజీపీ ఇద్దరు కోడళ్లు ఉన్నారు. వాళ్లపై కూడా ఇలాగే కామెంట్లు చేస్తే ఊరుకుంటారా? మిస్టర్ డీజీపీ నీ బాధ్యత ఏంటి? మీ సెన్సిబులిటీ ఏం ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి హేట్ స్పీచ్ మీద బిల్లు తెస్తాను అంటాడు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ఆ బిల్లు తేవాలని డిమాండ్ చేశారు.



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు ఉద్యమకారుల కాళ్లు పట్టుకున్నంత పనిచేశారని,
అధికారంలోకి వచ్చిన తర్వాత వారికి న్యాయం చేస్తానని మాట ఇచ్చాడు. ఆయన పక్కనే కోదండరాం ఉండటంతోనే రేవంత్ రెడ్డిని ఉద్యమకారులు నమ్మారు.
వారికి ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేకే కమిటీ కి కూడా అన్ని పార్టీలు తమ అభిప్రాయాలు చెప్పాయి. కానీ ఆ కమిటీ రిపోర్ట్ కూడా ముందుకు పోలేదని వాపోయారు. తెలంగాణ జన సమితి తరపున కోదండరాం ఉద్యమకారులకు ఐడెంటిటీ కార్డులు ఇచ్చారు. ఆయన ఇప్పుడు ప్రభుత్వంలో భాగంగా ఉన్నానన్న సంగతి మర్చిపోయారన్నారు. కోదండరాం మీరు ఇచ్చిన ఐడెంటిటీ కార్డులను ప్రభుత్వానికి ఇవ్వొచ్చు కదా? ముఖ్యమంత్రి మాటకు ఈ ప్రభుత్వంలో విలువ లేదా? ఉద్యమకారులను తొక్కుకుంటూ పోతూ వారికి అన్యాయం చేస్తారా? కవిత మండిపడ్డారు. ఇప్పటికే ఉద్యమాలు చేసి వాళ్లంతా అలిసిపోయారు. ఇక మిగిలింది ఆమరణ దీక్ష మాత్రమేనని ఆమె అన్నారు. ఉద్యమకారులకు సంబంధించిన మొత్తం డేటా ప్రభుత్వం వద్ద ఉందని, కొంతమందికైనా గుర్తింపు కార్డులు ఇచ్చి ఈ ప్రాసెస్ ను మొదలు పెట్టండి అని కోరారు. లేని పక్షంలో
ఈ ప్రభుత్వాన్ని రాష్ట్రంలో ఏ గ్రామంలో కూడా తిరగకుండా చేస్తామని హెచ్చరించారు.
అసెంబ్లీ సమావేశాల్లో నిర్ణీత కాలవ్యవధితో కూడిన స్పష్టమైన వాగ్దానాన్ని ముఖ్యమంత్రి చేయాలన్నారు. అసెంబ్లీ చర్చించాల్సిన చాలా అంశాలు ఉన్నప్పటికీ వాటిని చర్చించకుండా అధికార, ప్రతిపక్షాలు డ్రామాలు చేస్తున్నాయని విమర్శించారు.
ఫీజు రెగ్యులేషన్, ఉద్యమకారులకు ఇస్తామన్న వాటికి సంబంధించి చట్టాలు చేయాలన్నారు. బీసీల కోసం కాంగ్రెస్ వందరోజుల కార్యాచరణ చేస్తుందంటే నవ్వొస్తోందన్నారు. బీసీ 42 శాతం రిజర్వేషన్లు అంటూ వారి లెక్క తప్పు చూపిన పార్టీయే ఇప్పుడు బీసీల కోసం ఆందోళనలు చేస్తామంటోందని విమర్శించారు.
బీసీ రిజర్వేషన్లకు సంబంధించి చట్టాలపై కేంద్రంతో కాంగ్రెస్ మాట్లాడటం లేదని...అఖిలపక్షాన్ని ఢిల్లీ తీసుకెళ్లటం లేదన్నారు.
బీసీలకు అన్యాయం చేస్తున్న పార్టీయే వాళ్ల కోసం ధర్నాలు చేస్తుండటం హాస్యాస్పదం కవిత అన్నారు. కేంద్రం చేసే కులగణనలో స్పెసిఫిక్ గా కులం కాలం పెట్టాలని కవిత డిమాండ్ చేశారు.

# కేసీఆర్, కేటీఆర్ లపై సీఎం రేవంత్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్06**
మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని ఉప్పల్ నియోజకవర్గం మల్లాపూర్ డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు శ్రవణ్‌కుమార్ మండిపడ్డారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ
కేసీఆర్ రాజీనామా చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేయడంపై శ్రవణ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "యాదాద్రి ఆలయాన్ని నిర్మించినందుకా.. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించినందుకా.. బస్తీ దవాఖానాలు, ఆరోగ్యశ్రీ వంటి కార్యక్రమాలు అమలు చేసినందుకా కేసీఆర్ రాజీనామా చేయాలి?" అని ప్రశ్నించారు. వృద్ధాప్య, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు తదితర వర్గాలకు సంక్షేమ



పథకాలు అందించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు హామీల్లో ఇప్పటివరకు ఏం అమలు చేశారో రేవంత్‌రెడ్డి ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. వెయ్యి రోజుల పాలనలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించిన ఆయన.. ముఖ్యమంత్రి, మంత్రివర్గ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు తమ పదవులకు రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు.
కేసీఆర్ ఫామ్‌హౌస్ పాలనపై సీఎం చేస్తున్న వ్యాఖ్యలను కూడా శ్రవణ్‌కుమార్ తప్పుబట్టారు. కేసీఆర్ ఏం చేస్తున్నారో తెలియకుండా విమర్శలు చేయడం తగదన్నారు. కేసీఆర్, కేటీఆర్‌పై నోరు అదుపులో పెట్టుకోవాలని రేవంత్‌రెడ్డిని హెచ్చరించారు.
కేసీఆర్, కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు కొనసాగితే ఉప్పల్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నిరసన చేపడతాయని తెలిపారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 16 డివిజన్ల నుంచి బీఆర్ఎస్ కుటుంబ సభ్యులు తరలివస్తారని శ్రవణ్‌కుమార్ హెచ్చరించారు.

# మాల విద్యార్థి నిరుద్యోగుల రణభేరి..

**రోస్టర్ విధానంలో న్యాయమైన ప్రాతినిధ్యం కోసం ఓయూలో రాష్ట్రస్థాయి సమావేశం.**
**అక్టోబర్ మొదటి వారంలో 'మాల విద్యార్థి నిరుద్యోగుల రణభేరి' పేరుతో మహాసభ..**

**ఉస్మానియా యూనివర్సిటీ, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 6 :**
తెలంగాణలో రిజర్వేషన్లు, రోస్టర్ విధానం కారణంగా మాల విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కాలేజీలో రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. మాల స్టూడెంట్స్ జేఏసీ, అంసా, ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో విద్య, ఉద్యోగాలు, ప్రమోషన్లలో మాల వర్గానికి జరుగుతున్న నష్టాలపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థి నాయకులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, మాల సంఘాల ప్రతినిధులు, యువత, మేధావులు, సామాజిక కార్యకర్తలు సమావేశానికి హాజరయ్యారు. ఇప్పటివరకు వెలువడిన 25 ఉద్యోగ నోటిఫికేషన్లలో రోస్టర్ విధానం కారణంగా మాల వర్గానికి తీవ్ర నష్టం జరిగిందని ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు.



సుమారు 19 నోటిఫికేషన్లలో కనీసం ఒక్క పోస్టు కూడా కేటాయించకుండా 'జీరో పోస్టులు' చూపించారని పేర్కొన్నారు. ఈ సమస్యపై ప్రభుత్వ గణాంకాలు, ఉద్యోగ నోటిఫికేషన్లు, రోస్టర్ వివరాలు, అధికారిక రికార్డులను సమగ్రంగా సేకరించి అధ్యయనం చేయాలని సమావేశం నిర్ణయించింది. వాస్తవ పరిస్థితులను ఆధారాలతో ప్రజల ముందుకు తీసుకెళ్లడంతో పాటు, రాజ్యాంగబద్ధమైన పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని నిర్ణయించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కాలేజీ వేదికగా ఐదుగురు విద్యార్థి నాయకులతో ప్రారంభమైన ఈ పోరాటం ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల మందికి పైగా విద్యార్థులు, నిరుద్యోగుల మద్దతుతో ఉద్యమంగా రూపుదిద్దుకుందని ప్రతినిధులు తెలిపారు. ఉద్యమాన్ని మరింత విస్తృతం చేసేందుకు జిల్లాలు, మండలాలు, నియోజకవర్గ కేంద్రాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు, సన్నాహక సమావేశాలు, ప్రెస్‌మీట్లు నిర్వహించి అవగాహన కల్పించాలని నిర్ణయించారు. ఈ మేరకు అక్టోబర్ మొదటి వారంలో ఆదివారం ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కాలేజీ వేదికగా 'మాల విద్యార్థి నిరుద్యోగుల రణభేరి' పేరుతో రాష్ట్రస్థాయి మహాసభ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి మాల విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, యువత, మాల సంఘాల నాయకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, మేధావులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. సమావేశంలో మాదాసు రాహుల్ మాల స్టూడెంట్ జేఏసీ చైర్మన్, నామ సైదులు అంసా ఓయూ అధ్యక్షులు, పండుగ భానుతేజ, మద్దెల రాజు, చిక్కుడు వెంకట్, ఏనపోతుల అరుణ్‌కుమార్, బత్తుల రమేష్, దిలీప్, అర్జున్ కొప్పుల, బాలరాజు, జయప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్‌రెడ్డి కేసీఆర్ పై విమర్శలు మానుకోవాలి: బీఆర్ఎస్ నాయకుడు శ్రవణ్‌కుమార్

**కేసీఆర్, కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు..**
**ఆరు హామీల అమలుపై ప్రజలకు సమాధానం చెప్పాలి..**
**లేకుంటే ఉద్యమం ఉధృతం చేస్తాం..**

**నాచారం, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 6 :**
మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలను బీఆర్ఎస్ మల్లాపూర్ డివిజన్ నాయకుడు శ్రవణ్‌కుమార్ తీవ్రంగా ఖండించారు. మల్లాపూర్ లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర సమస్యలపై దృష్టి సారించకుండా రాజకీయ ప్రత్యర్థులపై వ్యక్తిగత విమర్శలు చేయడం ముఖ్యమంత్రికి తగదన్నారు. కేసీఆర్ రాజీనామా చేయాలని రేవంత్‌రెడ్డి డిమాండ్ చేయడాన్ని శ్రవణ్‌కుమార్ తప్పుబట్టారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం కోసం కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రస్తావిస్తూ.. యాదాద్రి ఆలయ అభివృద్ధి, కాళేశ్వరం ప్రాజెక్టు, బస్తీ దవాఖానాలు, ఆరోగ్యశ్రీతో పాటు వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, గీత



కార్మికులు తదితర వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. అలాంటి పాలనపై విమర్శలు చేసే ముందు కాంగ్రెస్ ప్రభుత్వం తన పనితీరును ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రకటించిన ఆరు హామీల్లో ఇప్పటివరకు ఎన్ని హామీలను పూర్తిస్థాయిలో అమలు చేశారో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు స్పష్టంగా వివరించాలని శ్రవణ్ కుమార్ కోరారు. వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, ప్రభుత్వ పనితీరుపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధికార పక్షంపైనే ఉందన్నారు. ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ.. ముఖ్యమంత్రి నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల వరకు తమ పనితీరుపై ప్రజలకు జవాబుదారీగా ఉండాలని అన్నారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ పాలనపై రేవంత్‌రెడ్డి చేస్తున్న విమర్శలను కూడా ఆయన ప్రస్తావించారు. కేసీఆర్ ప్రస్తుతం ఏం చేస్తున్నారో తెలుసుకోకుండా రాజకీయ విమర్శలు చేయడం సమంజసం కాదన్నారు. కేసీఆర్, కేటీఆర్‌పై వ్యక్తిగత, అనుచిత వ్యాఖ్యలు చేయకుండా సీఎం తన భాషను నియంత్రించుకోవాలని సూచించారు. ఇకపై కూడా కేసీఆర్, కేటీఆర్ పై ఇదే తరహా వ్యాఖ్యలు కొనసాగితే బీఆర్ఎస్ శ్రేణులు ప్రత్యక్ష ఆందోళనలకు దిగుతాయని శ్రవణ్ కుమార్ హెచ్చరించారు. ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 16 డివిజన్ల నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నిరసన కార్యక్రమాలు చేపడతారని స్పష్టం చేశారు.

# మాణిక్యేశ్వరి నగర్‌లో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు..

**భక్తులకు అన్నప్రసాద వితరణ.. భారీగా తరలివచ్చిన ప్రజలు..**


**సీతాఫల్ మండీ, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 6 :**
శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని సీతాఫల్ మండీ డివిజన్ పరిధిలోని మాణిక్యేశ్వరి నగర్‌లో ఆదివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కంప్రెసర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో భాగంగా భక్తుల కోసం ప్రత్యేకంగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గండికోట కుమార్ తన సౌజన్యంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. కార్యక్రమానికి ఎన్ఎస్ యు ఐ తెలంగాణ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఆదం సుజన్ ముఖ్య అతిథిగా హాజరై వేడుకల్లో పాల్గొన్నారు. మాణిక్యేశ్వరి నగర్ తో పాటు పరిసర



ప్రాంతాల నుంచి భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమం విజయవంతం కావడంతో నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన భక్తులు, స్థానిక ప్రజలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గండికోట కుమార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సికింద్రాబాద్, వడ్డే ఓబన్న ఉత్సవ కమిటీ మెంబర్ తదితరులు పాల్గొన్నారు.



# గోవాలో అంతర్జాతీయ తెలుగు కేంద్రం



**రవీంద్ర భారతి , ట్రైనెట్ న్యూస్ , సెప్టెంబర్ 6:**
గోవా రాష్ట్రంలో అంతర్జాతీయ తెలుగు కేంద్రం ఏర్పాటు కోసం అనువైన స్థలాన్ని గుర్తించాలని గోవా ప్రభుత్వం కలెక్టర్ కార్యాలయానికి ఆదేశాలు జారీ చేయడం పట్ల ఫెడరేషన్ ఆఫ్ తెలుగు అసోసియేషన్స్ ఆఫ్ మహారాష్ట్ర అధ్యక్షుడు జగన్ బాబు గంజి, ప్రధాన కార్యదర్శి అశోక్ కంటే లు హర్షం వ్యక్తం చేశారు. గోవాలో ఫెడరేషన్ ఆఫ్ తెలుగు అసోసియేషన్స్ ఆఫ్ మహారాష్ట్ర ఆధ్వర్యంలో నిర్వహించిన వారధి, కవి సమ్మేళనం వంటి వివిధ కార్యక్రమాలకు విశేష స్పందన లభించింది. గోవాలో అంతర్జాతీయ తెలుగు కేంద్రం ఏర్పాటు చెయ్యాలని
గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజు కు మే నెలలో ఫెడరేషన్ ఆఫ్ తెలుగు అసోసియేషన్స్ ఆఫ్ మహారాష్ట్ర ప్రతినిధులు వినతి పత్రం సమర్పించారు. దానికి గవర్నర్ అశోక్ గజపతి రాజు ఆమోద ముద్ర వేసి రెవిన్యూ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జగన్ బాబు గంజి , అశోక్ కంటే లు
మాట్లాడుతూ, తెలుగు అంతర్జాతీయ కేంద్రం
తెలుగు భాషను ప్రోత్సహించడంతో పాటు, గోవాలో సాంస్కృతిక సహకారాన్ని పెంపొందించడానికి పర్యాటకాన్ని ప్రోత్సహించడానికి దోహదపడుతుందని వారు పేర్కొన్నారు. అంతర్జాతీయ తెలుగు కేంద్రం ఏర్పాటుకు సహకరించిన
గోవా గవర్నర్, ముఖ్యమంత్రి, అధికారులందరికీ జగన్‌బాబు గంజి, అశోక్ కంటే కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, దేశం నలుమూలలా విదేశాల్లో ఉన్న తెలుగు వారు
ఈ ప్రాజెక్టులో పాల్గొని, తమ ఆలోచనలు, భాగస్వామ్యం అందించి మద్దతు ఇవ్వాలని వారు కోరారు. ఫెడరేషన్ ఆఫ్ తెలుగు అసోసియేషన్స్ ఆఫ్ మహారాష్ట్ర అధ్యక్షులు జగన్‌బాబు గంజి, కార్యదర్శి అశోక్ కంటే లు గోవా లో తెలుగు అంతర్జాతీయ కేంద్రం కోసం విశేష చేసినందుకుగాను పలువురు తెలుగు మేధావులు అభినందించారు.

# అక్టోబర్ లో మాల విద్యార్థి నిరుద్యోగుల రణభేరి

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్06**



రిజర్వేషన్లు, రోస్టర్ విధానంలో మాల విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులకు జరుగుతున్న నష్టాలను పరిష్కరించి న్యాయమైన ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ మొదటి వారంలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రాష్ట్రస్థాయి మహాసభ నిర్వహించనున్నట్లు మాల స్టూడెంట్ జేఏసీ, అంసా, ఐక్య విద్యార్థి సంఘాల ప్రతినిధులు ప్రకటించారు. ఓయూ ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.
రాష్ట్రంలో ఇటీవల వెలువడిన 25 ఉద్యోగ నోటిఫికేషన్లను పరిశీలిస్తే రోస్టర్ విధానం వల్ల మాల వర్గాలకు తీవ్ర అన్యాయం జరిగిందని ప్రతినిధులు ఆరోపించారు. ఇందులో సుమారు 19 నోటిఫికేషన్లలో ఒక్క పోస్టు కూడా దక్కని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. విద్య, ఉద్యోగాలు, పదోన్నతుల్లో రిజర్వేషన్ ప్రయోజనాలు సక్రమంగా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.
ఓయూ ఆర్ట్స్ కళాశాల వేదికగా కొద్దిమంది విద్యార్థి నాయకులతో ప్రారంభమైన తమ పోరాటానికి ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఐదు లక్షల మందికిపైగా విద్యార్థులు, నిరుద్యోగుల మద్దతు ఉందని నిర్వాహకులు తెలిపారు. ఉద్యమాన్ని అన్ని జిల్లాలు, మండలాలు, నియోజకవర్గ కేంద్రాలకు విస్తరించేందుకు రౌండ్‌టేబుల్ సమావేశాలు, సన్నాహక సమావేశాలు, ప్రెస్‌మీట్లు నిర్వహించాలని నిర్ణయించారు.
అక్టోబర్ మొదటి వారంలో ఆదివారం ఓయూ ఆర్ట్స్ కళాశాలలో 'మాల విద్యార్థి నిరుద్యోగుల రణభేరి' పేరుతో నిర్వహించే మహాసభకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, యువత, మాల సంఘాల నాయకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, మేధావులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.
ఈ సమావేశంలో మాల స్టూడెంట్ జేఏసీ చైర్మన్ మాదాసు రాహుల్, వైస్ చైర్మన్ పండుగ భానుతేజ, మాల స్టూడెంట్ జేఏసీ నాయకులు మద్దెల రాజు, బత్తుల రమేష్, దిలీప్, అంసా ఓయూ అధ్యక్షుడు నామ సైదులు, అంసా గ్రేటర్ హైదరాబాద్ నాయకుడు చిక్కుడు వెంకట్, ఏనపోతుల అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నిరాశ్రయులు, సంచారజాతులకు దుస్తుల పంపిణీ



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 6:**
నగరంలోని రోడ్ల పక్కన, ఫుట్‌పాత్‌లపై జీవనం సాగిస్తున్న అనాథలు, నిరాశ్రయులు, సంచారజాతుల కుటుంబాలకు స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సమాజంలో ఆదరణకు నోచుకోని వారికి అండగా నిలిచేందుకు ప్రతి ఆదివారం వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా దుస్తులు అందుకున్న వారు సంతోషం వ్యక్తం చేస్తూ స్కై ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు వై. సంజీవ కుమార్, ఉపాధ్యక్షురాలు ఓ. పావని పాల్గొన్నారు.

# శాసనాల్లో శ్రీవారి బ్రహ్మోత్సవ చరిత్ర

**వెయ్యేళ్లకు పైగా కొనసాగుతున్న ఉత్సవ వైభవం...**
**రాజులకాలం నుండి టీటీడీ నిర్వహణ వరకు సాగిన అపూర్వ పరిణామం**

**తిరుపతి, త్రినెట్ న్యూస్, సెప్టెంబర్ 6:**
తిరుమలలో బ్రహ్మోత్సవాలంటే... తొమ్మిది రోజుల పాటు సప్తగిరులు భక్తి పారవశ్యంతో మార్మోగే మహోత్సవం. ధ్వజారోహణం నుంచి చక్రస్నానం వరకు, ఉదయం--సాయంత్రం వాహన సేవల నుంచి లక్షలాది మంది భక్తుల గోవింద నామస్మరణ వరకు, నేడు కనిపిస్తున్న ఈ వైభవం ఒక్కరోజులో రూపుదిద్దుకున్నది కాదు. శతాబ్దాలుగా రాజులు, రాణులు, సామంతులు, అధికారులు, భక్తులు అందించిన దానధర్మాలు, ఆలయ పరిపాలనా పరిణామాలు, ఆగమ సంప్రదాయాలు, కాలానుగుణంగా ఏర్పడిన ఉత్సవాలు ఇవన్నీ కలసి నేటి శ్రీవారి బ్రహ్మోత్సవాల రూపాన్ని తీర్చిదిద్దాయి. ఆ చరిత్రకు పురాణాలు మాత్రమే ఆధారం కాదు. తిరుమల ఆలయ గోడలపై చెక్కిన శాసనాలే ఈ ఉత్సవ పరిణామానికి అత్యంత విలువైన చారిత్రక ఆధారాలు. టీటీడీ ప్రచురించిన శాసన సంపుటాలు, చారిత్రక గ్రంథాలు ఈ వైభవానికి సంబంధించిన అనేక ఆసక్తికరమైన విషయాలను వెలుగులోకి తెస్తున్నాయి.

**బ్రహ్మ నిర్వహించిన ఉత్సవం**

**శ్రీవారి బ్రహ్మోత్సవాల ఆవిర్భావానికి పురాణ పరంపరలో ప్రత్యేకమైన కథనం ఉంది. శ్రీనివాసుడు వెంకటాద్రిపై అవతరించిన సందర్భంగా బ్రహ్మదేవుడు తొలిసారిగా ఉత్సవాలను నిర్వహించాడని అందుకే ఈ ఉత్సవానికి 'బ్రహ్మోత్సవం' అనే పేరు వచ్చిందని పురాణ ప్రాశస్త్యం.**

సామాన్య శకం 966 సంవత్సరం ఒక కీలక మైలురాయి. పల్లవ రాజవంశానికి చెందిన రాణి సామవై పెరుందేవి శ్రీ వేంకటేశ్వరస్వామివారికి వెండి భోగ శ్రీనివాసమూర్తిని సమర్పించింది. ఆమె అనేక ఆభరణాలతో పాటు ఉత్సవాల నిర్వహణకు భూములను కూడా దానం చేసింది. ఆమె దానశాసనం తిరుమల ఆలయ మొదటి ప్రాకారంలోని ఉత్తర గోడపై చెక్కబడి ఉంది. ఈ శాసనం ఆధారంగా 10వ శతాబ్దంలోనే బ్రహ్మోత్సవాలు వ్యవస్థీకృతంగా నిర్వహించబడుతున్నట్లు తెలుస్తోంది. పెరటాసి మాసంలో ప్రధాన బ్రహ్మోత్సవంతో పాటు మార్గశిర మాసంలో మరో బ్రహ్మోత్సవం నిర్వహించేందుకు సామవై ఏర్పాట్లు చేసింది. ఆమె దానం చేసిన భోగ శ్రీనివాసమూర్తి ఆలయ ఉత్సవ సంప్రదాయంలో మరో ముఖ్యమైన అధ్యాయానికి నాంది పలికింది.

**రెండు ఉత్సవాల నుంచి... ఐదు బ్రహ్మోత్సవాల వరకు**

10వ శతాబ్దంలో కనిపించే ఈ సంప్రదాయం అక్కడితో ఆగలేదు. చోళుల కాలంలో బ్రహ్మోత్సవాల సంఖ్య క్రమంగా పెరిగింది. పెరటాసి, మార్గళి తర్వాత పాంగుని బ్రహ్మోత్సవాన్ని



యాదవరాయ సామంతుడు వీర నరసింహ యాదవరాయ కాలానికి ఆపాదించారు. 1254లో చోళ రాజు విజయ గండగోపాలదేవుని కాలంలో చిత్తిరై బ్రహ్మోత్సవం చేరింది. 1300--1330 మధ్య మరో యాదవరాయ సామంతుడి ఆధ్వర్యంలో ఆడి బ్రహ్మోత్సవం ఏర్పడింది. అలా విజయనగర సామ్రాజ్యం ఏర్పడే నాటికి తిరుమలలో సంవత్సరానికి ఐదు బ్రహ్మోత్సవాలు నిర్వహించబడ్డాయి. వాటిలో మూడు చోళుల కాలంలో, రెండు యాదవరాయుల కాలంలో ఏర్పడ్డాయి.

**విజయనగర సామ్రాజ్యం... ఉత్సవ వైభవానికి స్వర్ణయుగం**

సంగమ, సాళువ, తుళువ, ఆరవీడు వంశాల కాలంలో ఆలయంలో ఉత్సవాల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. సంగమ వంశం కాలంలో కొత్త బ్రహ్మోత్సవాలు చేరగా, తరువాత తుళువుల కాలంలో మరిన్ని ఉత్సవాలు ఏర్పడ్డాయి. 15వ శతాబ్దం నాటికి తిరుమలలో సంవత్సరానికి అనేక బ్రహ్మోత్సవాలు నిర్వహించే స్థాయికి ఈ సంప్రదాయం చేరింది. విజయనగర కాలం చివరి దశకు వచ్చేసరికి శాసనాల్లో సంవత్సరానికి పది బ్రహ్మోత్సవాల వరకు నమోదయ్యాయి. 1539 నుంచి 1616 మధ్య పది వార్షిక బ్రహ్మోత్సవాల ప్రస్తావనలు శాసనాల్లో కనిపిస్తాయి. అంటే... నేడు సంవత్సరంలో ఒకటి లేదా అధికమాసం వచ్చినప్పుడు రెండు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నామన్న విషయం వెనుక, ఒకప్పుడు సంవత్సరానికి అనేక బ్రహ్మోత్సవాలు నిర్వహించిన సుదీర్ఘ చరిత్ర దాగి ఉంది. 1513 ఫిబ్రవరి 10న ఆయన తొలిసారి తిరుమలను దర్శించినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. 1513లో తన జన్మమాసమైన తై మాసంలో కొత్త బ్రహ్మోత్సవాన్ని ఆయన ఏర్పాటు చేశాడు. అంటే ఆయన సేవ కేవలం ఆభరణాలు, నిర్మాణాలు, కానుకలకే పరిమితం కాలేదు. శ్రీవారి ఉత్సవ సంప్రదాయాన్ని విస్తరించడంలోనూ ఆయన పాత్ర ఉంది.

**అచ్యుతరాయల కాలంలో మరో కొత్త అధ్యాయం**

కృష్ణదేవరాయల తరువాత అచ్యుతరాయల కాలంలోనూ ఉత్సవాలకు రాజపోషణ కొనసాగింది. 1533లో కార్తీక బ్రహ్మోత్సవానికి సంబంధించిన తొలి ప్రస్తావన కనిపిస్తుంది. 1534లో ఈ ఉత్సవానికి విరాళం అందించినట్లు ఒక శాసనం



చెబుతోంది. అచ్యుతరాయల కాలంలో ఈ ఉత్సవానికి నిరంతరంగా దానాలు అందడం, అది రాజ ప్రోత్సాహంతోనే ఏర్పడినట్లు చరిత్రకారులు భావించడానికి ఆధారంగా నిలుస్తోంది. 1539లో తాళ్లపాక పెద తిరుమలయ్యంగార్ ఆధ్వర్యంలో ఆణి బ్రహ్మోత్సవం ఏర్పడటంతో వార్షిక బ్రహ్మోత్సవాల సంఖ్య మరోసారి పెరిగింది. ఇది తిరుమల ఉత్సవాల చరిత్రలో ఒక ముఖ్యమైన విషయాన్ని చెబుతోంది. కాలానుగుణంగా కొత్త ఉత్సవాలు చేరుతూ, కొన్ని మారుతూ, మరికొన్ని నిలిచిపోతూ ఒక సజీవ సంప్రదాయంగా అభివృద్ధి చెందింది.

తిరుమల బ్రహ్మోత్సవాల పరిణామంలో మరో కీలక ఘట్టం ఉత్సవమూర్తి మార్పు.

1339 ప్రాంతం నుంచి మలయప్పస్వామివారు ఉత్సవమూర్తిగా ఉపయోగించబడుతున్నట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. శ్రీదేవి, భూదేవి సమేతంగా మలయప్పస్వామివారికి వివాహోత్సవాలు, ఇతర ఉత్సవాలతో పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించే సంప్రదాయం ఏర్పడింది. నేడు మనం వాహన సేవల్లో దర్శించే శ్రీ మలయప్పస్వామి సంప్రదాయానికి ఇదే చారిత్రక నేపథ్యం.

**మహంతుల కాలం నుంచి టీటీడీ వరకు...**

19వ శతాబ్దంలో తిరుమల ఆలయ పరిపాలనలో మరో పెద్ద మార్పు వచ్చింది. 1843లో ఆలయ పరిపాలనా బాధ్యతలు హథీరాంజీ మఠాధిపతుల ఆధీనంలోకి వెళ్లాయి. మహంతుల పరిపాలన 1933 వరకు కొనసాగింది. 1933లో తిరుమల తిరుపతి దేవస్థానములు ఏర్పడటంతో మహంతుల పరిపాలన ముగిసి, ఆలయాలు కొత్త సంస్థాగత పరిపాలనా వ్యవస్థలోకి వచ్చాయి. ఆ తరువాత శ్రీవారి ఆలయంతో పాటు ఇతర దేవాలయాల ఉత్సవాలను కూడా టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించే వ్యవస్థ బలపడింది.

అక్కడి నుంచి బ్రహ్మోత్సవం కేవలం ఆలయ ఉత్సవంగా కాకుండా భక్తుల సౌకర్యం, వసతి, రవాణా, భద్రత, వైద్య సేవలు, అన్నప్రసాదం, సమాచార వ్యవస్థ, ప్రత్యక్ష ప్రసారాలు వంటి అనేక విభాగాలతో కూడిన భారీ సంస్థాగత కార్యక్రమంగా రూపాంతరం చెందింది.

# ఫోక్ డ్యాన్సర్ మాధురి రాథోడ్ ఆత్మహత్యాయత్నం

**హైదరాబాద్, త్రినెట్ న్యూస్ సెప్టెంబర్ 6:**



ఫోక్ డ్యాన్సర్ మాధురి రాథోడ్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఫోక్ డ్యాన్సర్ ఈశ్వర్ సాయిని పోలీసులు అరెస్టు చేయకపోవడంతో ఆమె తీవ్ర మనస్తాపానికి గురైంది. ఈశ్వర్ సాయి పై ఫిర్యాదు చేసిన మూడు రోజులకే ఆమె ఆత్మహత్యాయత్నం
చేసుకున్న ఘటన ఆలస్యంగా
వెలుగులోకి వచ్చింది. గత ఆగస్టు 22వ తేదీన నార్సింగి పోలీస్ స్టేషన్‌లో ఫోక్ డ్యాన్సర్ ఈశ్వర్ సాయిపై కేసు నమోదైన విషయం తెలిసిందే. తనపై నమోదైన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ తెలంగాణ హైకోర్టును ఈశ్వర్ సాయి ఆశ్రయించాడు. పెళ్లి పేరుతో నమ్మించి తనను మోసం చేశాడంటూ బాధితురాలు మాధురి రాథోడ్ ఆవేదన వ్యక్తం చేశారు. అతడిని పోలీసులు అరెస్టు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ ఆరోపించారు. ఈ కేసు నమోదైన తర్వాత ఈశ్వర్ సాయి పరారీలో ఉన్నాడు. అతడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం





**త్రినెట్ న్యూస్,యాదాద్రి భువనగిరి, సెప్టెంబరు06:**
యాదాద్రి భువనగిరి జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న జడ్పీహెచ్ఎస్ మోత్కూర్ ఉపాధ్యాయుడు ఇండ్ల రాంప్రసాద్, జడ్పీహెచ్ఎస్ పాటిమట్ల ఉపాధ్యాయుడు దర్శనం వెంకన్న,మరియు ఎంపీ యుపిఎస్ కాంచనపల్లి ఉపాధ్యాయుడు కూరెళ్ల యాకస్వామిలకు శుభాకాంక్షలు తెలియచేస్తూ మోత్కూర్ పట్టణ కేంద్రంలో ఘనంగా శాలువాలతో సన్మానించి ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా స్థాయి అవార్డులు రావడం ఈ ప్రాంతానికే గర్వకారణం అని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిప్పలపల్లి మహేంద్రనాథ్, బిఆర్ఎస్ నాయకులు మర్రి అనిల్ అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు దాసరి తిరుమలేష్, కూరెళ్ల పరమేష్, ప్రభుత్వ ఉపాధ్యాయులు మందుల కృష్ణయ్య,కూరెళ్ల రవి, దళిత నాయకులు కూరెళ్ల రమేష్, చుక్క అశోక్, కొంపెల్లి మల్లెష్, కూరెళ్ల శ్రీశైలం, కూరెళ్ల నర్సింహా, చెడిపెల్లి ఆనంద్ మరియు కందుకూరి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 7 న చలో అమరావతి ఎమ్మార్పీఎస్ జాతీయ మహా సభను విజయవంతం చేద్దాం

**అసమానతలు లేని సమాజాన్ని నిర్మిద్దాం**
**యాదాద్రి భువనగిరి జిల్లా ఇంచార్జి బిర్రు మహేందర్ మాదిగ**

**త్రినెట్ న్యూస్, యాదాద్రి భువనగిరి, సెప్టెంబరు06:**
యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్ పి మండల స్థాయి సమావేశం ఎంఎస్పీ మాజీ జిల్లా అధ్యక్షులు ఆలేరు నియోజకవర్గం,మండల ఇంచార్జీ నల్ల చంద్ర స్వామి మాదిగ, మండల కో ఇంచార్జీ మందుల లింగ స్వామి మాదిగ ల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ ఎం ఎస్ పి యాదాద్రి భువనగిరి జిల్లా ఇంచార్జ్ బిర్రు మహేందర్ మాదిగ హాజరై మాట్లాడుతూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు అక్టోబర్ 7 న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతిలో జరుగబోయే జాతీయ ఎంఆర్పిఎస్ ఎంఎస్పి నూతన మండల కమిటీ సదస్సును జయప్రదం చేయాలని పిలుపునివ్వడం జరిగింది.అసమానతలు లేని సమాజ నిర్మాణంకై ముందుకు నడువాలని అన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన ఎంఎస్పీ మాజీ జిల్లా అధ్యక్షులు ఎమ్మార్పియస్ ఆలేరు నియోజకవర్గం ఇంచార్జీ నల్ల చంద్ర స్వామి మాదిగ మాట్లాడుతూ పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు సామాజిక,ఆర్థిక అసమానతల పై భవిష్యత్ ఉద్యమం జరుగుతుంది అని



సమాజం లో అందరిని కలిపి ఉద్యమాలకు సిద్ధం చేయాలని అన్నారు. అనంతరం ఎమ్మార్పియస్ ఎంఎస్పీ, ఎమ్మెసేఫ్,మాదిగ మహిళ సమాఖ్య,మండల కమిటి, పట్టణ కమిటీల ఎన్నిక జరిగింది.నూతన ఆత్మకూరు (ఎం)మండల ఎమ్మార్పియస్
మండల కమిటీ అధ్యక్షులుగా మామిడి అనిల్ మాదిగ , అధికార ప్రతినిధిగా వస్తుప్పుల నరేష్ మాదిగ, ప్రధాన కార్యదర్శి గురుకు విజయ్ మాదిగ, ఉపాధ్యక్షులుగా పత్తెపురం వంశీ మాదిగ;
ఎంఎస్పీ ఆత్మకూరు(ఎం) మండల కమిటీ అధ్యక్షులుగా జిట్టా యాదగిరి మాదిగ,అధికార ప్రతినిధిగా మందుల విజయ్ మాదిగ,ప్రధాన కార్యదర్శిగా కూరెళ్ల రవి మాదిగ,మాదిగ మహిళ సమాఖ్య అధ్యక్షులుగా గురుకు సంతోష మాదిగ,
అధికార ప్రతినిధిగా దుప్పెల్లి సరిత మాదిగ,ప్రధాన కార్యదర్శిగా వేముల భాగ్యమ్మ మాదిగ,మాదిగ విద్యార్థి సమాఖ్య అధ్యక్షులుగా గాదె మోహన్ మాదిగ;పట్టణ అధ్యక్షులుగా ఇంజమూరి నరేష్ మాదిగ,అధికార ప్రతినిధిగా



గట్టు రాజేష్ మాదిగ,ప్రధాన కార్యదర్శిగా గట్టు అజయ్ మాదిగలు ఎన్నికయ్యారు.మాదిగ ఉద్యోగ సమాఖ్య బాధ్యులుగా వేముల నర్సింహ్మా మాదిగ, మేడి రామ్ లక్ష్మణ్ మాదిగ;సోషల్ మీడియా కన్వీనర్ గా బద్దుల మనోజ్ మాదిగ,జిల్లా కమిటీకి, నియోజకవర్గం కమిటీకి గట్టు రాములు మాదిగ,భూషి చంద్రయ్య మాదిగ, తుమ్మలగూడెం యాదయ్య మాదిగ, గట్టు జ్ఞానేశ్వర్ మాదిగ,గురుకు యాదగిరి మాదిగ లు ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పియస్ నాయకులు మాదిగ ప్రజా ప్రతినిధులు గడ్డం ముత్తమ్మ, కానుకుంట్ల యాదగిరి మాదిగ, సుంకిశాల ఎల్లయ్య మాదిగ, వస్తుపుల జంగులు మాదిగ, గట్టు శేఖర్ మాదిగ,గట్టు రాజు మాదిగ, కొంగరి విద్యాసాగర్ మాదిగ,వేముల గణేష్ మాదిగలు ఎన్నికైనారు.

# మంత్రి శ్రీధర్‌బాబుతో నీతి ఆయోగ్ సభ్యుడు డా. వీకే సారస్వత్ భేటీ

**'తెలంగాణ సిలికాన్ ఫోటోనిక్స్ మిషన్'కు వ్యూహాత్మక రోడ్‌మ్యాప్‌ను రూపొందించడంపై చర్చ**

**హైదరాబాద్, త్రినెట్ న్యూస్, సెప్టెంబర్ 6:**
నీతి ఆయోగ్ సభ్యుడు డా. వీకే సారస్వత్ ఆదివారం డా. బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. సిలికాన్ ఫోటోనిక్స్ రంగంలో ఉన్న అవకాశాలను తెలంగాణ అందిపుచ్చుకునేలా 'తెలంగాణ సిలికాన్ ఫోటోనిక్స్ మిషన్'కు దశలవారీ వ్యూహాత్మక రోడ్‌మ్యాప్‌ను రూపొందించడంపై ప్రధానంగా చర్చించారు. ఫోటోనిక్స్ వ్యాలీ కార్పొరేషన్ భవిష్యత్ కార్యాచరణ, ఇండియా సెమీకండక్టర్ మిషన్--2.0తో 'తెలంగాణ సిలికాన్ ఫోటోనిక్స్ మిషన్'ను అనుసంధానించేందుకు గల అవకాశాలపై సమీక్షించారు. రాష్ట్రంలో పరిశోధన నుంచి వాణిజ్య స్థాయి తయారీ వరకు సమగ్ర సిలికాన్ ఫోటోనిక్స్ ఎకోసిస్టమ్ అభివృద్ధి చేయడం, డిజైన్, పరిశోధన, తయారీ, ప్యాకేజింగ్, టెస్టింగ్, సరఫరా వ్యవస్థలను అనుసంధానించడంపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. పరిశోధన ఫలితాలను వాణిజ్యపరమైన సాంకేతిక పరిష్కారాలు, ఉత్పత్తులుగా మలిచేలా పరిశ్రమలు, విద్యాసంస్థలు, పరిశోధనా సంస్థల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. రాబోయే రోజుల్లో అధునాతన ఫోటోనిక్ ప్యాకేజింగ్, కో-ప్యాకేజ్డ్ ఆప్టిక్స్ లాంటి తదుపరి తరం సాంకేతికతల్లో తెలంగాణను కీలక కేంద్రంగా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. అందుకు అనుగుణంగా నిపుణులు, పరిశోధనా సంస్థలు, పరిశ్రమలతో కలిసి సమగ్ర



కార్యచరణ ప్రణాళికను రూపొందించడంపై ఇప్పటి నుంచే దృష్టి సారించామన్నారు. త్వరలో ఏర్పాటు చేయనున్న 'సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ క్వాంటం కంప్యూటింగ్'లో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని డా. వీకే సారస్వత్‌ను మంత్రి శ్రీధర్‌బాబు ఆహ్వానించారు. ఫోటోనిక్స్, క్వాంటం కంప్యూటింగ్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయబోయే అడ్వైజరీ కౌన్సిల్‌కు నేతృత్వం వహించాలని కూడా కోరారు. ఫోటోనిక్స్, క్వాంటం కంప్యూటింగ్ లాంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాల్లో తెలంగాణతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నానని డా.వీకే సారస్వత్ పేర్కొన్నారు. ఈ రంగాల్లో పరిశోధన, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు తనవంతు సహకారాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి అందిస్తానన్నారు. సమావేశంలో ఐటీఈఅండ్సీ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, ఫోటోనిక్స్ వ్యాలీ కార్పొరేషన్ సీఈవో ఏఎస్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మోసపూరిత పాలనపై పల్లెల్లో విధ్వంసం పడకేసిన పారిశుద్ధ్యం

**బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ పనకబండ గ్రామం**

**త్రినెట్ న్యూస్,యాదాద్రి భువనగిరి, సెప్టెంబరు06:**




యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం పనకబండ గ్రామంలో ఆదివారం రోజు బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో 1000 రోజుల కాంగ్రెస్ మోసపూరిత పాలనపై పల్లెల్లో విధ్వంసం పడకేసిన పారిశుధ్యానికి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు లోతుకుంట స్వామి గ్రామ సర్పంచ్ లోతుకుంట రేణుక అనిల్ కుమార్ మాజీ సర్పంచ్ బత్తిని తిరుమలేష్ గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి బత్తిని మహేష్ వార్డ్ మెంబెర్ బత్తిని మల్లేష్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ పోన్నె బోయిన మచ్చగిరి బిఆర్ఎస్ పార్టీ నాయకులు పైళ్ల బుచ్చయ్య పైళ్ల రమేష్ నల్లబోగుల ఉప్పలయ్య లోతకుంట మచ్చగిరి బత్తిని సోమయ్య బత్తిని మురళి పైళ్ల మచ్చగిరి బత్తిని రామలింగయ్య లోతుకుంట నరేందర్ ఎండి అక్బర్ బశిపాక సైదులు తదితరులు పాల్గొన్నారు.

ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
సోమవారం సెప్టెంబర్ 07, 2026
www.trinetnews.com

# మహంకాళి జిల్లా బీజేపీ ఇంటెలెక్చువల్ సెల్ ఇన్‌చార్జ్ గా శ్రీరామ్ వెంకట్..

**తార్నాక, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 6 :** సమాజంలోని మేధావులు, విద్యావంతులు, నిపుణులు, యువత ఆలోచనలను ప్రజా సమస్యల పరిష్కారానికి అనుసంధానం చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని మహంకాళి జిల్లా బీజేపీ ఇంటెలెక్చువల్ సెల్ నూతన ఇన్‌చార్జ్ శ్రీరామ్ వెంకట్ తెలిపారు. ఆయన నియామకంతో జిల్లా స్థాయిలో వివిధ రంగాల నిపుణులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడే విధానపరమైన చర్చలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు నాయకత్వంలో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంతో పాటు, వైద్యులు, న్యాయవాదులు, ఇంజినీర్లు, విద్యావేత్తలు, ఐటీ నిపుణులు, పారిశ్రామికవేత్తలు, పరిశోధకులు, ఆర్థిక నిపుణులు, సామాజిక రంగ ప్రముఖులు, యువ ప్రొఫెషనల్స్ ను కలుపుకొని ముందుకు సాగనున్నట్లు శ్రీరామ్ వెంకట్ చెప్పారు. రౌండ్ టేబుల్ సమావేశాలు, పాలసీ డైలాగ్స్, నిపుణుల చర్చలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేసి పరిష్కార మార్గాలను రూపొందిస్తామని తెలిపారు. కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి మార్గదర్శకత్వం, బీజేపీ సీనియర్



నాయకులు డా. కె. లక్ష్మణ్ స్ఫూర్తి తనకు మరింత బాధ్యతతో పనిచేసేందుకు ప్రేరణనిస్తాయని శ్రీరామ్ వెంకట్ పేర్కొన్నారు. అలాగే మహంకాళి జిల్లా బీజేపీ అధ్యక్షులు శ్భరత్ గౌడ్ తనపై విశ్వాసం ఉంచి బాధ్యత అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ "వికసిత్ భారత్" సంకల్పానికి అనుగుణంగా జ్ఞానం, సాంకేతికత, నిపుణుల అనుభవం, యువశక్తిని దేశాభివృద్ధితో అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందన్నారు. చాణక్యుని వ్యూహచింతన నుంచి స్ఫూర్తి పొందుతూ ఆధునిక కాలానికి అనుగుణంగా డేటా, టెక్నాలజీ, నిపుణుల పరిజ్ఞానం, ప్రజల అనుభవాలను సమన్వయం చేస్తామని చెప్పారు. తార్నాకలో కొనసాగిస్తున్న



ప్రజా, సామాజిక కార్యక్రమాలతో పాటు మహంకాళి జిల్లా స్థాయిలో ఇంటెలెక్చువల్ సెల్‌ను బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ ఆఫీస్ సెక్రటరీ గజుల కిరణ్ కుమార్, మహంకాళి జిల్లా జనరల్ సెక్రటరీ మేకల సారంగపాణి తదితరులు శ్రీరామ్ వెంకట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. "జ్ఞానం నుంచి ఆలోచన.. ఆలోచన నుంచి కార్యాచరణ.. కార్యాచరణ నుంచి అభివృద్ధి" అనే దిశగా పనిచేస్తానని శ్రీరామ్ వెంకట్ స్పష్టం చేశారు.

# గణేష్ ఉత్సవాల్లో భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి..

**సీతాఫల్ మండి, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 6 :** గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించాలని చిలకలగూడ ఏసీపీ సూచించారు. ఆదివారం వారాసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాపూజీ కాలనీ, గంగపుత్ర కాలనీ, ఎంసీహెచ్ కాలనీ, రాంనగర్ ప్రాంతాల్లోని గణేష్ కమిటీ నిర్వాహకులతో ఏసీపీ కార్యాలయంలో పోలీసులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వహణలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, నిబంధనలపై నిర్వాహకులకు అవగాహన కల్పించారు. గణేష్ విగ్రహం ఎత్తు కాలనీ పరిస్థితులకు అనుగుణంగా పరిమితంగా ఉండాలని, మండపాల ఏర్పాటులో ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా దారి వదలాలని సూచించారు. విద్యుత్ కనెక్షన్ల విషయంలో జాగ్రత్తలు పాటిస్తూ విద్యుత్ శాఖ సిబ్బంది సహాయం తీసుకోవాలని తెలిపారు. దీపాల వద్ద అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, మండపాల వద్ద నీరు, ఇసుక అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు పరిశుభ్రతను పాటించాలని కోరారు. లడ్డూ తదితర ప్రసాదాల భద్రత కోసం రాత్రి వేళల్లో నిర్వాహకులు లేదా కమిటీ సభ్యులు మండపం వద్ద అందుబాటులో ఉండాలని



తెలిపారు. ప్రతి రోజు పూజా కార్యక్రమాల అనంతరం సౌండ్ సిస్టమ్ శబ్దాన్ని తగ్గించాలని, రాత్రి 10 గంటల్లోపు కార్యక్రమాలను ముగించాలని పోలీసులు సూచించారు. నిమజ్జనం రోజున వీలైనంత త్వరగా కార్యక్రమాన్ని ప్రారంభించి అన్ని భద్రతా చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా చిన్నారులు, మహిళల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. డీజేలు, ప్యాడ్‌బ్యాండ్‌లు, క్రాకర్స్, పొగను వెదజల్లే వస్తువులు నిషేధమని, నిబంధనలు ఉల్లంఘించి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిమజ్జన ర్యాలీలో పూలు, రంగులు, పేపర్లు రోడ్డుపై వెళ్లే ప్రజలపై చల్లరాదని సూచించారు. నిమజ్జన



వాహనాల కండిషన్ సరిగా ఉండేలా చూసుకోవడంతో పాటు డ్రైవర్ అప్రమత్తంగా ఉండాలని, తగినంత డీజిల్ అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ర్యాలీ మార్గంలో కిందికి వేలాడుతున్న విద్యుత్, నెట్‌వర్క్ వైర్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా చిన్న సంఘటన జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని నిర్వాహకులకు సూచించారు. సమావేశంలో ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన ఇతర అవసరమైన అంశాలపైనా చర్చించారు. వారాసిగూడ స్టేషన్ హౌస్ ఆఫీసర్ రాజేందర్ గౌడ్ పాల్గొన్నారు.

# ఉద్యోగుల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ లక్ష్యం

# ఈహెచ్ఎస్ అమలులో రాజీ లేదు

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 6:** ఇందిరమ్మ ప్రజాప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమం పట్ల ఎంతో పూర్తి నిబద్ధతతో పనిచేస్తోంది. ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది. ప్రజాస్వామ్య స్ఫూర్తిని విశ్వసించే ప్రజాప్రభుత్వం పనిచేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విస్పష్టంగా చెప్పారు. ఆదివారం నాడు మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్ లో ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, డిపెండెంట్ల ఆరోగ్య భద్రత కోసం తీసుకొచ్చిన హెల్త్ కార్డు పథకాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. దశాబ్దాలుగా ఉద్యోగులు ఎదురుచూస్తున్న సమస్యను మానవీయ కోణంలో పరిష్కరించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చిందన్నారు. ప్రభుత్వంలో పనిచేస్తున్న ఉద్యోగులంతా తమవారేనని, వారు ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని భట్టి విక్రమార్క చెప్పారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, డిపెండెంట్లు గానీ అనారోగ్యానికి గురైనప్పుడు ఆర్థిక, మానసిక ఇబ్బందులకు గురికాకూడదన్న ఉన్నతమైన ఆశయంతోనే అనేక ఆర్థిక



ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఈ పథకాన్ని సీరియస్‌గా తీసుకుని అమలు చేసిందన్నారు. ఈ పథకం రూపకల్పన, విధివిధానాల విషయంలో ఉద్యోగ సంఘాలతో అనేకసార్లు సమావేశాలు నిర్వహించి, వారి సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నామని ఆయన చెప్పారు. ఉద్యోగుల గురించి మానవీయ కోణంలో ప్రజాప్రభుత్వం ఆలోచన చేసి తీసుకొచ్చిన పథకాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని స్పష్టం చేశారు. ఈహెచ్ఎస్ పథకంలో ఇప్పటికే 354 ప్రైవేట్ ఆసుపత్రులు ఉండగా, మరికొన్ని ఆసుపత్రులను డీమ్డ్ ఎంప్యానెల్డ్ విధానంలో చేర్చినట్లు ఆయన చెప్పారు. ఆయా ఆసుపత్రుల యాజమాన్యాలతో సమావేశాలు నిర్వహించి, పథకం సమర్థవంతంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆయన సూచించారు. హెల్త్ కార్డులు జారీ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన ఈ పథకాన్ని ఎవరూ అషామాషీగా తీసుకోవద్దని ఉన్నతాధికారులకు ఆయన చెప్పారు. ఉద్యోగుల ఆరోగ్యానికి సంబంధించిన ఈ అంశంపై ప్రభుత్వం అత్యంత చిత్తశుద్ధితో పనిచేస్తోందని అన్నారు. ఈ పథకాన్ని అమలు చేయాలన్న స్పష్టమైన సంకల్పంతో ప్రజాప్రభుత్వం ఉందని చెప్పారు.

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పదేళ్లుగా ఏ ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని హెల్త్ కార్డు పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చిందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఉద్యోగుల ఆరోగ్యం, వారి కుటుంబాల సంక్షేమం విషయంలో ఈ ప్రభుత్వం అత్యంత సీరియస్‌గా, కమిటెడ్‌గా ఉందన్నారు. హెల్త్ కార్డు పథకాన్ని విజయవంతం చేయడంలో అధికారులు, ఉద్యోగ సంఘాలు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలి అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, జేఏడీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ మహేష్ దత్ ఎక్కా, హెల్త్ అండ్ మెడికల్ ప్రిన్సిపల్ సెక్రెటరి క్రిస్టీనా, హోమ్ డిపార్ట్ మెంట్ సెక్రెటరీ మోగితా రాణా, ఈహచ్ఎస్ సీఈఓ హనుమంతు, ఉద్యోగ సంఘాల నాయకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో విద్యుత్ భద్రత -- ప్రతి భక్తుడి బాధ్యత

**వినాయక చవితి అంటే భక్తి, ఆనందం, సామూహిక ఐక్యతకు ప్రతీక.**

**హైదరాబాద్ సెప్టెంబర్ 6**

రాష్ట్రవ్యాప్తంగా వేలాది గణేశ్ మండపాలు ఏర్పాటు చేసి భక్తులు ఘనంగా ఉత్సవాలు నిర్వహిస్తారు. అయితే ఈ వేడుకలు సురక్షితంగా, ప్రమాదరహితంగా జరగాలంటే విద్యుత్ భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం అవసరం. చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారి తీసే అవకాశం ఉంది.

గణేశ్ మండపాల్లో అధికంగా లైటింగ్, సౌండ్ సిస్టమ్స్, డిజిటల్ డిస్‌ప్లేలు, అలంకరణలు ఏర్పాటు చేయడం వల్ల విద్యుత్ వినియోగం పెరుగుతుంది. ఈ సమయంలో నాసిరకం వైరింగ్, ఓవర్‌లోడింగ్, అనధికారిక కనెక్షన్లు, భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్ల విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

మండప నిర్వాహకులకు సూచనలు

గణేశ్ మండపాలకు అవసరమైన విద్యుత్ కనెక్షన్లను కేవలం టీజీఎస్పీడీసీఎల్ అధికారుల ద్వారా మాత్రమే పొందాలి. విద్యుత్ స్తంభాలు లేదా లైన్ల నుంచి అనధికారికంగా కనెక్షన్లు తీసుకోవడం చట్టవిరుద్ధమే కాకుండా అత్యంత ప్రమాదకరం.

మండపాల్లో ఉపయోగించే కేబుళ్లు, వైర్లు, స్విచ్‌బోర్డులు నాణ్యమైనవిగా ఉండాలి. ప్రతి రోజు వైరింగ్ వ్యవస్థను తనిఖీ



చేయాలి. ఎక్కడైనా వైర్లు దెబ్బతిన్నా, ఇన్సులేషన్ ఊడిపోయినా వెంటనే మార్చాలి. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లకు సమీపంలో మండపాలు ఏర్పాటు చేయరాదు.

భక్తులు పాటించాల్సిన జాగ్రత్తలు

విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఫీడర్ బాక్సులు వంటి విద్యుత్ పరికరాలకు దగ్గరగా వెళ్లకూడదు. చిన్నారులు విద్యుత్ పరికరాల వద్ద ఆడకుండా పెద్దలు పర్యవేక్షించాలి. వర్షం పడుతున్న సమయంలో తడి చేతులతో స్విచ్‌లు లేదా విద్యుత్ పరికరాలను తాకరాదు.

విద్యుత్ తీగ తెగిపడి కనిపిస్తే దానికి దగ్గరగా వెళ్లకుండా వెంటనే టీజీఎస్పీడీసీఎల్‌కు సమాచారం ఇవ్వాలి.

నిమజ్జన ఊరేగింపుల్లో అప్రమత్తత అవసరం

గణేశ్ నిమజ్జన ఊరేగింపుల సమయంలో భారీ విగ్రహాలు, క్రేన్లు, ట్రక్కులు వినియోగిస్తారు. ఎత్తైన విగ్రహాలు విద్యుత్ లైన్లకు తగిలే ప్రమాదం ఉంటుంది. అందువల్ల ఊరేగింపు మార్గాలను ముందుగానే పరిశీలించి విద్యుత్ లైన్ల నుంచి సురక్షిత దూరం పాటించాలి.

క్రేన్లు, లోహపు ఫ్రేములు, ఎత్తైన అలంకరణలు ఉపయోగించే సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యుత్ తీగలకు సమీపంగా వెళ్లే పరిస్థితి ఉంటే వెంటనే టీజీఎస్పీడీసీఎల్ అధికారులను సంప్రదించాలి.

భద్రతే నిజమైన భక్తి

గణేశ్ ఉత్సవాలు ఆనందోత్సాహాల మధ్య జరిగే ప్రజా పండుగ. ఈ పండుగలో భక్తి ఎంత ముఖ్యమో, భద్రత కూడా అంతే ముఖ్యమైనది. విద్యుత్ భద్రతా నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించడంతో పాటు ప్రతి కుటుంబం, ప్రతి భక్తుడు సురక్షితంగా ఉత్సవాలను జరుపుకోవచ్చు.

ఏదైనా విద్యుత్ సంబంధిత అత్యవసర పరిస్థితి తలెత్తినప్పుడు టీజీఎస్పీడీసీఎల్ టోల్ ఫ్రీ నంబర్ 1912 కు వెంటనే సమాచారం అందించాలి.

భద్రతతో కూడిన గణేశ్ నవరాత్రి ఉత్సవాలు -- ప్రతి ఒక్కరి సహకారంతోనే సాధ్యం.

# మీర్‌పేట్‌లో విషాదం.. విద్యుత్ షాక్‌తో లైన్‌మన్ మృతి



**హైదరాబాద్ సెప్టెంబర్ 6**

మీర్‌పేట్ పరిధిలో విద్యుత్ ప్రమాదం విషాదాన్ని నింపింది. నంది హిల్స్ రోడ్ నంబర్ 2లోని ఓ ఇంటికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

సమాచారం అందుకున్న కె. కృష్ణకాంత్ (40) అనే విద్యుత్ ఆర్టిసన్ (లైన్‌మన్) సంఘటనా స్థలానికి చేరుకున్నారు. చింతపల్లి మండలం కురుమేడు గ్రామానికి చెందిన కృష్ణకాంత్.. మీర్‌పేట్ లెనిన్‌నగర్ సబ్‌స్టేషన్‌కు అనుబంధంగా విధులు నిర్వహిస్తున్నారు.

ఇంటి వద్ద విద్యుత్ మీటర్‌ను పరిశీలించిన అనంతరం సరఫరాను పునరుద్ధరించేందుకు ప్రయత్నించారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆఫ్ చేసి విద్యుత్ స్తంభం ఎక్కి లోపాన్ని సరిచేసే క్రమంలో.. లైన్‌లో విద్యుత్ సరఫరా కొనసాగినట్లు సమాచారం.ఈ క్రమంలో మెయిన్ విద్యుత్ వైర్‌ను తాకడంతో కృష్ణకాంత్‌కు తీవ్ర విద్యుత్ షాక్ తగిలింది. దీంతో ఆయన విద్యుత్ స్తంభం నుంచి కిందపడిపోయారు. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలుస్తోంది.సమాచారం అందుకున్న మృతుడి బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఘటన నేపథ్యంలో పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

ప్రస్తుతం మీర్‌పేట్ ప్రాంతంలో పరిస్థితి ప్రశాంతంగా ఉందని ఎస్‌హెచ్‌ఓ మీర్‌పేట్ తెలిపారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. విద్యుత్ సరఫరా నిలిపివేసినప్పటికీ లైన్‌లో కరెంట్ ఎలా కొనసాగిందనే అంశంపై అధికారులు విచారణ చేపట్టే అవకాశం ఉంది.

# SH-01 ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

**హైదరాబాద్, సెప్టెంబర్ 6,**

తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మెట్రోపాలిటన్ కమిషనర్, ఎవీణూ, చీఫ్ ఇంజనీర్, ఎవీణూ మరియు ఇతర ఉన్నతాధికారులతో కలిసి ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్‌పేట్ వద్ద ా== జంక్షన్ వరకు 18.18 కిలోమీటర్ల ాఎ-01 కారిడార్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రాజెక్టు పనుల పురోగతిని సమీక్షించారు. ఇందులో ఇప్పటికే ఉన్న నిర్మాణాల తొలగింపు అప్పగింత, రక్షణ మంత్రిత్వ శాఖ (వీశిణ) పరిధిలో కాంపౌండ్ వాల్ నిర్మాణం, వీశిణ ఆస్తుల అభివృద్ధి, యుటిలిటీ షిఫ్టింగ్, ఎర్త్‌వర్క్ మరియు కొనసాగుతున్న రోడ్డు పనులు తదితర అంశాలను పరిశీలించారు.

ప్రాజెక్టును అమలు చేస్తున్న సంస్థ నాణ్యత మరియు భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, సంబంధిత అన్ని శాఖలతో సమర్థవంతమైన సమన్వయంతో పనిచేయాలని, ఆమోదించబడిన ప్రాజెక్టు కాలపట్టికను కచ్చితంగా పాటించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించారు.

18.18 కిలోమీటర్ల ాఎ-01 కారిడార్‌లో 11.658 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ విభాగం ఉండగా, మిగిలిన భాగాన్ని గ్రేడ్‌పై నిర్మిస్తున్నారు. ఈ కారిడార్‌లో కార్ఖానా, తిరుమలగిరి, అల్వాల్ ప్రాంతాల్లో ర్యాంపులు, హకీంపేట్ ఎయిర్‌పోర్ట్ స్టేషన్ సమీపంలో టన్నెల్-కమ్-వెహిక్యులర్ సబ్‌వే, అలాగే లోత్కుంట మరియు అల్వాల్ వద్ద గ్రేడ్ సెపరేషన్ నిర్మాణాలు కీలకమైన అంశాలుగా ఉన్నాయి.

ప్రైవేట్ భూముల భూసేకరణకు సంబంధించి, హైదరాబాద్ మరియు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలకు చెందిన సంబంధిత భూసేకరణ అధికారులు (ాూాం) భూసేకరణ ప్రక్రియను రెండు జిల్లాల్లోనూ వేగవంతం చేయాలని, ప్రభుత్వ నిర్మాణాలు మతపరమైన నిర్మాణాలను వీలైనంత త్వరగా అప్పగించే ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించారు.

ాఎ-01 కారిడార్ తెలంగాణ ప్రభుత్వానికి అత్యంత కీలకమైన మౌలిక వసతుల ప్రాజెక్టు అని, ముఖ్యమంత్రి దీనికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారనిలిలి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్పష్టం చేశారు. సంబంధిత అన్ని శాఖలు, సంస్థలు సన్నిహిత సమన్వయంతో పనిచేసి, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, ప్రాజెక్టును నిర్ణీత గడువులో నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.

# రెండున్నరేళ్లలో 333 పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు -- విద్యుత్ మౌలిక వసతుల బలోపేతంలో టీజీఎస్పీడీసీఎల్ ముందంజ

**రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సామర్థ్య పెంపుతో**

**వినియోగదారులకు మరింత నాణ్యమైన సేవలు**

**హైదరాబాద్ సెప్టెంబర్ 6 జన తెలంగాణ**

తెలంగాణ రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ మౌలిక వసతులను బలోపేతం చేస్తూ టీజీఎస్పీడీసీఎల్ గణనీయమైన పురోగతి సాధించింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత పటిష్టం చేయడం, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా సామర్థ్యాన్ని పెంచడం లక్ష్యంగా విస్తృత స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయబడ్డాయి.

ఈ క్రమంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత 2023 డిసెంబర్ 1 నుండి 2026 ఆగస్టు 31 వరకు టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో మొత్తం 333 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు (ూ=లు) ఛార్జ్ చేయబడ్డాయి. వీటిలో 5 ఎంవీఏ, 8 ఎంవీఏ, 12.5 ఎంవీఏ మరియు 16 ఎంవీఏ సామర్థ్యాల పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. ఈ సామర్థ్య పెంపు ద్వారా విద్యుత్ అంతరాయాలు తగ్గడంతో పాటు ఓవర్‌లోడింగ్ సమస్యలు నివారించబడి, వినియోగదారులకు మరింత నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుతోంది.

ఎస్పీడిసియల్ పరిధిలో సర్కిల్ వారీగా ూ=ల సామర్థ్య పెంపు వివరాలు

ాజూాణూ -- 46 రాజేంద్రనగర్ -- 39 సైబర్‌సిటీ -- 34 నల్గొండ -- 28 మెడ్చల్ -- 25 సారూర్‌నగర్ -- 21 సంగారెడ్డి -- 21 హబ్సిగూడ -- 20 సూర్యాపేట -- 18 మహబూబ్‌నగర్ -- 16 సిద్ధిపేట -- 10 వనపర్తి -- 10నాగర్‌కర్నూల్ -- 9 గద్వాల -- 8 మెదక్ -- 8 వికారాబాద్ -- 6 యాదాద్రి -- 6నారాయణపేట -- 3 టాప్-5 సర్కిళ్లు ాజూాణూ -- 46ూ=లు రాజేంద్రనగర్ -- 39ూ=లుసైబర్‌సిటీ -- 34ూ=లునల్గొండ -- 28 ూ=లుమెడ్చల్ -- 25 ూ=లుపట్టణ ప్రాంతాల్లో భారీ మౌలిక వసతుల విస్తరణహైదరాబాద్ నగరం, ఐటీ కారిడార్ మరియు వేగంగా అభివృద్ధి చెందుతున్న శివారు ప్రాంతాల్లో విద్యుత్ అవసరాలు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో సైబర్‌సిటీ, మెడ్చల్, రాజేంద్రనగర్, ాజూాణూ, హబ్సిగూడ, సారూర్‌నగర్ సర్కిళ్లలో అధిక సామర్థ్యం గల పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. దీంతో ఐటీ సంస్థలు, పారిశ్రామిక యూనిట్లు, వాణిజ్య సముదాయాలు మరియు గృహ వినియోగదారులకు విశ్వసనీయ విద్యుత్ సరఫరా అందుతోంది.

గ్రామీణ ప్రాంతాలకు బలోపేతమైన విద్యుత్ వ్యవస్థ

గ్రామీణ తెలంగాణలో వ్యవసాయం, గ్రామీణ గృహాలు మరియు చిన్న పరిశ్రమల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, గద్వాల, వనపర్తి, నారాయణపేట, వికారాబాద్ తదితర జిల్లాల్లో విద్యుత్ మౌలిక వసతులను మరింత బలోపేతం చేశారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమమే మార్గం

**టీయూడబ్ల్యూజే--ఐజేయూ సర్వసభ్య సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరిజర్నలిస్టులకు క్రమశిక్షణ ఎంతో అవసరం: రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఏ.కే. ఫైసల్.**

జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయి నుంచి గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతామని టీయూడబ్ల్యూజే--ఐజేయూ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి అన్నారు. నారాయణఖేడ్‌లో ఆదివారం నిర్వహించిన యూనియన్ సర్వసభ్య సమావేశంలో జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన సమస్యలు, యూనియన్ బలోపేతం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.

ఈ సందర్భంగా బండారు యాదగిరి మాట్లాడుతూ మారుతున్న పరిస్థితుల్లో జర్నలిస్టులు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారని తెలిపారు. నియోజకవర్గ, మండల స్థాయిలో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యలను ప్రత్యేకంగా నమోదు చేసి జిల్లా కమిటీ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్




అందేలా చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టులకు ఇంటి స్థలాలు, ఆరోగ్య భద్రత కల్పించే విషయంలో ప్రభుత్వం స్పష్టమైన చర్యలు చేపట్టాలని కోరారు. చిన్న, మధ్య తరహా పత్రికల్లో పనిచేసే జర్నలిస్టులతో పాటు ఎలక్ట్రానిక్ మీడియా, ఫొటో జర్నలిస్టులకు కూడా సమాన ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సభ్యత్వ విస్తరణ చేపట్టడంతో పాటు మండల స్థాయి కమిటీలను మరింత క్రియాశీలం చేయాలని సూచించారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఏ.కే. ఫైసల్ మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కుల సాధనకు సంఘటిత శక్తే ప్రధాన బలమని అన్నారు. సమస్య ఏ ఒక్క జర్నలిస్టుదైనా దానిని యూనియన్ సమస్యగా భావించి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. అదే సమయంలో జర్నలిస్టులకు క్రమశిక్షణ ఎంతో




అవసరమని, వృత్తిపరమైన విలువలు, బాధ్యతలను కాపాడుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో అర్హులైన జర్నలిస్టులకు న్యాయం జరిగేలా యూనియన్ కృషి చేస్తుందని తెలిపారు.

సమావేశంలో రాష్ట్ర ప్రతినిధి బాసిత్, నేషనల్ కౌన్సిల్ సభ్యుడు సిద్దన్న పాటిల్, జిల్లా ప్రధాన కార్యదర్శి మాండ్ల అనిల్, ఉపాధ్యక్షులు శ్రీనాథ్, మతీన్, ఆర్. సత్యనారాయణరెడ్డి, మల్లేశం, జాయింట్ సెక్రటరీలు ఉల్లిగడ్డల శివకుమార్, శ్రీనివాసరెడ్డి, ఎం.ఏ. రవూఫ్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు విలాస్, విల్సన్, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు ఆసిఫ్, ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి బసవేశ్వర్, కోశాధికారి శ్రీధర్ జైన్, చిన్న, మధ్య తరహా పత్రికల సంఘం ప్రధాన కార్యదర్శి చవాన్ ఈశ్వర్, కోశాధికారి లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు నజీర్, సదాశివపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు హాజీ, జహీరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మీనాజ్ తదితరులు పాల్గొన్నారు.

# బండారు దత్తాత్రేయకు ఘన సన్మానం

**బంజారా యువతకు బీజేపీలో రాజకీయ అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి**

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 6:
బీజేపీ సీనియర్ నాయకులు గౌరవ శ్రీ బండారు దత్తాత్రేయ గారిని మాజీ మంత్రి, బంజారా భీష్మ శ్రీ అమర్ సింగ్ తిలావత్ గారి ఆధ్వర్యంలో టీపీసీ సభ్యులు, బీజేపీ సీనియర్ నాయకులు డాక్టర్ భట్టు నాగేశ్వరరావు నేతృత్వంలోని బృందం ఆయన నివాసంలో ఘనంగా సన్మానించింది. శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఆత్మీయంగా గౌరవించారు. అనంతరం జరిగిన ఆత్మీయ సమావేశంలో బీజేపీ కోసం చురుగ్గా, నిబద్ధతతో పనిచేస్తున్న బంజారా యువతకు పార్టీలో తగిన రాజకీయ అవకాశాలు కల్పించాలనే అంశంపై ప్రధానంగా చర్చించారు.

రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బంజారా యువత ప్రతిభకు, ప్రజాసేవ పట్ల వారి అంకితభావానికి గుర్తింపు ఇస్తూ, అర్హత మరియు నిబద్ధత కలిగిన యువ నాయకత్వానికి సముచిత రాజకీయ ప్రాధాన్యత



కల్పించాలని డాక్టర్ భట్టు నాగేశ్వరరావు బండారు దత్తాత్రేయ గారిని విజ్ఞప్తి చేశారు. "పార్టీ కోసం నిబద్ధతతో పనిచేస్తున్న బంజారా యువతకు రాజకీయ అవకాశాలు లభిస్తే, వారి శక్తి ప్రజాసేవకు మరింత బలంగా ఉపయోగపడుతుంది" అని ఆయన పేర్కొన్నారు. 'బంజారా యువతను రాజకీయంగా ప్రోత్సహించి, పార్టీ సంస్థాగత కార్యక్రమాల్లో మరింత బాధ్యతలు అప్పగించాల్సిన అవసరాన్ని దత్తాత్రేయ గారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ విజ్ఞప్తిపై బండారు దత్తాత్రేయ గారు సానుకూలంగా స్పందిస్తూ, బంజారా సమాజానికి చెందిన అర్హత, ప్రతిభ, నిబద్ధత కలిగిన యువతకు పార్టీలో మరిన్ని అవకాశాలు



లభించేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన సానుకూల స్పందన పట్ల డాక్టర్ భట్టు నాగేశ్వరరావు, బృంద సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తాజా రాజకీయ పరిణామాలు, రానున్న ఎన్నికలు, బంజారా యువత రాజకీయాల్లో పోషించాల్సిన పాత్ర తదితర అంశాలపై కూడా చర్చించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి అమర్ సింగ్ తిలావత్, డాక్టర్ భట్టు నాగేశ్వరరావు, ఏఐబీఎస్ఎస్ తెలంగాణ రాష్ట్ర మీడియా సెక్రెటరీ భీముడు నాయక్, ఖతీఘు నాయకుడు వినయ్ దాస్ రోహిత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# జపాన్ పర్యటనకు కర్ని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ బి.రూప ఎంపిక

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 6:
నియోజకవర్గం. అంతర్జాతీయ స్థాయి బోధనా పద్ధతులు, విద్యా వ్యవస్థ అభివృద్ధికి జపాన్‌లో అమలు చేస్తున్న ఉత్తమ విధానాలపై అవగాహన పెంపొందించుకునేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా నారాయణపేట జిల్లా మక్తల్ మండలం కర్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఫిజికల్ డైరెక్టర్ బి.రూప (ఎస్ ఏ --ఫిసికల్ ఎడ్యుకేషన్ ) జపాన్ పర్యటనకు ఎంపికయ్యారు.

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, నిరుపేద విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యను అందించడంతో పాటు అంతర్జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలను పరిచయం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పర్యటనను నిర్వహిస్తోంది. సెప్టెంబర్ 5 నుంచి 12 వరకు కొనసాగనున్న ఈ పర్యటనలో రాష్ట్రానికి చెందిన



29 మంది ఉపాధ్యాయులు, 11 మంది విద్యాశాఖ అ ది, కా ం ౦ ల ం పాల్గొననున్నారు.

ఈ పర్యటనలో భాగంగా బి.రూప జపాన్‌లోని విద్యా సంస్థలను సందర్శించి అక్కడి క్రమశిక్షణ, సాంకేతికత వినియోగం, జీవన నైపుణ్యాల బోధన, విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, పాఠశాల నిర్వహణ విధానాలు తదితర ఉత్తమ అభ్యసనా పద్ధతులను పరిశీలించనున్నారు. జపాన్‌లోని విద్యా విధానాలను అధ్యయనం చేసి, వాటిలో అనుసరించదగిన అంశాలను తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేసేందుకు ఉపయోగపడే అనుభవాన్ని ఆమె పొందనున్నారు.

ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలిగా విద్యార్థుల క్రీడా, విద్యా వికాసానికి కృషి చేస్తున్న బి.రూపకు అంతర్జాతీయ స్థాయి పర్యటనకు అవకాశం లభించడం పట్ల జడ్.పి.హెచ్.ఎస్ కర్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఆమె జపాన్ పర్యటన విజయవంతంగా సాగాలని ఆకాంక్షిస్తూ అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాల నుంచి జపాన్ వరకు సాగిన బి.రూప ప్రయాణం... కర్ని పాఠశాలకు మాత్రమే కాకుండా నారాయణపేట జిల్లాకే గర్వకారణమని పలువురు పేర్కొన్నారు.

## కబడ్డీ పోటీ లో విద్యార్థులు జిల్లా స్థాయికి వెళ్లడం ఎంతో సంతోషకరం. భారతీయ జనతా పార్టీ మాగనూరు మండల అధ్యక్షులు భంగి అశోక్



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 6:
మాగనూరు మండలం కొత్తపల్లి గ్రామ శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాలకు చెందినటువంటి, నలుగురు, విద్యార్థులు మాగనూరు మండలంలో నిర్వహించినటువంటి కబడ్డీలో జిల్లా స్థాయికి ఎంపిక అవడం జరిగింది. విషయం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఎంపీ కావడం చాలా సంతోషంగా ఉందని మా కష్టంలో కోచ్ శ్రీకాంత్ బాధ్యత కూడా ఉందని వారు తెలియజేశారు. కబడ్డీ జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులు, బంగి వెంకటేష్, రవి కిషోర్, శివ శంకర్, నూర్, సెలెక్ట్ కావడం జరిగింది. తమ విద్యార్థులు జిల్లా స్థాయిలో సెలెక్ట్ కావడం చాలా సంతోషంగా ఉందని, ప్రధానోపాధ్యాయుడు వెంకటేష్, మరియు యాజమాన్యం డాక్టర్ కృష్ణయ్య, గిరిధర్ శెట్టి, ఉపాధ్యాయులు విజయలక్ష్మి సాయికుమార్ హర్షం వ్యక్తం చేశారు.

## మల్కాజ్గిరి పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్ చేతుల మీదుగా హైదరాబాదులో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న అపరమేధావి డా. గుగ్గిళ్ల దివ్యమూర్తి

ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరు గ్రామానికి చెందిన అపరమేధావి డా. గుగ్గిళ్ళ దివ్యమూర్తికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వరించింది. తెలంగాణ టీచర్స్ ఌ లెక్చరర్స్ ఫోరం వారు ఈ అవార్డును దివ్యమూర్తికి టీచర్స్ డే సందర్భంగా హైదరాబాదులో ని బాగ్లింగంపల్లి గల సుందర విజ్ఞాన కేంద్రంలోని దొడ్డి కొమరయ్య హాల్లో అందజేయడం జరిగింది. ఈ అవార్డును దివ్యమూర్తి మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ చేతుల మీదుగా అందుకోవడం జరిగింది. తదనంతరం దివ్యమూర్తిని ఈటెల రాజేందర్ మరియు ఇతర




TELANGANA TEACHERS & LECTURERS FORUM
HYDERABAD - TELANGANA
CERTIFICATE
OF ACHIEVEMENT
THIS CERTIFICATE IS PROUDLY PRESENTED, As a
BEST TEACHER (LECTURER)
NAME
SUBJECT
DATE
SIGNATURE

ప్రముఖులు శాలువాతో సన్మానించడం చేయడం జరిగింది. దివ్యమూర్తి ఎన్నో చోట్ల తన స్పీచ్ లతో విద్యార్థులను చైతన్యం చేస్తున్న విధానాన్ని బట్టి ఈ అవార్డు ప్రకటిస్తున్నట్లు తెలంగాణ టీచర్స్ ఌ లెక్చరర్స్ ఫోరం వారు తెలియజేశారు. ఈ సందర్భంగా దివ్యమూర్తి మాట్లాడుతూ తనకు ఈ అవార్డు రావడం మరియు సన్మానం జరగడం సంతోషంగా ఉందని ఇప్పటివరకు తనకు 80 అవార్డులు వచ్చాయని 144 వేదికల మీద సన్మానాలు జరిగాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు అజ్మీరా సీతారామ్ నాయక్, మాసం రత్నాకర్ పటేల్, దుర్గా భవాని, తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టం పురుషోత్తమరావు, తదితరులు పాల్గొన్నారు.

# కరుణగిరిలో ఘనంగా కర్ర పూజ





ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని కరుణగిరి 2వ వార్డు,
కనకదుర్గమ్మ గుడి సమీపంలో కర్ర పూజ వేడుకలు ఏదులాపురం: లక్ష్మి గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా నిర్వహించే ఈ కర్ర పూజ ఆదివారం ఉదయం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని టీం యంగ్స్టర్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేష్‌నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సురేష్‌నాయక్‌ను ఉత్సవ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు అక్కినేపల్లి దేవయ్యచారి, ఉత్సవ కమిటీ సభ్యులు అక్కిరాజు నరేష్, సంపత్, నాయుడు, సంపత్,నవీన్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## పోలరం గ్రామపంచాయతీ ఇల్లందు మండలం భద్రాద్రి కొత్తగూడెం







గత మూడు రోజుల నుండి కరెంటు పొద్దున్నే ఆరింటికి వచ్చే కరెంటు 8 దాటితే కానీ ఇవ్వడం లేదు ఇలా ఎందుకని సబ్ స్టేషన్ కి రైతులందరూవెళ్లి అడగగా మాకు పైనుండి మెసేజ్ వస్తే గాని మేము కరెంటు ఇవ్వలేమని తెగేసి చెప్పారు వెళ్లి నీవో ప్రభావం వల్ల వర్షాలు పడకపోవడంతో బోర్లు అంతంత మాత్రమే నడుస్తున్నాయి దానికి తోడు కరెంటు కోత విధానం రైతులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తుంది గత ప్రభుత్వం రైతులకు 24 గంటల కరెంటు ఇవ్వడం వల్ల సకాలంలో పంటలన్నీ మంచిగా పండి నాయి ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన కానుండి ఈ కరెంటు కోతల ఇబ్బందులు తప్పడం లేదు కనీసం 24 గంటల కరెంటు ఎందుకు ఇవ్వడం లేదో ప్రభుత్వం సమాధానం చెప్పాలి కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కి కూర్చొని రైతులకు మొండి చేయి చూపించింది రైతుల పట్ల ఇంత



**ఖమ్మం రూరల్ మండలం గోళ్ళపాడు గ్రామానికి చెందిన మనం రిపోర్టర్ వెలుతురు వీరా కుమార్ కుమార్తె చెవులు కుట్టే వేడుకను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై చిన్నారిని ఆశీర్వదించిన ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేష్ నాయక్ . ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అక్కినపల్లి దేవయ్య చారి, మేళ్లచెరువు సురేష్, బానోత్ శివ,ఏపూరి తరుణ్ పాల్గొన్నారు.**

# వైభవ్ వీరకొట్టుడు..
## సిరాజ్ మళ్లీ బలయ్యాడుగా..!




భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ మరోసారి విధ్వంసక ఇన్నింగ్స్ ఆడాడు. ఇప్పటివరకూ వన్డే, టీ20ల్లో మెరుపు బ్యాటింగ్‌తో అలరించిన ఈ చిచ్చరపిడుగు.. ఈసారి ఎర్ర బంతిపైనా పగబట్టినట్టే ఆడాడు. వైభవ్ బౌండరీలతో విరుచుకుపడగా టీమిండియా సీనియర్ పేసర్ మహమ్మద్ సిరాజ్ బిత్తరపోయాడు. ఐపీఎల్ అరంగేట్రం సీజన్‌లో సిరాజ్ ఓవర్లో ఎడాపెడా దంచేసిన ఈ కుర్రాడు ఇప్పుడు దులీప్ ట్రోఫీ ఫైనల్లోనూ చుక్కలు చూపించాడు. 'బౌలర్ ఎంతటివాడైనా నాకేంటీ.. నా స్టయిల్ ఇంతే' అన్నట్టుగా చెలరేగే వైభవ్ సూర్యవంశీ మరో ఖతర్నాక్ ఇన్నింగ్స్ ఆడాడు.

దులీప్ ట్రోఫీలో ఈస్ట్ జోన్ ఓపెనర్‌గా ఆడుతున్న వైభవ్ ఫైనల్లో దంచేశాడు. సౌత్ జోన్ బౌలర్లను హడలెత్తించిన ఈ పదిహేనేళ్ల కుర్రాడు.. సిరాజ్ బౌలింగ్‌లోనూ చితక్కొట్టాడు. సీనియర్ పేసర్ అయిన అతడి ఓవర్లో వరసగా 4, 6.. చివరి బంతికి బౌండరీతో రెచ్చిపోయాడీ బ్యాటింగ్ సంచలనం. దాంతో, ఐపీఎల్ 18వ సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ పేసర్‌గా ఆడిన సిరాజ్‌కు చుక్కలు చూపించిన వైభవ్.. ఇప్పుడు దులీప్ ట్రోఫీలోనూ పైచేయి సాధించాడు.

### 35 బంతుల్లోనే

రాజస్థాన్ రాయల్స్ ఓపెనర్‌గా పద్నాలుగేళ్లకే ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన వైభవ్.. గుజరాత్‌పై 35 బంతుల్లోనే మెరుపు శతకంతో చరిత్ర సృష్టించాడు. ఏకంగా 7 ఫోర్లు, 11 సిక్సర్లతో.. 265.79 స్ట్రయిక్ రేటుతో రికార్డు సెంచరీ సాధించాడు. ఇప్పుడు దులీప్ ట్రోఫీ ఫైనల్లో మియా భాయ్‌కి ఐపీఎల్ విధ్వంసాన్ని గుర్తు చేశాడు. సౌత్ బౌలర్లను భయపెడుతూ తొలి వికెట్‌కు ఓపెనర్ అభిమన్యు ఈశ్వరన్(72)తో కలిసి వంద రన్స్ జోడించిన వైభవ్.. 44 పరుగుల వద్ద ఔటయ్యాడు. అర్ధ శతకం చేజార్చుకున్నప్పటికీ రెడ్ బాల్ క్రికెట్‌లోనూ తాను మెరుపులు మెరిపించగలనని నిరూపించాడీ హిట్టర్.

# పదో శతకంతో

## విరుచుకుపడిన ఇషాన్..

### కొండంత స్కోర్ కొట్టిన ఈస్ట్ జోన్ ..!





దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఈస్ట్ జోన్ కెప్టెన్ ఇషాన్ కిషన్(111 నాటౌట్) శతకంతో రెచ్చిపోయాడు. భీకర ఫామ్ కొనసాగించిన ఈ చిచ్చరపిడుగు పదో సెంచరీతో జట్టుకు భారీ స్కోరందించాడు. ఓపెనర్లు అభిమన్యు ఈశ్వరన్(72), వైభవ్ సూర్యవంశీ(44), శిఖర్ మోహన్(85)లు ఇచ్చిన శుభారంభాన్ని కొనసాగిస్తూ టీ బ్రేక్ తర్వాత కుమార్ కుషగ్ర(63 నాటౌట్)తో సౌత్ బౌలర్లపై పిడుగుల్లే విరుచుకుపడ్డాడు ఇషాన్. ఐదో వికెట్‌కు ఏకంగా సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పాడు. నింపాదిగా ఆడుతూ వీరిద్దరూ క్రీజునంటుకుపోవడంతో తొలిరోజే ఈస్ట్ నాలుగొందలకు చేరువైంది. చిదంబరం స్టేడియంలో జరుగుతున్న దులీప్ ట్రోఫీ టైటిల్ పోరులో ఈస్ట్ జోన్ బ్యాటర్లు చితక్కొడుతున్నారు. టాపార్డర్ మెరుపులతో డీలా పడిన సౌత్ జోన్ బౌలర్లను కెప్టెన్ ఇషాన్ కిషన్(111 నాటౌట్: 120 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లు) మరింత భయపెట్టాడు. శ్రేయాస్ గోపాల్ ఓవర్లో బౌండరీతో ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో పదో సెంచరీ సాధించాడు ఇషాన్. ధనాధన్ ఆడిన ఈ లెఫ్ట్ హ్యాండర్‌కు కుమార కుషగ్ర(63 నాటౌట్) చక్కని సహకారం అందించాడు. ఐదో వికెట్‌కు ఈ ద్వయం ఏకంగా 144 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పింది. దాంతో, తొలి రోజు ఆట ముగిసే సరికి ఈస్ట్ 4 వికెట్ల నష్టానికి 385 పరుగులు చేసింది.

**తొలి వికెట్‌కు వంద**

టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకున్న ఈస్ట్‌కు ఓపెనర్లు అభిమన్యు ఈశ్వరన్(72), వైభవ్ సూర్యవంశీ(44) శుభారంభమిచ్చారు. భారత సీనియర్ పేసర్ సిరాజ్‌ను అలవోకగా ఎదుర్కొన్న వైభవ్ తొలి వికెట్‌కు వంద రన్స్ జోడించాడు. టెస్టులకు నేను సరిపోతానంటూ అర్ధ శతకానికి చేరువైన అతడిని మిలింద్ వెనక్కి పంపినా.. ఈశ్వరన్ పట్టుదలగా ఆడి ఫిఫ్టీ సాధించాడు. అయితే.. అనూహ్యంగా అతడు రనౌటయ్యాక.. శిఖర్ మోహన్(85) ధనాధన్ ఆడాడు.

మూడు సిక్సర్లు, 9 ఫోర్లతో 85 పరుగులు చేసిన అతడు.. ఈస్ట్ జోన్ స్కోర్ బోర్డును ఉరికించాడు. సెంచరీ దిశగా సాగుతున్న మోహన్‌ను మిలింద్ బౌల్డ్ చేయగా.. సుదీప్ కుమార్ ఘరమి(6)ని త్రిపురన విజయ్ వెనక్కి పంపాడు. అనంతరం కుమార కుషగ్ర(63 నాటౌట్)జతగా కెప్టెన్ ఇషాన్ క్రీజునంటుకుపోయాడు. సౌత్ బౌలర్లకు తన స్టయిల్ విధ్వంసం చూపించిన ఇషాన్ ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 4 వేల పరుగులు మైలురాయిని అధిగమించాడు. అర్ధ శతకంతో తర్వాత దూకుడు పెంచిన అతడు.. కాసేపటికే అజేయ శతకంతో జట్టుకు భారీ స్కోరందించాడు.

# షమిలో ఆకలి తగ్గలేదు

**ఇషాన్ కిషన్**



చెన్నై: సీనియర్ ఫాస్ట్‌బౌలర్ మహ్మద్ షమి టీమ్ఇండియాకు దూరమై ఏడాదిన్నర కావస్తోంది. ఏ ఫార్మాట్లోనూ అతడిని భారత జట్టులోకి ఎంపిక చేయట్లేదు. అయినా 36 ఏళ్ల షమి ఆశలు కోల్పోకుండా దేశవాళీల్లో అన్ని ఫార్మాట్లలోనూ బరిలోకి దిగుతున్నాడు. నిలకడగా రాణిస్తూ మళ్లీ టీమ్ఇండియాలో చోటు సంపాదించాలని గట్టిగా ప్రయత్నిస్తున్నాడు. దులీప్ ట్రోఫీ ఫైనల్లోనూ అతను ఈస్ట్ జోన్ తరఫున బరిలోకి దిగుతున్న నేపథ్యంలో ఆ జట్టు కెప్టెన్ ఇషాన్ కిషన్.. ఈ దిగ్గజ ఆటగాడి తపనను కొనియాడాడు. “అతను భారత అత్యుత్తమ ఫాస్ట్‌బౌలర్లలో ఒకడు. తనది ఆటలో దిగ్గజ స్థాయి. బెంగాల్‌కు ఆడడం మొదలుపెట్టినప్పటి నుంచి స్థిరంగా రాణిస్తున్నాడు. టీమ్ఇండియా తరఫునా అలాగే సత్తా చాటాడు. షమికి వయసు ఒక అంకె మాత్రమే. నిరంతరం కష్టపడుతూనే ఉంటాడు. తనలో ఆట పట్ల ఆకలి ఏమాత్రం తగ్గలేదు. కెప్టెన్‌గా తన తపనను దగ్గర్నుంచి గమనిస్తున్నా. వికెట్ల కోసం మరి కొన్ని ఓవర్లు వేయనా అని అడుగుతుంటాడు” అని ఇషాన్ అన్నాడు.

అది సవాలే కానీ..: ఫస్ట్ క్లాస్ క్రికెట్ టోర్నీ దులీప్ ట్రోఫీ ఆడిన అయిదు రోజులకే ఆసియా క్రీడల్లో టీ20 మ్యాచ్‌లు ఆడడం సవాలే అని, కానీ ప్రొఫెషనల్ క్రికెటర్లుగా ఇలాంటి వాటికి సర్దుకోవాల్సిందే అని సౌత్ జోన్ కెప్టెన్ తిలక్ వర్మ అన్నాడు. “అవును.. అయిదు రోజులు ఇక్కడ ఆడి, వెంటనే టీమ్ఇండియా తరఫున టీ20ల్లో బరిలోకి దిగడం సవాలుతో కూడుకున్న విషయమే. మేం దిల్లీ నుంచి జపాన్‌కు వెళ్లాక రెండు రోజుల ఖాళీనే ఉంటుంది. ఆ సమయంలోనే కొంత ప్రాక్టీస్ చేయాలి. మేం చాలా దేశవాళీ మ్యాచ్‌లు ఆడాం. ఎలాంటి పరిస్థితికైనా సర్దుకోవడం అలవాటు చేసుకున్నాం. మానసికంగా ఇలాంటి వాటికి సిద్ధంగా ఉండడంతో పాటు సరైన ఆహారం తీసుకోవడం ద్వారా శరీరాన్ని సన్నద్ధం చేసుకోవడం కూడా కీలకం. ఇలా వరుసగా వేర్వేరు ఫార్మాట్లలో ఆడిన అనుభవం మాకుంది కాబట్టి అది పెద్ద ఇబ్బంది కాదు” అని తిలక్ చెప్పాడు.

# సాత్విక్-చిరాగ్ జోడీకి
# చైనా మాస్టర్స్ టైటిల్

LI-NING CHINA MASTERS BWF World Tour Super 750




షెన్‌జెన్: భారత బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి చైనా మాస్టర్స్ సూపర్ సిరీస్ 750 టైటిల్‌ను దక్కించుకుంది.

ఆసియా పురుషుల డబుల్స్ ఫైనల్లో ప్రపంచ నం.5 సాత్విక్, చిరాగ్ జంట 11-21, 21-13, 21-17 తేడాతో హె జి టింగ్, రెన్ జియాంగ్ యు (చైనా) ద్వయాన్ని ఓడించి విజేతగా నిలిచింది. గంట 10 నిమిషాలపాటు సాగిన ఈ మ్యాచ్‌లో తొలి గేమ్‌లో భారత జోడీ నిరాశపరిచింది. తర్వాత పుంజుకున్న భారత ద్వయం రెండు గేమ్‌ల్లో దూకుడుగా ఆడి చైనా జోడీని మట్టికరిపించింది.

ఈ టోర్నీలో 2023, 2025లో రన్నరప్‌గా నిలిచిన సాత్విక్, చిరాగ్ జంట మూడో ప్రయత్నంలో చైనా మాస్టర్స్ సూపర్ సిరీస్ 750 టైటిల్‌ను దక్కించుకుంది.

# వచ్చే జూన్ కల్లా సెన్సెక్స్ 89,000 పాయింట్లకు

## మోర్గాన్ స్టాన్లీ అంచనా

**2027 జూన్ నాటికి బిఎస్ఈ సెన్సెక్స్ 89,000 పాయింట్లకు చేరుకుంటుందని మోర్గాన్ స్టాన్లీ అంచనా వేసింది. ప్రస్తుతం ఉన్న స్థాయి నుండి ఇది 16 శాతం అధికం. 'ఎ లాంగ్ తే ఆఫ్' పేరుతో విడుదల చేసిన నివేదికలో భారత్ సుదీర్ఘ కాల వృద్ధి చక్రంలోకి ప్రవేశిస్తోందని వ్యూహకర్తలు రిథిమ్ దేశాయ్, నయంత పటేల్ పేర్కొన్నారు. ఇటీవలి మార్కెట్ ఒడుదొడుకులను వారు ఒక తాత్కాలిక విరామంగానే భావిస్తున్నారు. అయితే ఈ మార్కెట్ లక్ష్యాలు ముడి చమురు ధరలు, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులపై ఆధారపడి ఉంటాయని వారు తెలిపారు.**




### బుల్ రంకేస్తే లక్ష పాయింట్లకు..

**బుల్ కేస్ (అత్యుత్తమ పరిస్థితి)**
**సెన్సెక్స్ 1,00,000 పాయింట్లు**
- ముడి చమురు ధర బ్యారెల్‌కు 75-80 డాలర్ల కంటే తక్కువగా ఉండాలి.
- కంపెనీల ఆదాయాలు ఏటా 19 శాతం వృద్ధి చెందాలి.

**బేస్ కేస్ (సాధారణ వృద్ధి)**
**సెన్సెక్స్ 89,000 పాయింట్లు**
- ఆర్థిక స్థిరత్వం కొనసాగాలి.
- ప్రైవేటు పెట్టుబడులు పెరగాలి.
- కంపెనీల ఆదాయాలు ఏటా 16 శాతం వృద్ధి చెందాలి.

**బేర్ కేస్ (మార్కెట్ పతనం)**
**సెన్సెక్స్ 66,000 పాయింట్లు**
- ముడి చమురు ధర బ్యారెల్‌కు 120 డాలర్లను అధిగమించడం.
- అంతర్జాతీయ ఆర్థిక మందగమనం.
- కంపెనీల ఆదాయాల వృద్ధి 13 శాతానికి పడిపోవడం.

### లాభపడే రంగాలు

**బ్యాంకింగ్ రంగం:** రుణాలు, పెట్టుబడులకు గిరాకీ పెరగడం వల్ల బాగా లాభపడుతుంది.

**పారిశ్రామిక రంగం:** ప్రభుత్వ మౌలిక సదుపాయాల వ్యయం, ప్రైవేటు కంపెనీల పెట్టుబడుల వల్ల పుంజుకుంటుంది.

**వినియోగ రంగం:** దేశీయంగా కొనుగోలు శక్తి, పట్టణ వినియోగం పెరగడంతో జోరందుకుంటుంది.

**ఐటీ రంగం:** అంతర్జాతీయంగా మందగమనం ఉన్నప్పటికీ, ఏఐ అప్లికేషన్ల గిరాకీ వల్ల ఊహించని విధంగా పుంజుకునే అవకాశం ఉంది.

2027 జూన్ నాటికి బీఎస్ఈ సెన్సెక్స్ 89,000 పాయింట్లకు చేరుకుంటుందని మోర్గాన్ స్టాన్లీ అంచనా వేసింది. ప్రస్తుతం ఉన్న స్థాయి నుంచి ఇది 16 శాతం అధికం. 'ఎ లాంగ్ వే అప్' పేరుతో విడుదల చేసిన నివేదికలో భారత్ సుదీర్ఘ కాల వృద్ధి చక్రంలోకి ప్రవేశిస్తోందని వ్యూహకర్తలు రిధమ్ దేశాయ్, నయంత్ పరేఖ్ పేర్కొన్నారు. ఇటీవలి మార్కెట్ ఒడుదొడుకులను వారు ఒక తాత్కాలిక విరామంగానే భావిస్తున్నారు. అయితే ఈ మార్కెట్ లక్ష్యాలు ముడి చమురు ధరలు, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులపై ఆధారపడి ఉంటాయని వారు తెలిపారు.

బుల్ రంకేస్తే లక్ష పాయింట్లకు..

2027 జూన్ నాటికి మార్కెట్ పరిస్థితి బుల్ కేసులో ఉంటే గరిష్ఠంగా సెన్సెక్స్ 1,00,000 పాయింట్లకు చేరుకోవచ్చని పేర్కొన్నారు. దీనికి ముడి చమురు ధర బ్యారెల్‌కు 75-80 డాలర్ల కంటే తక్కువగా ఉండాలి. కంపెనీల ఆదాయాలు ఏటా 19 శాతం వృద్ధి చెందాలి.

బేస్ కేసులో (సాధారణ వృద్ధి) 89,000 పాయింట్లకు చేరొచ్చు. దీనికి ఆర్థిక స్థిరత్వం కొనసాగాలి. ప్రైవేటు పెట్టుబడులు పెరగాలి. కంపెనీల ఆదాయాలు ఏటా 16 శాతం వృద్ధి చెందాలి.

బేర్ కేసులో (మార్కెట్ పతనం) సెన్సెక్స్ 66,000 పాయింట్లకు పడిపోయే అవకాశం ఉంది. ముడి చమురు ధర బ్యారెల్‌కు 120 డాలర్లను అధిగమించడం, అంతర్జాతీయ ఆర్థిక మందగమనం, కంపెనీల ఆదాయాల వృద్ధి 13 శాతానికి పడిపోవడం వంటివి పతనానికి కారణాలు కావొచ్చు.

లాభపడే రంగాలు

దేశంలో రుణాలు, పెట్టుబడులకు గిరాకీ పెరగడం వల్ల బ్యాంకింగ్ రంగం బాగా లాభపడుతుంది. ప్రభుత్వ మౌలిక సదుపాయాల వ్యయం, ప్రైవేటు కంపెనీల పెట్టుబడుల వల్ల పారిశ్రామిక రంగం పుంజుకుంటుంది. దేశీయంగా కొనుగోలు శక్తి, పట్టణ వినియోగం పెరగడంతో వినియోగ రంగం జోరందుకుంటుంది. అంతర్జాతీయంగా ఐటీ మందగమనం ఉన్నప్పటికీ, కృత్రిమ మేధ (ఏఐ) అప్లికేషన్ల గిరాకీ వల్ల ఇది ఊహించని విధంగా పుంజుకునే అవకాశం ఉంది.

గమనించాల్సిన నష్ట భయాలు

యుద్ధాలు, అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలో అడ్డంకులు మార్కెట్‌ను దెబ్బతీయొచ్చు. భారత్ ముడి చమురును భారీగా దిగుమతి చేసుకుంటుంది కాబట్టి ధరలు పెరిగితే కంపెనీల లాభాలు తగ్గుతాయి.

# జేఎల్ఆర్‌లో
## 4,000 ఉద్యోగాల కోత



లండన్: టాటా మోటార్స్ అనుబంధ లగ్జరీ కార్ల తయారీ సంస్థ జాగ్వార్ ల్యాండ్ రోవర్ (జేఎల్ఆర్) యూకేలోని తన విభాగాల్లో వచ్చే రెండేళ్లలో సుమారు 4,000 మంది ఉద్యోగులను తగ్గించాలని యోచిస్తోంది. అంతర్జాతీయంగా తగ్గుతున్న అమ్మకాలు, పెరుగుతున్న ఖర్చులు, అమెరికా విధిస్తున్న కొత్త వాణిజ్య సుంకాల ప్రభావం వల్ల ఈ నిర్ణయం తీసుకోక తప్పడం లేదని సమాచారం. ఖర్చులను తగ్గించుకుని సంస్థను మరింత సమర్థవంతంగా నడపంలో భాగంగా ఉద్యోగుల కోసం కంపెనీ స్వచ్ఛంద విరమణ ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపింది. జేఎల్ఆర్ ఉద్యోగాల కోత ద్వారా వచ్చే రెండేళ్లలో సుమారు 1.7 బిలియన్ పౌండ్ల (సుమారు రూ.17,000 కోట్లకు పైగా) వ్యయాలను తగ్గించుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రసుత్తం జేఎల్ఆర్‌కు బ్రిటన్ వ్యాప్తంగా మూడు ప్రధాన ప్లాంట్లలో సుమారు 34,000 మంది ఉద్యోగులు ఉన్నారు. తాజా ఉద్యోగాల కోత ఆఫీస్, మేనేజ్‌మెంట్ సిబ్బందికే వర్తించనుందని తెలుస్తోంది.

**భారత్‌లో ఫోక్స్‌వ్యాగన్ కోత ప్రభావం తక్కువే**

జర్మనీకి చెందిన ప్రముఖ కార్ల తయారీ సంస్థ ఫోక్స్ వ్యాగన్ మన దేశంలో వచ్చే రెండేళ్లలో 12 శాతం మంది ఉద్యోగులను తొలగించాలని యోచిస్తోంది. ఇక్కడ సంస్థకు 2300-2700 వరకు ఉద్యోగులున్నారు. ఆ లెక్కన ప్రభావం వందల సంఖ్యలోనే ఉండనుంది. అంతర్జాతీయ స్థాయిలో 50,000 మందికి ఉద్వాసన పలికే ప్రక్రియను ప్రారంభించిన ఈ సంస్థ, 2030 నాటికి మరో 50,000 ఉద్యోగాలను తగ్గించాలని, జర్మనీలోని కొన్ని ప్లాంట్లను మూసివేయాలని నిర్ణయించింది. అయితే భారత్‌ను ఒక ముఖ్యమైన తయారీ, ఎగుమతి కేంద్రంగా కొనసాగిస్తామని, ఇక్కడి ఇంజినీరింగ్ బృందాన్ని మరింతగా విస్తరిస్తామని కంపెనీ స్పష్టం చేసింది.

## ఎస్‌బిఐలో కొత్తగా 12 వేల నియామకాలు!

ప్రభుత్వ రంగానికి చెందిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ాదీ×) తన సేవలను మరింత విస్తరించనుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో 12 వేల నియామకాలతో పాటు (ాదీ× ష్ట్రఃఅతీఃఅస్త్ర), కొత్తగా 250 బ్రాంచ్‌లను ప్రారంభించనున్నట్లు ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి తెలిపారు.

ఈ ఏడాదే 11-12 వేల వరకు కొత్త నియామకాలు చేపట్టే ప్రణాళికలు ఉన్నాయని ఎస్‌బీఐ ఛైర్మన్ సీఎస్ శెట్టి వెల్లడించారు. ముఖ్యంగా క్లరికల్, ఆఫీసర్ కేడర్లలో ఇవి ఉంటాయన్నారు. ఉద్యోగుల రిటైర్మెంట్, బ్యాంక్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎస్‌బీఐకి అత్యంత భారీ నెట్‌వర్క్ ఉందని, బ్యాంక్ సేవలను మరింత విస్తరించేందుకు కొత్తగా 200 - 250 బ్రాంచ్‌లను ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు.

మార్చి 2026 నాటికి ఎస్‌బీఐలో మొత్తం ఉద్యోగుల సంఖ్య 2.45 లక్షలు దాటింది. గత ఆర్థిక సంవత్సరంలో ఈ బ్యాంక్ మొత్తం 25,633 మందిని రిక్రూట్ చేసుకుంది. మరోవైపు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్రతిపాదిస్తున్న రూ.30వేల కోట్ల ఐపీఓ (ఖూా)లో ఎస్‌బీఐ, దాని అనుబంధ సంస్థ ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్ లిమిటెడ్ సంయుక్తంగా 1 శాతం వాటాను విక్రయించనున్నాయి.

# 'పసిడి' రుణాల జోరు!



హైదరాబాద్: దేశ వ్యాప్తంగా బంగారు రుణాల మార్కెట్ శరవేగంగా విస్తరిస్తోంది. ఒకప్పుడు ఆర్థిక ఇబ్బందుల్లో చివరి ప్రత్యామ్నాయంగా నిలిచిన ఈ రుణాలు, ఇప్పుడు రిటెయిల్ ఆస్తుల విభాగంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్నాయి. మోతీలాల్ ఓస్వాల్ నివేదిక అంచనా ప్రకారం.. 28 శాతం వార్షిక వృద్ధి రేటుతో ఈ రంగం 2028 మార్చి నాటికి రూ.30 లక్షల కోట్ల మైలురాయిని అధిగమించనుంది. 2026 మార్చి నాటికి రూ.18.6 లక్షల కోట్లుగా ఉన్న ఈ మార్కెట్ పరిణామం, గృహ రుణాల తర్వాతి స్థానాన్ని ఆక్రమిస్తూ, రెండో అతిపెద్ద రిటెయిల్ ఆస్తి విభాగంగా నిలిచింది. వ్యక్తిగత రుణాల పోర్ట్‌ఫోలియోనూ ఇది అధిగమించడం విశేషం. 2026 ఆర్థిక సంవత్సరంలో నమోదైన 50 శాతం వృద్ధికి పసిడి ధరలు 60 శాతం మేర పెరగడమూ ప్రధాన కారణం. భారతీయ కుటుంబాల దగ్గరున్న బంగారు నిల్వలే ఈ భారీ వృద్ధికి దోహదం చేస్తున్నాయి.

**ఇళ్లల్లోనే 28,000 టన్నుల పసిడి**

ఇళ్లల్లో ఉన్న పసిడి నిల్వలు దేశ రుణ లభ్యతను పెంచే వ్యూహాత్మక వనరులుగా మారుతున్నాయి. దేశంలోని కుటుంబాల వద్ద సుమారు 28,000 టన్నుల బంగారం ఉన్నట్లు అంచనా. దీని విలువ రూ.380-390 లక్షల కోట్ల మధ్య ఉంటుంది. ఈ భారీ నిల్వలో కేవలం 8 శాతం మాత్రమే వ్యవస్థీకృత మార్కెట్ పరిధిలోకి రావడం గమనార్హం. ఇదీ ఈ రంగానికి ఉన్న విస్తృత అవకాశాలను చాటుతోంది. ముఖ్యంగా ఎంఎస్ఎంఈ సంస్థలు, అసంఘటిత రంగాలు తమ నిర్వహణ మూలధనం కోసం పసిడి రుణాలను ఎక్కువగా ఆశ్రయిస్తున్నాయి. మైక్రోఫైనాన్స్ వినియోగదారులు పొందే ఇతర రిటెయిల్ రుణాల్లో బంగారు రుణాల వాటా 18 శాతానికి చేరడం గమనార్హం.

**పాత రుణగ్రహీతలే ఎక్కువగా..**

బంగారం రుణాల్లో మరో ఆసక్తికరమైన విషయమూ ఉంది. కొత్త రుణగ్రహీతలకంటే, పాత ఖాతాదారులే పదే పదే రుణాలు తీసుకోవడం మార్కెట్ సుస్థిరతపై సందేహాలను రేకెత్తిస్తోంది. ప్రస్తుత వృద్ధి కేవలం బంగారం ధరల పెరుగుదలపైనే ఆధారపడి ఉంటుంది తప్ప వినియోగదారుల సంఖ్యలో పురోగతి కనిపించడం లేదు. ముత్తూట్ ఫైనాన్స్, మణప్పురం ఫైనాన్స్ వంటి బంగారు రుణ సంస్థలూ ఇదే విషయాన్ని పేర్కొంటున్నాయి. ఈ రెండు సంస్థల ఉమ్మడి ఖాతాదారుల సంఖ్య 90 లక్షల వద్ద, బంగారం నిల్వలు 260-265 టన్నుల వద్దే ఉన్నాయి. పోర్ట్‌ఫోలియో విలువ పెరిగినా, వినియోగదారుల బలం విస్తరించకపోవడం పరిశ్రమ ఎదుర్కొంటున్న ప్రధాన సవాలు. 2022లో 75 శాతంగా ఉన్న పాత రుణాల పునరుద్ధరణ వాటా 2025 నాటికి 82 శాతానికి చేరడం వ్యవస్థాగత నష్టభయాన్ని సూచిస్తోంది. ఇది రుణ గ్రహీతలు మరింత అప్పుల ఊబిలోకి కూరుకుపోయే ప్రమాదాన్ని వెల్లడిస్తోంది.

**దేశవ్యాప్తంగా...**

ఒకప్పుడు దక్షిణాది రాష్ట్రాలకే ఎక్కువగా పరిమితమైన బంగారు రుణాల వ్యాపారం ఇప్పుడు దేశ వ్యాప్తంగా విస్తరిస్తోంది. దేశవ్యాప్త సగటు వృద్ధి 50 శాతంగా ఉంటే, రాజస్థాన్‌లో 78 శాతం, మహారాష్ట్రలో 61 శాతం, ఉత్తరప్రదేశ్‌లో 58 శాతం వృద్ధి నమోదైంది. ఈ భౌగోళిక విస్తరణ పసిడి రుణ రంగంలో సరికొత్త పోటీకి ఆస్కారం ఇస్తోంది..

**నిబంధనలు కఠినంగా..**

పసిడి రుణ మార్కెట్‌లో నెలకొన్న ఈ పరిస్థితిని గమనిస్తున్న నియంత్రణ సంస్థలు నిబంధనలను ఎప్పటికప్పుడు కఠినతరం చేస్తున్నాయి. మార్కెట్ అదుపు తప్పకుండా చూసేందుకు ఆర్‌బీఐ పర్యవేక్షణ పెంచింది. విలువ ఆధారిత రుణం (ఎల్‌టీవీ) లెక్కింపు విధానం, రుణాల కాలపరిమితి, రుణ గ్రహీతల అర్హత ప్రమాణాలతో పాటు రుణ నిర్వహణపైనా కఠిన ఆదేశాలు జారీ చేసింది. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల మధ్య నిబంధనల సమన్వయం వల్ల అనారోగ్యకరమైన పోటీకి అడ్డుకట్ట వేయాలని ఆర్‌బీఐ భావిస్తోంది.

**పోటీ పడుతున్న సంస్థలు**

ఈ రంగంలోని లాభాలను అందుకోవడానికి ప్రైవేట్ బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీ) సంస్థలు దూకుడు ప్రదర్శిస్తున్నాయి. బజాజ్ ఫైనాన్స్ బంగారం రుణాల విభాగం గత మూడేళ్లలో 86 శాతం వార్షిక వృద్ధి రేటును నమోదు చేస్తూ, 2026




# 11 కంపెనీలు.. 7,055 కోట్లు..
## ఈ వారం ఐపీఓలు ఇవే

ప్రైమరీ మార్కెట్‌లో ఈ వారమూ పబ్లిక్ ఇష్యూల సందడి కొనసాగనుంది. 11 కంపెనీలు మొత్తం రూ.7,055 కోట్ల నిధుల సమీకరించనున్నాయి. సెప్టెంబర్ 7-15 మధ్య దలాల్ స్ట్రీట్‌లో ఈ ఐపీఓలు సందడి చేయనున్నాయి. ఇందులో రెంటోమోజో, కరమ్‌తర ఇంజినీరింగ్, కనోహర్ ఎలక్ట్రికల్స్ వంటి కంపెనీలు ఉన్నాయి. తాజా షేర్లు, ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లను విక్రయించనున్నాయి. ఐపీఓ నిధులను వ్యాపార విస్తరణకు, రుణాల చెల్లింపులకు, ఇతర కార్పొరేట్ అవసరాలకు పలు కంపెనీలు వినియోగించనున్నాయి. ఇక ఆ వివరాలను పరిశీలిస్తే..

**ఎస్‌బీఐలో కొత్తగా 12 వేల నియామకాలు!**

ప్రణవ్ కన్‌స్ట్రక్షన్స్ సెప్టెంబర్ 7న పబ్లిక్ ఇష్యూకు రానుంది. రూ. 351 కోట్ల నిధులను సమీకరించనుంది. సెప్టెంబర్ 9న ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ ముగుస్తుంది. ఒక్కో షేరు ధర 118-124గా కంపెనీ నిర్ణయించింది.

కనోహర్ ఎలక్ట్రికల్స్ సెప్టెంబర్ 8న ఐపీఓకు వస్తోంది. రూ.1,056 కోట్ల నిధులను సమీకరించనుంది. ధరల శ్రేణి 601-632.

ప్రసోల్ కెమికల్స్ కూడా సెప్టెంబర్ 8న ఐపీఓకు రానుంది. ధరల శ్రేణి రూ.643-676గా కంపెనీ నిర్ణయించింది. రూ.500కోట్ల నిధులను సమీకరించనుంది. రూ.80 కోట్ల తాజా షేర్లు, రూ. 420 కోట్ల ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లు విక్రయించనున్నారు.

గ్లాస్ వాల్ సిస్టమ్స్ (ఇండియా) ఐపీఓ సెప్టెంబర్ 8న రూ.428 కోట్ల నిధుల సమీకరణకు ఐపీఓకు వస్తోంది. ఒక్కో షేరు ధర రూ.172-182గా కంపెనీ నిర్ణయించింది.

రెంటోమోజో సెప్టెంబర్ 9న ఐపీఓకు వస్తోంది. ఒక్కో షేరు ధర రూ.384-404 కంపెనీ నిర్ణయించింది. రూ.1,256 కోట్ల నిధులను సమీకరించనుంది. రూ.150 కోట్ల తాజా షేర్లు, రూ.1,106 కోట్ల ఆఫర్ ఫర్ సేల్ రూపంలో ఉండనున్నాయి.

కరమ్‌తర ఇంజినీరింగ్ రూ.875 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంగా సెప్టెంబర్ 9న పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. రూ.675 కోట్ల తాజా షేర్లు, రూ.200 కోట్ల ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లు ఉండనున్నాయి. ధరల శ్రేణి రూ.241-254 కంపెనీ నిర్ణయించింది.

మణిపాల్ పేమెంట్ అండ్ ఐడెంటిటీ సొల్యూషన్స్ కూడా సెప్టెంబర్ 9న ఐపీఓకు వస్తోంది. రూ.805 కోట్ల నిధులను సమీకరించనుంది. ధరల శ్రేణి రూ.322-339గా నిర్ణయించింది. ఇందులో రూ.320 కోట్ల తాజా షేర్లు, రూ.485 కోట్ల ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లు విక్రయిస్తున్నారు.

ఆర్సిల్ కంపెనీ రూ.733 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంతో సెప్టెంబర్ 9న పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. ఒక్కో షేర్ ధర రూ.132-139గా నిర్ణయించింది. పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లు విక్రయిస్తున్నారు.

ఎల్‌సీసీ ప్రాజెక్ట్స్ ఐపీఓ సెప్టెంబర్ 9న ప్రారంభం కానుంది. రూ.427 కోట్ల నిధులను సమీకరించనుంది. ధరల శ్రేణి రూ.139-146గా కంపెనీ నిర్ణయించింది.

స్టీమ్‌హౌస్ ఇండియా రూ.414 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంతో సెప్టెంబర్ 9న ఐపీఓకు వస్తోంది. తాజా షేర్లు, ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లు



## అదితి ప్రేమకథ పూర్తి!

కళ్లతోనే హావభావాల్ని పలికిస్తూ.. తనదైన నటనతో వెండితెరపై ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది అందాల తార అదితి రావ్ హైదరీ. రెండేళ్ల క్రితం 'హీరామండీ' సిరీస్‌లో బిబ్బోజాన్ పాత్రలో మెరిసి తన నృత్యంతో ఓటీటీ వేదికగా కుర్రకారుని అలరించిన ఈమె.. ఇప్పుడు ప్రేమికురాలిగా మరో సిరీస్‌తో సందడి చేయడానికి సిద్ధమైంది. అదితి, అర్జున్ రాంపాల్, అవినాశ్ తివారీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సిరీస్ 'ఓ సాథీ రే'. ప్రముఖ దర్శకుడు ఇంతియాజ్ అలీ షో రన్నర్‌గా వ్యవహరిస్తున్న ఈ సిరీస్‌కు ఆరిఫ్ అలీ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సిరీస్ చిత్రీకరణ పూర్తయినట్లు తెలుపుతూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఫొటోల్ని పంచుకున్నారు ఇంతియాజ్ అలీ. వింటేజ్ లవ్‌స్టోరీగా దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు, త్వరలోనే విడుదల తేదీని అధికారికంగా వెల్లడించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు సిరీస్ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం అదితి ఖాతాలో 'పరివారిక్ మనురంజన్' చిత్రముంది.

## బిగ్‌బాస్ సీజన్-10... ఈసారి హౌస్‌లోకి వెళ్లేది వీళ్లేనా?



హైదరాబాద్: 'ఈ ఇంటిలో కావాల్సింది తెలివి తేటలు.. లెక్కలు.. డేటా కాదు.. ఎమోషన్స్‌తో అల్లుకున్న చిక్కులు అంటున్నారు నాగార్జున. ఆయన వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న రియాల్టీ షో 'బిగ్‌బాస్'. ఇప్పటివరకూ 9 సీజన్లు పూర్తి చేసుకున్న ఈ షో ఈ ఆదివారంతో 10వ సీజన్‌కు శ్రీకారం చుట్టనుంది. ఈ సందర్భంగా గ్రాండ్ లాంచ్ ఈవెంట్‌కు సంబంధించిన ప్రోమో విడుదలైంది. సరికొత్త బిగ్‌బాస్ హౌస్‌లో ఉన్న విశేషాలు, కాన్సెప్ట్ ఇప్పటివరకూ చూడలేదని నాగార్జున ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈసారి అగ్నిపరీక్ష నుంచి సెలక్ట్ అయిన టాప్-13ను చూపించారు. అయితే, సెలబ్రిటీల వివరాలేవీ పంచుకోలేదు. త్రిగుణ్, సుధీర్ టాక్స్, అమన్, చైత్రా రాయ్, 'జబర్దస్త్' రాంప్రసాద్, షాలిని, 'టెంపర్' వంశీ, సృష్టి, 'జబర్దస్త్' నరేశ్, ఆర్జే చరణ్, కృష్ణుడు, వర్షిణి, రోహిత్, ముకేశ్ గౌడలు ఈసారి హౌస్‌లోకి వెళ్లనున్నట్లు తెలుస్తోంది.

## అలాంటి సినిమాల్ని ఎప్పటికీ అంగీకరించను!



"సినిమాల్లో మహిళలను కేవలం వస్తువులుగా చూపించడాన్ని నేను అంగీకరించను" అని అంటోంది కథానాయిక కయాదు లోహర్. కొత్తదనం నిండిన కథల్ని ఎంచుకుంటూ దక్షిణాదిలో మంచి క్రేజ్‌ను సంపాదించుకుంటోంది తార. ఈ ఏడాది ఇప్పటికే 'ఇదయం మురళి', 'ఐమ్ గేమ్', 'ఇమ్మోర్టల్' లాంటి పలు చిత్రాలతో తెరపై మెరిసింది. ఈ నేపథ్యంలోనే ఇటీవల ఓ కార్యక్రమంలో పాల్గొన్న కయాదు.. సినిమాల్లో హీరోయిన్లను చూపించే విధానంపై కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది. "కేవలం సినీప్రియుల దృష్టిని ఆకర్షించడం కోసమే నటీమణులను అసభ్యకరంగా చూపించే చిత్రాలలో నేను భాగం కావాలనుకోవడం లేదు. మహిళలను ఓ అనవసర వస్తువులా చూపించడం నాకు అస్సలు నచ్చదు. కానీ కథకు, పాత్రకు అది అవసరమని నాకు నమ్మకం కలిగితే.. ఓ స్థాయి వరకు దాన్ని నేను అంగీకరిస్తా. అంతేకానీ దృష్టిని ఆకర్షించడం కోసం అలాంటి పనులు చేయడం నాకిష్టం లేదు. అది అప్పుడప్పుడు ఇన్‌స్టాలో ట్రెండ్ అవ్వొచ్చు. కానీ ఆ ఆలోచన నాకు ఏమాత్రం సౌకర్యవంతంగా అనిపించదు. అలాంటి సినిమాలను ఎన్నటికీ అంగీకరించను" అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఆమె ఖాతాలో 'ది ప్యారడైజ్', 'సూర్య 48' తదితర చిత్రాలున్నాయి.

## గుర్తుండిపోయేలా తెల్ల కాగితం



"యువతరంతో పాటు కుటుంబ ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే సినిమా 'తెల్ల కాగితం" అన్నారు నిర్మాత దిల్‌రాజు. హర్ష్ రోషన్, నక్షత్ర జంటగా నటించిన ఈ సినిమాని రమేశ్ బండ్రెడ్డి తెరకెక్కించారు. కృష్ణ కొమ్మాలపాటి నిర్మించారు. అజయ్, దీపక్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం అక్టోబరు 2న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో ఈ చిత్ర టీజర్‌ను విడుదల చేశారు. నిర్మాత దిల్‌రాజు, దర్శకులు బాబీ, రామ్ అబ్బరాజు, భాను భోగవరపు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. "ఇది మనందరి కథ. పదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ చదివిన ప్రతి ఒక్కరూ కనెక్ట్ అయ్యే కథ. గుర్తుండిపోయేలా ఉంటుంది" అన్నారు హీరో హర్ష్ రోషన్.

## అలాంటి మాటలు అనొద్దు: డైరెక్టర్‌తో శ్రీవిష్ణు ఫన్




తనదైన కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను అలరిస్తూ, వరుస హిట్లతో దూసుకెళ్తున్నారు శ్రీవిష్ణు . ఆయన ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'కామ్రేడ్ కళ్యాణ్'. జానకీరామ్ మారెళ్ల తెరకెక్కించారు. తాజాగా ఈ సినిమా టీజర్ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఇందులో శ్రీవిష్ణు మాట్లాడుతూ డైరెక్టర్ జానకీరామ్‌పై ఫన్నీ కామెంట్స్ చేశారు. 'నువ్వు కంగారుపడకు. కంగారులో ఏవేవో వాగ్దానాలు చేయొద్దు. 'అమీర్‌పేట్ సెంటర్లో బట్టలిప్పుతా..' లాంటి మాటలు చెప్పకు' అని డైరెక్టర్‌కు సూచించారు. దీంతో వేదికపై ఉన్నవారంతా నవ్వేశారు. ఇటీవల కొన్ని చిన్న సినిమాల నటులు, దర్శకులు రిలీజ్‌కు ముందు ప్రేక్షకుల దృష్టినాకర్షించడానికి ఇస్తున్న విచిత్రమైన స్టేట్‌మెంట్లు వైరల్ అవుతున్న సంగతి తెలిసిందే. వాటిపై పంచ్ వేస్తూ శ్రీవిష్ణు ఈ వ్యాఖ్యలు చేశారు.

## అదే చేయాలనుకుంటే నేను ఐటీ ఉద్యోగంలోనే ఉండిపోయేవాణ్ని!



జయాపజయాలతో సంబంధం లేకుండా వైవిధ్యభరితమైన చిత్రాలతో ప్రేక్షకుల్ని మెప్పించే ప్రయత్నం చేస్తుంటారు తమిళ కథానాయకుడు కార్తి. అదే ఆయన్ని తెలుగు సినీప్రియులకు దగ్గరయ్యేలా చేసింది. 'సత్యం సుందరం' విజయం తర్వాత ఇప్పుడాయన నుంచి వస్తున్న కొత్త సినిమా 'సర్దార్ 2'. ఇది కార్తి - పీఎస్ మిత్రన్ కలయిక నుంచి వచ్చిన విజయవంతమైన చిత్రం 'సర్దార్'కి కొనసాగింపుగా రూపొందింది. ఇది ఈ నెల 10న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు కార్తి.

**అందుకే సర్దార్ మళ్లీ తిరిగొస్తున్నాడు..**

"సాధారణంగా ఓ హిట్ సినిమా అవ్వగానే దానికి సీక్వెల్ చేయడం నా అలవాటు కాదు. కానీ, 'సర్దార్' విషయానికొస్తే ఆ పాత్రలో కొత్తగా ఆవిష్కరించడానికి చాలా కోణాలు మిగిలే ఉన్నాయనిపించింది. తొలి భాగం ముగింపులోనే పార్ట్-2కి మంచి స్కోప్ లభించింది. కొన్నాళ్ల క్రితం దర్శకుడు మిత్రన్ నా దగ్గరకొచ్చినప్పుడు 'సర్దార్' మళ్లీ ఎందుకు తిరిగి రావాలో దానికొక బలమైన ప్రయోజనాన్ని కనుగొన్నాని చెప్పారు. అలాగే ఈసారి తొలి భాగంలో కంటే శక్తిమంతమైన ఓ విలన్ కాన్సెప్ట్‌ని సిద్ధం చేసినట్లు చెప్పాడు. ఆ కథ విన్నాక 'సర్దార్ 2' కచ్చితంగా చేయాల్సిందేనని నిర్ణయించుకున్నా. ఇందులో తొలి భాగంలోని నీళ్ల కాన్సెప్ట్ కంటే పదిరెట్లు ఎక్కువ ప్రభావం చూపే కాన్సెప్ట్ ఒకటుంది. అదేంటన్నది నేను చెప్తే బాగోదు.. తెరపై చూసి థ్రిల్ అవ్వాల్సిందే. దాదాపుగా గూఢచారి చిత్రాలన్నీ బయట దేశాల్లోనే జరుగుతుంటాయి. కానీ, ఈ సినిమాలో భారత్‌లో జరుగుతున్న ఓ సమస్యనే ఒక గూఢచారి ఎలా హ్యాండిల్ చేశాడన్నది ఆసక్తికరంగా ఉంటుంది. మొదటి పార్ట్‌లో ఉన్న ఎమోషన్స్, డ్రామాలు కొనసాగుతూనే ఈసారి యాక్షన్, స్పై అంశాలు మరోస్థాయిలో ఉండనున్నాయి".

**అదే పెద్ద సవాల్‌గా అనిపించింది**

"సర్దార్'లో తండ్రీ కొడుకుల పాత్రలు క్లైమాక్స్‌లోనే కలుస్తాయి. కానీ, ఈ రెండో భాగంలో వాళ్లిద్దరూ ఆద్యంతం కలిసే ప్రయాణిస్తారు. దీనికోసం రోజుకు రెండు గెటప్స్ మార్చి మార్చి షూటింగ్ చేయాల్సి వచ్చేది. అలా ఏక కాలంలో వృద్ధ సర్దార్ పాత్రని, తన కొడుకు పాత్రను చేయడం సవాల్‌గా అనిపించింది. దీంట్లో ఆ రెండు పాత్రలు చేసే యాక్షన్‌లోనూ చాలా వేరియేషన్ కనిపిస్తుంది. వయసు పైబడ్డ సర్దార్ పాత్ర మామూలు కుర్రాళ్లలా ఫైట్ చేయలేదు. ఆయన చాలా నైపుణ్యం ఉన్నవాడు. తన చుట్టూ ఉన్న ఏ వస్తువునైనా ఆయుధంగా మార్చుకుని పోరాడగలడు. ఓ నటుడిగా ఈ రెండు పాత్రల మధ్య వైవిధ్యతను చూపించడం మంచి అనుభవాన్నిచ్చింది".

# ఊబకాయానికి 'తిండి కోత!'

తక్కువ తినండి
ఆరోగ్యంగా ఉండండి

పేజీలు : 12 | ధర : ₹10

ఆధునిక జీవనశైలికి అలవాడపడిన నేటి సమాజాన్ని కలవరపెడుతున్న అతిపెద్ద సమస్య ఊబకాయం. శారీరక శ్రమ తగ్గటం, ఎక్కువసేపు కూర్చొని చేసే పనులు మాత్రమే కాదు.. అవసరాలకు మించి తినటమూ దీనికి కారణమవుతోంది. ఆహారం ద్వారా లభించే క్యాలరీల జేబు, ఖర్చుల మధ్య లెక్క తప్పటం బరువు మీద గణనీయమైన ప్రభావమే చూపుతోంది. అందుకే తిండి మీద ధ్యాసకు ప్రాధాన్యం పెరుగుతోంది. ఆహార పరంగా తగిన జాగ్రత్తలు పాటిస్తే ఊబకాయాన్ని తగ్గించుకోవటం అసాధ్యమేమీ కాదు. కాకపోతే చిత్తశుద్ధితో ప్రయత్నించటమే కీలకం.

## తిండి తింటే కండ కలగటం నిజమే..

అతిగా తినటమే సమస్య. ప్రస్తుతం మన జీవనశైలి మారిపోయింది. వ్యాయామం, శ్రమ తగ్గిపోయాయి. ముడి ధాన్యాలకు బదులు బాగా పాలిష్ పట్టిన బియ్యం, మైదా పిండి వాడకం పెరిగింది. సమయం దొరకకపోవటమో, సౌకర్యమో.. కారణమేదైనా బయటి తిండి తినటమూ ఎక్కువైంది. ఫోన్లో క్లిక్ చేయగానే ఇంట్లో ఆహార పదార్థాలు వాలిపోతున్నాయి. నేడు తిండి అందుబాటులో ఉండటం, తినటం ఎక్కువైందనటంలో సందేహం లేదు.

'రోజుకు 1,500-1,800 క్యాలరీలే సరిపోతుంది. కానీ చాలామంది 2,000 కన్నా ఎక్కువే తీసుకుంటున్నారు. అంటే 200 నుంచి 500 క్యాలరీలు అదనమే. ఇవి చివరికి కొవ్వుగా మారి బరువు పెరగడానికి దారితీస్తాయి. ఆహారం తగ్గించుకుంటే బరువూ తగ్గుతుంది. రోజుకు 1,200 క్యాలరీలే తీసుకుంటే, 300 క్యాలరీల లోటు ఏర్పడి శరీరం కొవ్వును వాడుకోవటం మొదలెడుతుంది.

## కొద్దిగానే తింటున్నామే..

'మేం కొద్దిగానే తింటాం. అయినా బరువెక్కుతున్నాం' అనేది చాలామంది ఫిర్యాదు. కానీ ఇది నిజం కాదు. టీ, కాఫీలు, చక్కెర, పాలు కలిపి తీసుకోవటం వల్లే ఎక్కువ క్యాలరీలు లభిస్తాయి.



10 గ్రా. చక్కెర = 40 క్యాలరీలు
100 మి.లీ. చిక్కటి పాలు = 62 క్యాలరీలు
రోజుకు 300-400 క్యాలరీలు కేవలం టీ, కాఫీలతోనే!

## నూనెతోనూ ముప్పే

పిండి పదార్థాలు, చక్కెరతో పోలిస్తే నూనెలో రెట్టింపు క్యాలరీలుంటాయి. ఒక చెంచా నూనె = 50 క్యాలరీలు.

- రోజుకు 25-35 గ్రా. మించనీయద్దు.
- ఊబకాయులైతే 10 గ్రా.కే పరిమితం.



## తిండి తగ్గిస్తే ఆకలేయదా?

తక్కువ తింటే శరీరానికి సరిపోతుందో లేదో అనిపించదు. సమతులాహారంతో స్థూల, సూక్ష్మ పోషకాలన్నీ లభిస్తాయి. కొంచెం తిన్నా సరిపోతుంది. ఆహారంలో పోషకాలు లోపిస్తేనే ఏదో ఒకటి తినాలనిపిస్తుంది.

## ఇవి రోజూ అందాల్సిందే

పిండి పదార్థాలు, ప్రొటీన్, కొవ్వులతో పాటు విటమిన్లు, ఖనిజ లవణాలు అవసరం. తృణధాన్యాలు, పప్పులు, కూరగాయలు, ఆకుకూరలు, పాలు, పెరుగు, మజ్జిగ, పండ్లు, బెల్లం తప్పనిసరి.



ఈ తృణధాన్యాలు-పప్పులు-కూరగాయలతోనే సమతులత పోషకాలు లభిస్తాయి.

## ఈ లెక్కలు చూసుకోవాలి

తృణధాన్యాలు: 100 గ్రా. మించొద్దు
పప్పులు: 30 గ్రా. । నూనె: 10 గ్రా.
ఆకుకూరలు, కూరగాయలు: 500 గ్రా.
(ఉదయం 250 గ్రా. ం రాత్రి 250 గ్రా.)
పండ్లు: 100-150 గ్రా.

## సంప్రదాయ ఆహారమే మేలు

మన సంప్రదాయ ఆహారం సమతులంగా ఉంటుంది. అన్నం, పప్పు, కాయగూర, ఆకుకూర, సాంబారు, పులుసు, మజ్జిగ/పెరుగు ఉంటాయి. తుల్యంగా తాజా కూరగాయలు, ఆకుకూరలనే వాడతాం. కూరగా వండుకోవటం ఎక్కువ. వేపుళ్లు అరుదుగా. పిండి పదార్థాలు, చక్కెర, నూనెలు తగ్గించి, పప్పులు, పాలు, పండ్లు ఎక్కువగా తీసుకుంటే బరువు పెరగకుండా చూసుకోవటం పెద్ద కష్టమేమీ కాదు. మజ్జిగ, పెరుగులోని మంచి బ్యాక్టీరియా పేగులు ఆరోగ్యంగా ఉండటానికి తోడ్పడతాయి.



తిండి తగ్గించండి
బరువు తగ్గండి
ఆరోగ్యంగా ఉండండి

## ముఖ్య సూచనలు

- సమతులాహారం తీసుకోండి
- చక్కెర వాడొద్దు
- నూనె తగ్గించండి
- వ్యాయామం చేయండి
- నీరు ఎక్కువగా తాగండి
- సరిపడ నిద్ర తీసుకోండి

**ఆరోగ్యకరమైన జీవనశైలే సత్యమైన సంపద**

# విటమిన్ ఎ అతిగా వద్దు



ఎంత మంచిదైనా అతి పనికిరాదు. ఇది విటమిన్ ఎ మోతాదుకు అతికినట్టు సరిపోతుంది. కళ్లు, రోగనిరోధక వ్యవస్థ, శరీరంలోని చాలా అవయవాల ఆరోగ్యానికి విటమిన్ ఎ తోడ్పడుతుంది. కానీ మరీ అతిగా తీసుకుంటే కాలేయ సమస్యల వంటి వాటికి దారితీస్తుంది. మన శరీరం సహజంగానే విటమిన్ ఎ నిల్వ చేసుకుంటుంది. అందువల్ల దీన్ని మరింత ఎక్కువగా పోగుపడేలా చేయటం మంచిది కాదు. ఇది మితిమీరితే తలనొప్పి, వికారం, తల తిప్పటం, కాలేయం దెబ్బతినటం వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. విటమిన్ ఎ రూపమైన బీటా-కెరటిన్ మాత్రలను పెద్ద మొత్తంలో తీసుకుంటే కాలేయ క్యాన్సర్‌కూ దారితీయొచ్చు. ముఖ్యంగా పొగ తాగేవారికి, పొగ అలవాటుండి మానేసినవారికి, ఆస్‌బెస్టాస్ ప్రభావానికి గురయ్యేవారికి దీని ముప్పు ఎక్కువ. అందువల్ల సురక్షితంగా విటమిన్ ఎ లభించేలా చూసుకోవటమే ఉత్తమం. ఇందుకు ఆహారమే మార్గం. చేపలు, పాలకూర, క్యారెట్లు, అప్రికాట్లతో ఇది దండిగా లభిస్తుంది. ఆకుపచ్చ, నారింజ, పసుపు రంగుల్లో ఉండే కూరగాయలు, పండ్లు తినటం మంచిది. సాధారణంగా డాక్టర్లు మాత్రల కన్నా ఆహారానికే తొలి ప్రాధాన్యం ఇస్తారు. ఒకవేళ మాత్రలు వేసుకోవటం తప్పనిసరైతే సిఫారసు చేసిన మోతాదులకు కట్టుబడి ఉండాలి.

## నియమిత ఆహార వేళతో మతిమరుపు దూరం

వృద్ధాప్యంలో మేధస్సు చురుకుగా పనిచేయాలని కోరుకుంటున్నారా? అయితే రోజులో నియమిత వ్యవధిలోనే (ఉదాహరణకు- ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7 గంటల మధ్యలో) భోజన వేళలను పరిమితం చేసుకొని చూడండి. అలాగే పడుకోవటానికి ముందు నాలుగు గంటల వరకూ ఏమీ తినకుండా చూసుకోండి. ఇలాంటి ఆహార వేళలతో బరువు తగ్గటమే కాకుండా విషయ గ్రహణ సామర్థ్యం పెంచుకోవచ్చని రట్‌జర్స్ యూనివర్సిటీ నిర్వహించిన ప్రయోగాత్మక పరీక్షలో బయటపడింది. తీవ్ర మతిమరుపును తెచ్చిపెట్టే డిమెన్షియా కేసుల్లో దాదాపు 90% నివారించుకోదగినవేనని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. జీవనశైలి మార్పులతో డిమెన్షియా ముప్పు గణనీయంగా తగ్గుతున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. అయితే ఆహారం తీసుకునే తీరు నేరుగా విషయగ్రహణ సామర్థ్యం మీద ప్రభావం చూపుతుందో లేదో అనే దానిపై అంత ఎక్కువగా దృష్టి సారించలేదు.

# ప్రొటీన్ కథ

మనకు అవసరమైన మూడు ప్రధాన స్థూల పోషకాల్లో ప్రొటీన్లు ఒకటి. నిజానికి శరీరంలో నీరు తర్వాత అతి ఎక్కువగా ఉండేవీ ఇవే. కండరాలు, ఎముకలు, రక్తం చర్మం, వెంట్రుకలు, గోళ్లు, మెదడు కణాలు.. ఇలా అన్నీ వీటి మీదే ఆధారపడతాయి. ఒక్కమాటలో చెప్పాలంటే శరీరానికి చోదకశక్తి ప్రొటీన్లే. అందుకే వీటికి అంత ప్రాధాన్యం.

ప్రొటీన్లు అత్యంత సంక్లిష్ట పదార్థాలు. వీటికి మూలం అమైనో ఆమ్లాలు. ఇవి రసాయన బంధాలతో కలిసి ప్రొటీన్లుగా ఏర్పడతాయి. ఒక ప్రొటీన్‌లో వందలాది అమైనో ఆమ్లాలు ఉంటాయి తెలుసా? అందుకే వీటిని శరీర నిర్మాణంలో ఇటుకల వంటివని భావిస్తుంటారు. మన శరీరంలో ఇవి చేసే పనులకు అంతే లేదు. కణాలు జన్యువులను 'చదివేలా' చేయటమే కాకుండా ఆ సమాచారంతో కొత్త కణాలు, అణువులు పుట్టుకురావటానికి తోడ్పడతాయి. ఆశ్చర్యకరంగా అనిపించినా కొత్త ప్రొటీన్ల తయారీకీ దోహదం చేస్తాయి. కణాలకు, కణజాలాలకు ఒక ఆకృతిని ఇచ్చేవీ ప్రొటీన్లే. బ్యాక్టీరియా, వైరస్‌ల వంటి హానికరాలకు అంటుకుపోయి, వాటిని ఒంట్లోంచి బయటకు వెళ్లగొట్టేలా చేస్తాయి కూడా. కాబట్టి వయసుతో నిమిత్తం లేకుండా ఆహారం ద్వారా తగినంత ప్రొటీన్ లభించేలా చూసుకోవాలి.

### బాల్యం నుంచీ..

శిశువులకు, చిన్నారులకు చాలావరకూ తల్లిపాలు, పాల ఉత్పత్తుల నుంచి ప్రొటీన్ లభిస్తుంది. వయసు పెరుగుతున్న కొద్దీ ఆహారం తీరుతెన్నులు మారుతూ వస్తుంటాయి. అదృష్టవశాత్తూ శాకాహారం, మాంసాహారం రెండింటి నుంచీ తగినంత ప్రొటీన్ లభిస్తుంది. మాంసాహారంలో గుడ్డు, చేపలు, మాంసం.. శాకాహారంలో పప్పులు, గింజపప్పులు, విత్తనాలు, పాలు, పెరుగు వంటివి ప్రొటీన్ అందిస్తాయి. మాంసాహార ప్రొటీన్‌లో మన శరీరానికి అత్యవసరమైన అన్ని అమైనో ఆమ్లాలూ ఉంటాయి. అదే శాకాహార ప్రొటీన్‌లో కొన్ని అమైనో ఆమ్లాలు ఉండవు. అలాగని చింతించాల్సిన పనిలేదు. వేర్వేరు రకాల పదార్థాలు తినటం ద్వారా వీటిని భర్తీ చేసుకోవచ్చు. మనం ఆహారం ద్వారా తీసుకున్న ప్రొటీన్ జీర్ణాశయం నుంచి మొదలై పేగుల వరకూ విచ్ఛిన్న మవుతూ వస్తుంది. ప్రొటీన్ విచ్ఛిన్నమైనప్పుడు అమైనో ఆమ్లాలుగా మారుతుంది. ఈ ఆమ్లాలు రక్తంలో కలిసి, కాలేయానికి, అక్కడ్నుంచి శరీరమంతా పంపిణీ అవుతాయి.


### పెద్దమొత్తం అవసరం లేదు

ప్రొటీన్ ఎంత మంచిదైనా పెద్ద మొత్తంలో తీసుకోవాల్సిన అవసరం లేదు. ఎందుకంటే అదనపు ప్రొటీన్‌ను మన శరీరం నిల్వ ఉంచుకోలేదు. ఇది కొవ్వుగా మారటమో లేదా కిడ్నీల ద్వారా బయటకు వెళ్లటమో జరుగుతుంది. ముఖ్యంగా కిడ్నీజబ్బు గలవారికి అధిక ప్రొటీన్ చాలా కీడు చేస్తుంది. ప్రొటీన్ విచ్ఛినమైనప్పుడు పుట్టుకొచ్చే యూరియా, అమ్మోనియా, క్రియాటినైన్, యూరిక్ ఆమ్లం వంటి వాటిని బయటకు పంపటానికి కిడ్నీలు ఎక్కువ శ్రమించాల్సి వస్తుంది.

### తగ్గితే ప్రమాదం

ప్రొటీన్ మరీ తగ్గితే కండరాల బలహీనత, నిస్సత్తువ, జబ్బుల నుంచి త్వరగా కోలుకోకపోవటం వంటివి తలెత్తుతాయి. వెంట్రుకలు, గోళ్లు పెళుసుబారతాయి కూడా.

### గుడ్డు మంచిదే అయినా



క్రీడాకారులు, బాడీబిల్డర్లు కొన్నిసార్లు గుడ్లు ఎక్కువగా తింటుంటారు. గుడ్లలో అత్యంత నాణ్యమైన ప్రొటీన్ ఉండే మాట నిజమే అయినా పచ్చసొనలో కొలెస్ట్రాల్, కొవ్వు కూడా ఉంటాయని మరవరాదు. ఒక గుడ్డులో 186 మి.గ్రా. కొలెస్ట్రాల్ ఉంటుంది. రోజుకు మూడు గుడ్లు తినటం సాధారణంగానే పరిగణిస్తారు. అంతకన్నా ఎక్కువ తినేవారు పచ్చసొనను తీసేయటం మంచిది. దీంతో కొలెస్ట్రాల్ లేకుండానే ప్రొటీన్ లభించేలా చూసుకోవచ్చు.

### సమతులంగా, సరిగా

ప్రొటీన్‌తో ఎక్కువ సేపు కడుపు నిండిన భావన కలుగుతుంది. దీంతో త్వరగా ఆకలి వేయదు. ఇలా ఎక్కువెక్కువ తినకుండా చూస్తుంది. అలాగే ఆలస్యంగా జీర్ణం కావటం వల్ల రక్తంలో గ్లూకోజు మోతాదులు ఉన్నట్టుండి పెరగకుండా చూస్తుంది. దీని మూలంగానే పిండి పదార్థాలు గణనీయంగా తగ్గించి అధిక ప్రొటీన్ ఆహార పదార్థాలు తీసుకోవటమనేది ఇటీవల ప్రాచుర్యం పొందుతోంది. నిజానికి పేగులు ఆరోగ్యంగా ఉండటానికి పిండి పదార్థాలు చాలా ముఖ్యమనే సంగతి గుర్తించాలి. పిండి పదార్థాలు పేగుల్లో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందటానికి తోడ్పడతాయి. కాబట్టి సమతులాహారం తీసుకోవటం ప్రధానం. ఆహారంలో సుమారు 30% ప్రొటీన్, 40% పిండి పదార్థాలు, 30% కొవ్వు ఉండేలా చూసుకోవటం ఉత్తమం.

### ఎంత అవసరం?

వయసు, చేసే పనితీరులను బట్టి ప్రొటీన్ అవసరం ఆధారపడి ఉంటుంది. శారీరకశ్రమ అంతగా చేయని పెద్దవారికి ఒక రోజుకు తమ శరీర బరువులో ప్రతి కిలోకు సుమారు 0.8 గ్రాముల ప్రొటీన్ అవసరం. బాగా శ్రమ చేసేవారు, క్రీడాకారులకైతే 1.2 గ్రాముల నుంచి 2 గ్రాములు కావాలి. వృద్ధులు.. ముఖ్యంగా 65 ఏళ్లు పైబడ్డవారికి కండరాల మోతాదు, బలం తగ్గకుండా చూసుకోవటానికి కాస్త ఎక్కువగా.. 1 నుంచి 1.2 గ్రాములు తీసుకుంటే ప్రయోజనం కనిపించొచ్చు. కండలు పెంచుకునే బాడీబిల్డర్లకు ప్రతి కిలోకు 2.2 గ్రాములు కావాల్సి ఉంటుంది. రోజు మొత్తంలో మూడు నుంచి ఆరు సార్లు భోజనం చేయటం ద్వారా తగినంత ప్రొటీన్ లభించేలా చూసుకోవటం మంచిది.

# పోషకాలను ఒడిసి పట్టండి ఇలా!



ఆహార పదార్థాల్లో ఎన్నో పోషకాలుంటాయి. అయితే ఆయా పోషకాలను శరీరం నిజంగా ఎంతమేరకు ఉపయోగించుకుంటుందన్నదీ ముఖ్యమే.

ఆహార పదార్థాల్లోని పోషకాల లభ్యత వండే విధానం, వ్యక్తుల ఆరోగ్యస్థితి వంటి వాటిపై ఆధారపడి ఉంటుంది. పోషకాలను సంగ్రహించుకోవటంలో పేగుల ఆరోగ్యం పెద్ద ప్రభావమే చూపుతుంది. మంచి బ్యాక్టీరియా ఎక్కువగా ఉంటే శరీరం పెద్దమొత్తంలో పోషకాలను శోషించుకుంటుంది. అదే చెడు బ్యాక్టీరియా ఎక్కువైతే తక్కువగా గ్రహిస్తుంది. వయసు పాత్రా కీలకమే. జీర్ణాశయంలోని ఆమ్లం మోతాదుల్లో మార్పుల వల్ల వృద్ధులు పోషకాలను అంతగా శోషించుకోలేరు. జీర్ణరసాలు, మానసిక ఒత్తిడి, దీర్ఘకాల జీర్ణ సమస్యల వంటివీ విపరీత ప్రభావం చూపుతాయి. మధుమేహం, ఛాతీలో మంట వంటి సమస్యలు తగ్గటానికి వేసుకునే కొన్నిరకాల మందులూ పోషకాలను గ్రహించుకోకుండా అడ్డుకుంటాయి. వీటిల్లో కొన్ని మన చేతుల్లో ఉండకపోవచ్చు. కానీ ఆహారాన్ని వండటం, సిద్ధం చేసే విధానాన్ని మాత్రం మార్చుకోవచ్చు.

కూరగాయలకు.. ముఖ్యంగా సలాడ్లకు కొవ్వును జతచేస్తే కెరటినాయిడ్లు (ల్యూటీన్, లైకోపేన్, ఆల్ఫా, బీటా కెరటిన్), కొవ్వులో కరిగే విటమిన్లను (ఎ, ఇ, కె) శరీరం మరింతగా శోషించుకుంటుంది. బాదం, పిస్తా వంటి గింజపప్పులు.. పొద్దుతిరుగుడు గింజల వంటి విత్తనాలు.. ఆలివ్ నూనె, అవకాడో, వెన్న తీయని పాల ఉత్పత్తులతో కూరగాయలకు కొవ్వులను జత చేసుకోవచ్చు.

దోరగా వేయించటం, ఆవిరి మీద ఉడికించటం వల్ల వృక్ష కణాల గోడలు విచ్ఛిన్నమవుతాయి. దీంతో పదార్థాల్లో పోషకాల లభ్యత మెరుగవుతుంది. ఉడికించటం, వేపుళ్లతో పోలిస్తే మైక్రోవేవ్ ఓవెన్‌లో వండటం మూలంగా పోషకాలు ఇంకాస్త భద్రంగా ఉంటున్నట్టు, ఆ మాటకొస్తే విటమిన్ సి, ఖనిజ లవణాల లభ్యత ఒకింత పెరుగుతున్నట్టూ అధ్యయనాలు చెబుతున్నాయి. టొమాటోలను ఉడికిస్తే వీటిల్లోని లైకోపేన్ లభ్యత ఐదు రెట్లు పెరుగుతుంది.

మసాలా దినుసులు రుచిని పెంచటం, యాంటీఆక్సిడెంట్లను అందించటమే కాదు, పోషకాలను గ్రహించుకునే సామర్థ్యాన్నీ పెంచుతాయి. ఉదాహరణకు- మిరియాల్లోని పెపెరైన్ పసుపులోని కర్‌క్యుమిన్‌ను ఎక్కువగా శోషించుకునేలా చేస్తుంది. వెల్లుల్లి, అల్లంతో ఐరన్, జింక్ లభ్యత పెరుగుతుంది.

ముక్కలుగా కోయటం, దంచటంతో కణాల గోడలు విచ్ఛినమై, పోషకాలు బాగా విడుదలవుతాయి. బ్రోకలీ, గోబీపువ్వు వంటి కూరగాయలను కోసినప్పుడు సల్ఫొరఫేన్ అనే రసాయన మిశ్రమం ఎక్కువగా వెలువడుతుంది. ఇది వాపుప్రక్రియను తగ్గిస్తుంది. ఫలితంగా జబ్బుల ముప్పు తగ్గుతుంది. టొమాటోలను కోయటంతోనూ పోషకాల లభ్యత పెరుగుతుంది. అయితే మరీ చిన్నగా కోస్తే పోషకాలను కోల్పోయే ప్రమాదముంది. క్యారెట్లను మొత్తంగా కాకుండా ముక్కలుగా కోసి ఉడికిస్తే ఎక్కువ విటమిన్లు తగ్గుతున్నట్టు పరిశోధనలు చెబుతున్నాయి. ఉడికించిన తర్వాత తొక్క తీస్తే పోషకాలు భద్రంగా ఉంటాయి.

పప్పులు, ధాన్యాలు, విత్తనాలను నానబెడితే శరీరం ఐరన్, జింక్‌ను బాగా గ్రహించుకుంటుంది. నానబెట్టినప్పుడు ఈ పోషకాల శోషణను అడ్డుకునే ఫైటిక్ ఆమ్లం తగ్గుతుంది మరి. నానబెట్టటం వల్ల సాధారణంగా ఖనిజ లవణాల లభ్యత కూడా పెరుగుతున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి.

కొన్ని పదార్థాలను కలిపి తీసుకోవటమూ మేలు చేస్తుంది. విటమిన్ సి, ఐరన్‌తో కూడిన పదార్థాలను కలిపి తీసుకుంటే శరీరం ఐరన్‌ను బాగా గ్రహించుకుంటుంది. పెరుగు, మజ్జిగ వంటి వాటిని పండ్లతో కలిపి తింటే సజీవ బ్యాక్టీరియా, పీచు మూలంగా పేగుల ఆరోగ్యం మెరుగవుతుంది.

ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
సాంస్కృతికం
మన సంస్కృతి.. మన గర్వం..


# పచ్చబొట్టు చెరిగిపోదులే --- ప్రతి పాదంలో ప్రేమకు ఒక అర్థం

"ట్రై నెట్ న్యూస్"
పాట విశ్లేషణ
పేరి. నాగేశ్వరరావు

తెలుగు చలనచిత్ర గీతాల్లో కొన్ని పాటలు కేవలం వినడానికి మధురంగా ఉండవు. వాటిలోని ప్రతి పదం ఒక భావాన్ని, ప్రతి పాదం ఒక దృశ్యాన్ని, ప్రతి చరణం ఒక జీవిత సత్యాన్ని మన ముందుంచుతుంది. అలాంటి అపూర్వమైన గీతం "పచ్చబొట్టు చెరిగిపోదులే".

ఈ పాట 1971లో విడుదలైన "పవిత్ర బంధం" చిత్రంలోని గీతం. ఈ చిత్రానికి వి. మధుసూదనరావు దర్శకత్వం వహించారు. టి. గోవిందరాజన్ నిర్మాత. సంగీతాన్ని సాలూరి రాజేశ్వరరావు అందించగా, సాహిత్యాన్ని ఆరుద్ర రచించారు. ఈ చిత్రంలో అక్కినేని నాగేశ్వరరావు, కాంచన, వాణిశ్రీ, కృష్ణంరాజు ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ పాటను ఘంటసాల, పి. సుశీల ఆలపించారు. అందుబాటులో ఉన్న చిత్ర వివరాల ప్రకారం సినిమా 1971 ఫిబ్రవరి 24న విడుదలైంది.

ఈ పాట ప్రత్యేకత ఏమిటంటే---ఇది కేవలం ప్రేమికుల మధ్య సంభాషణ కాదు. ప్రేమ ఎలా పుడుతుంది, ఎలా బలపడుతుంది, చివరకు వివాహ బంధంగా ఎలా మారుతుంది అనే ప్రయాణాన్ని కవి మూడు చరణాల్లో అద్భుతంగా ఆవిష్కరించారు.

"పచ్చబొట్టు చెరిగిపోదులే నా రాజా"
ఇది కేవలం పచ్చబొట్టు గురించి చెప్పిన మాట కాదు. పచ్చబొట్టు శరీరంపై వేసిన ఒక గుర్తు. అది సులభంగా చెరిగిపోదు. అదే విధంగా మన హృదయంలో ఏర్పడిన ప్రేమ గుర్తు కూడా చెరిగిపోదని ప్రేమికురాలు చెబుతోంది.
ఇక్కడ పచ్చబొట్టు = ప్రేమకు గుర్తు.

"పడుచు జంట చెదరిపోదులే నా రాజా"
ప్రేమ ఎంత నిజమైనదైతే, ఆ బంధం అంత బలమైనది. తమ జంట ఎప్పటికీ విడిపోదనే విశ్వాసం ఇందులో కనిపిస్తుంది. ప్రేమలోని భరోసాను ఇంత సరళమైన మాటల్లో చెప్పడం ఆరుద్ర గారి సాహిత్య ప్రతిభ.

"పచ్చబొట్టు చెరిగిపోదులే నా రాణీ"
ఇక్కడ పురుష స్వరం కూడా అదే భావాన్ని తిరిగి పలుకుతుంది. అంటే ప్రేమ ఏకపక్షం కాదు. ఇద్దరి హృదయాల్లోనూ ఒకే భావం ఉంది. ఇది పరస్పర ప్రేమకు ప్రతీక.

"పడుచు జంట చెదరిపోదులే నా రాణీ"
ప్రేమికుల బంధం కేవలం యవ్వనపు ఆకర్షణగా కాకుండా జీవితాంతం నిలిచే అనుబంధంగా మారాలని కోరుకుంటున్నారు.

మొదటి చరణం



"పండిన చేలు పసుపుపచ్చ"
ఇది అద్భుతమైన ప్రకృతి దృశ్యం. పంట పండినప్పుడు పొలం పసుపు రంగుతో కళకళలాడుతుంది. రైతుకు అది ఆనందం, సంపదకు సంకేతం.
ప్రేమ కూడా పండిన పంటలాంటిదే. మొదట చిగురుగా మొదలై, కాలంతో పరిపక్వమవుతుంది.

"నా నిండు మమతలు మెండు సొగసులు లేతపచ్చ"
ఇక్కడ ప్రేమను లేత పచ్చదనంతో పోల్చారు. లేత పచ్చ అంటే చిగురు, కొత్తదనం, తాజాదనం. ప్రేమలోని మమత కూడా అలాంటిదే--- ఎంత పెరిగినా దాని తాజాదనం తగ్గదు.

"నీ మెడలో పతకం చిలకపచ్చ"
చిలకపచ్చ అనే పదం ద్వారా ప్రియురాలి అలంకారాన్ని, అందాన్ని కవి చిత్రించారు. ప్రకృతిలోని రంగులను స్త్రీ సౌందర్యంతో అనుసంధానించడం తెలుగు కవిత్వంలోని ప్రత్యేకత.

"మన మేలిమి గురుతీ వలపుల పచ్చ"
ఇది మొదటి చరణానికి హృదయం. వారి ప్రేమకు ఒక గుర్తు ఉంది. ఆ గుర్తు పచ్చగా, చెరగనిదిగా ఉంటుంది.
అంటే వారి ప్రేమే వారి జీవితానికి గుర్తింపు.

రెండవ చరణం

"కలసిన కలయిక తలవని తలపు"
ఇద్దరూ కలుసుకున్న సందర్భం మరచిపోలేని జ్ఞాపకంగా మారింది. కొన్ని కలయికలు సాధారణమైనవి కావు. అవి జీవితాన్ని మార్చేస్తాయి.

"నీ చెలిమి విలువచే చేతి చలువచే చిగిర్చె నా మనసు"
ప్రియమైన వ్యక్తి స్నేహం, ఆప్యాయత మనసులో కొత్త చిగురును పుట్టించాయి. ప్రేమ వచ్చిన తర్వాత మనసు కొత్తగా మారుతుంది.
ఇక్కడ "చిగిర్చె నా మనసు" అనే భావం ఎంతో అందమైనది. చిగురు అంటే కొత్త జీవితం. ప్రేమ కూడా జీవితానికి కొత్త అర్థాన్ని ఇస్తుంది.

"తిరిగెను బ్రతుకే క్రొత్త మలుపు"
ప్రేమ జీవితాన్ని మార్చేసింది. నిన్నటి వరకు ఒక విధంగా ఉన్న జీవితం, ప్రేమ వచ్చిన తర్వాత మరో దిశలోకి మళ్లింది.
ఒక వ్యక్తి జీవితంలో సరైన వ్యక్తి ప్రవేశిస్తే జీవితం నిజంగానే కొత్త మలుపు తిరుగుతుంది.

"ఇది తీయని వాడని మన తొలి వలపు"
తొలి ప్రేమకు ఉండే ప్రత్యేకతను కవి ఇక్కడ గుర్తుచేస్తున్నారు. మొదటి ప్రేమ జీవితాంతం గుర్తుండిపోవడానికి కారణం---అది మనసును తొలిసారిగా అంత లోతుగా తాకుతుంది.

మూడవ చరణం --- ప్రేమ నుంచి వివాహం వరకు

"నూరేళ్ల వెలుగు నుదుటి బొట్టు"
నుదుటి బొట్టును నూరేళ్ల వెలుగుతో పోల్చడం ఎంతో అందమైన కవితా ప్రయోగం. బొట్టు స్త్రీ సౌభాగ్యానికి, శుభానికి ప్రతీకగా నిలుస్తుంది.

"నోచిన నోములు పూచిన రోజున పెళ్లిబొట్టు"
ఎన్నో ఆశలు, ప్రార్థనలు, వ్రతాలు, కోరికలు ఫలించిన రోజు వివాహం జరుగుతుంది. ప్రేమకు సామాజిక గుర్తింపు లభించే ఘట్టం ఇది.

"కట్టేను నీ చేయి తాళిబొట్టు"
ఇది పాటలో అత్యంత ముఖ్యమైన భావం. ప్రేమ ఇప్పుడు వివాహ బంధంగా మారింది. తాళి కట్టడం ద్వారా ఇద్దరి జీవితాలు ఒకటవుతాయి.
ఇక్కడ కవి ప్రేమను కేవలం భావోద్వేగంగా వదిలిపెట్టకుండా బాధ్యతతో కూడిన పవిత్ర బంధంగా తీసుకెళ్లారు.

"అది కలకాల కాంతుల కలిమి చెట్టు"
ఇదే ఈ పాటకు ముగింపు ముద్ర.
కలిమిచెట్టు అంటే అభివృద్ధి, సౌభాగ్యం, కుటుంబ శ్రేయస్సుకు ప్రతీకగా భావించవచ్చు. వివాహం తర్వాత ఇద్దరి జీవితం ఒక చెట్టులా ఎదిగి, తరతరాలకు నీడనివ్వాలనే ఆకాంక్ష ఇందులో కనిపిస్తుంది.

పాటలోని అసలు గొప్పతనం

ఈ పాటను ఒకసారి మొత్తం పరిశీలిస్తే ఒక అద్భుతమైన భావ ప్రయాణం కనిపిస్తుంది.
పచ్చబొట్టు ప్రేమకు గుర్తు
పచ్చని పొలం జీవన సౌభాగ్యం
చిగురించిన మనసు తొలి ప్రేమ
కొత్త మలుపు జీవిత మార్పు
నుదుటి బొట్టు స్త్రీ సౌభాగ్యం
తాళిబొట్టు వివాహ బంధం
కలిమిచెట్టు శాశ్వత కుటుంబ జీవితం

అంటే మూడు చరణాల్లో ప్రేమ పుట్టుక నుంచి వివాహం, వివాహం నుంచి జీవితాంతం అనుబంధం వరకు మొత్తం కథను కవి చెప్పారు.
ఘంటసాల గారి గంభీరమైన మాధుర్య గాత్రం, పి. సుశీల గారి సున్నితమైన గాత్రం ఈ భావాలకు మరింత ప్రాణం పోశాయి. ఈ పాటకు సాలూరి రాజేశ్వరరావు అందించిన సంగీతం, ఆరుద్ర గారి పదాలతో కలసి ఒక మధురమైన శాశ్వత గీతంగా నిలిచింది. పాటకు ఘంటసాల, పి. సుశీల గాత్రదానం చేసినట్లు పాటల సంకలన వివరాలు కూడా నిర్ధారిస్తున్నాయి.
ఇది పాత పాట అయినా భావం మాత్రం పాతబడలేదు. ఎందుకంటే ప్రేమ, మమత, చెలిమి, వివాహం, దాంపత్యం---ఇవి కాలంతో మారని మానవ అనుభూతులు.
ఆరుద్ర గారి కలం ఒక సాధారణ పచ్చబొట్టును తీసుకుని దానిని చెరగని ప్రేమకు ప్రతీకగా మార్చింది.
అందుకే ఈ పాటను విన్నప్పుడు మనకు కేవలం ఒక మధురమైన గీతం వినిపించదు.
ఒక ప్రేమకథ వినిపిస్తుంది.
ఒక జీవిత ప్రయాణం కనిపిస్తుంది.
ఒక వివాహ బంధం గుర్తుకొస్తుంది.
ఒక తరం సంస్కృతి మన కళ్లముందు నిలుస్తుంది.
పచ్చబొట్టు శరీరంపై వేసిన గుర్తు కావచ్చు.
కానీ నిజమైన ప్రేమ హృదయంపై వేసిన గుర్తు.
శరీరంపై గుర్తు ఎప్పుడో చెరిగిపోవచ్చు---
నిజమైన ప్రేమ మాత్రం చెరిగిపోదులే!

## తెలుగు చిత్ర పరిశ్రమలో భానుమతి చెరగని ముద్ర






వంశీ సంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ వంశీ రామరాజు

**హైదరాబాద్, చిక్కడపల్లి ట్రైనెట్ న్యూస్ సెప్టెంబర్ 6:** అను సిస్టర్స్ ఆధ్వర్యంలోని శ్రీ సుమధుర ఆర్ట్స్ అకాడమీ నిర్వహణలో ప్రముఖ సినీ నటి , నేపధ్య గాయని భానుమతి 102వ జయంతి సందర్భంగా "మధుర మధురం చెల్లినేరయి..." పేరిట తెలుగు సినీ సంగీత విభావరి చిక్కడపల్లి త్యాగరాయ గానసభలోని కళా మారుతీ కళావేదిక లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వంశీ సంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ వంశీ రామరాజు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు చిత్ర పరిశ్రమలో భానుమతి చెరగని ముద్ర వేసుకున్నారని కీర్తించారు. ఈ సందర్భంగా ప్రముఖ గాయని ,గాయకులు ఏ. రేవతి, శ్రీమతి కె. శ్రీదేవి, బి. హర్షవికాస్ , శర్మ, శ్రీ రామ్ నెమునూరి, శశికుమార్ తదితరులు ఆలపించిన సినీ గీతాలు అలరించాయి.

## కోదండరెడ్డి, కొండలరావు, కనకవ్వలకు పొన్నం సత్తయ్య జీవిత సాఫల్య పురస్కారాలు

**వ్యవసాయం, సాహిత్యం, కళారంగాల్లో విశేష సేవలకు గుర్తింపుగా అవార్డులు**

**రవీంద్రభారతి, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 6:** రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తండ్రి పొన్నం సత్తయ్య స్మారకార్థం పొన్నం సత్తయ్య ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతి ఏటా అందిస్తున్న పొన్నం సత్తయ్య జీవిత సాఫల్య పురస్కారాలకు ఈ ఏడాది ముగ్గురిని ఎంపిక చేశారు. వ్యవసాయ రంగంలో విశేష కృషి చేస్తున్న రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి, సాహిత్య రంగంలో వెలిచాల కొండలరావు, కళారంగంలో విశేష సేవలందిస్తున్న గొట్టే కనకవ్వలను ఈ ఏడాది జీవిత సాఫల్య పురస్కారాలకు ఎంపిక చేసినట్లు ట్రస్టు ఉపాధ్యక్షులు పొన్నం అశోక్ గౌడ్ తెలిపారు.
అవార్డుల జ్యూరీ కమిటీ కన్వీనర్ డా. పొన్నం రవిచంద్ర సారథ్యంలో కేంద్ర సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్, ప్రముఖ పాత్రికేయులు దిలీప్ రెడ్డి, సివిల్ సప్లయిస్ డైరెక్టర్ జి.వి. శ్యాంప్రసాద్ లాల్, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డా.మామిడి హరికృష్ణ, రచయిత్రి అయినంపుడి శ్రీలక్ష్మి సభ్యులుగా ఉన్న జ్యూరీ కమిటీ అవార్డులకు ఎంపిక చేసిన జాబితాను ఆదివారం
ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ పొన్నం ప్రభాకర్ కు అందజేసింది. ఈ ఏడాది నుంచి వ్యవసాయ రంగాన్ని కూడా పురస్కారాల పరిధిలోకి తీసుకువచ్చి తొలిసారిగా వ్యవసాయ రంగంలో విశిష్ట సేవలందించిన



వ్యక్తికి అవార్డును అందజేయనున్నారు. పొన్నం సత్తయ్య 16వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 13వ తేదీన రవీంద్రభారతిలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పొన్నం అశోక్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అవార్డులకు ఎంపికైన ముగ్గురికి రూ.50 వేల నగదు పురస్కారంతో పాటు మెమెంటో, ప్రశంసాపత్రం అందజేయనున్నట్లు వెల్లడించారు. పొన్నం సత్తయ్య ఆశయాలను కొనసాగిస్తూ, సమాజానికి వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న ప్రతిభావంతులను గుర్తించి గౌరవించడమే ఈ పురస్కారాల ప్రధాన ఉద్దేశ్యమని ఆయన తెలిపారు.

## పేరిణి నృత్య కళను భావితరాలకు అందించాలి



**మణిద్వీప ఆర్ట్స్ అకాడమీ పేరిణి గజ్జ పూజ కార్యక్రమంలో మామిడి హరికృష్ణ**

**హైదరాబాద్, రవీంద్ర భారతి, ట్రైనెట్ న్యూస్ న్యూస్ 6 :** తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించే పేరిణి నృత్య కళను భావితరాలకు అందించాలని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ మాజీ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ అన్నారు. మణిద్వీప ఆర్ట్స్ అకాడమీ పేరిణి సందీప్ ఆధ్వర్యంలో 143 మంది పేరిణి నాట్య కళాకారులతో నిర్వహించిన పేరిణి నాట్య గజ్జ పూజ కార్యక్రమం హైదరాబాద్ లోని రఘురాం నగర్ కాలనీలో కేకే గార్డెన్స్ వేదికలో వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మామిడారి కృష్ణ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేరిణి నాట్యం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు . యువతలో సాంప్రదాయ కళల పట్ల ఆసక్తి పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. పేరిణి సందీప్ మాట్లాడుతూ.. పేరిణి నాట్య కళను మరింత విస్తృతంగా ప్రజల్లోకి



తీసుకెళ్లడంతో పాటు, యువతకు శిక్షణ అందించి ఈ గొప్ప కళా సంప్రదాయాన్ని పరిరక్షించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. 143 మంది కళాకారులు ఒకే వేదికపై పేరిణి నాట్య గజ్జ పూజలో పాల్గొని కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సభకు ముందు కళాకారులు ప్రదర్శించిన పలు నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో
డా. కె. రజని, కళాకృష్ణ, పద్మశ్రీ ఉమామహేశ్వరి, డా. చిరంజీవి, దుంప శ్రీదేవి, ఐనం శ్రీలక్ష్మి తదితరులు హాజరై కళాకారులను అభినందించారు.

త్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
సాంస్కృతికం
మన సంస్కృతి.. మన గర్వం..



# శాస్త్రీయ నృత్య కళలను ప్రోత్సహించాలి

**హైదరాబాద్ , బిర్లా ఆడిటోరియం,త్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 6 :**
శాస్త్రీయ శాస్త్రీయ నృత్య కళలను ప్రోత్సహించాలని తెలంగాణ తొలి శాసనసభాపతి, ఎమ్మెల్సీ మధుసూదనా చారి అన్నారు.
శ్రీ రామ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు బిర్లా సైన్స్ సెంటర్, వేదిక -- భాస్కర ఆడిటోరియంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథి మధుసూదనాచారి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ.. శాస్త్రీయ నృత్య కళలను ప్రోత్సహించాలన్నారు.
రామ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో విలక్షణమైన కార్యక్రమాలను నిర్వహిస్తూ.. కళలు, కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రముఖ సంఖ్యాశాస్త్ర నిపుణుడు దైవజ్ఞ శర్మ పాల్గొన్నారు. సభకు ముందు సంస్థ అధ్యక్షురాలు, నాట్య గురువు పార్వతి నిర్వహణలో కళాకారులు ప్రదర్శించిన పలు నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.
















## జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు




**హైదరాబాద్, చిక్కడపల్లి త్రైనెట్ న్యూస్ సెప్టెంబర్ 6 :**
జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని బంగారు తెలంగాణ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలను చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మల్కాజ్ గిరి కోర్టు మాజీ జడ్జి బురుగుల మధుసూదన్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..
భారతదేశంలో ఉపాధ్యాయ వృత్తికి విశిష్ట గౌరవాన్ని తీసుకువచ్చిన మహనీయుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్
అని కొనియాడారు. ఆయన సేవలను స్మరించుకు కోవడం అభినందనీయమన్నారు. సభకు ముందు సంస్థ అధ్యక్షుడు వీక్కీ







మాస్టర్ నిర్వహణలో కళాకారులు ప్రదర్శించిన పలు నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి

## ఆశా భోంస్లే, ఎస్. జానకీ గాన వైభవానికి సంగీత నివాళి




సుబ్బు మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో "ఇన్ ఆంఖోం కీ మస్తీ మే" సంగీత విభావరి




**హైదరాబాద్, సెప్టెంబర్ 6 (త్రైనెట్ న్యూస్):**
ప్రముఖ భారతీయ నేపథ్య గాయనీమణులు ఆశా భోంస్లే, ఎస్. జానకీ గాన వైభవానికి నివాళిగా సుబ్బు మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక సంగీత విభావరి నిర్వహించనున్నారు. "ఇన్ ఆంఖోం కీ మస్తీ మే -- వెన్నెల్లో గోదారి అందం..." పేరుతో ఈ కార్యక్రమాన్ని హైదరాబాద్ చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాయ గానసభ, కళా సుబ్బారావు కళావేదికలో మధ్యాహ్నం 1 గంట నుంచి రాత్రి 9 గంటల వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.
ఆశా భోంస్లే, ఎస్. జానకీ ఆలపించిన ఎన్నో మధురమైన, చిరస్మరణీయ గీతాలను వివిధ గాయకులు ఈ వేదికపై ఆలపించనున్నారు. ప్రముఖ గాయకులు పి. కృష్ణప్రసాద్, నాగేందర్, ఎల్. రవి, భాను కిరణ్, సురేంద్రనాథ్, కైలాస్ నిలేకర్, దిలీప్ కొఠారి, విజయ్ కుమార్ శ్రీవాస్తవ్, పి.పి.రావు, అచ్యుత్, రామ్ హరీష్, కృష్ణవేణి, అనంత జ్యోతి, శారద రాజా, లక్ష్మీ శకుంతల, సత్యదీప్తి, నమ్రతా శర్మ, పద్మ జయంతి, అంజలి కులకర్ణి, శారద శర్మ తదితరులు తమ గానంతో ప్రేక్షకులను అలరించనున్నారు.
సుబ్బు మ్యూజిక్ అకాడమీ అధ్యక్షురాలు ఎస్. ప్రసన్న లక్ష్మి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో ప్రముఖ సంగీత కళాకారులు, సంగీతాభిమానులు పాల్గొననున్నారు. స్వర రాగమయి వ్యవస్థాపకులు కొమరవోలు శ్రీనివాసరావు, సుబ్బు మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపకులు, గాయకుడు రామ సుబ్రహ్మణ్యం శ్రీధరం తదితరులు కార్యక్రమంలో పాల్గొంటారు.
సంగీత ప్రియులందరికీ ప్రవేశం ఉచితం అని, పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

## "మెగా పవర్ మ్యూజిక్ మేనియా"తో సంగీతాభిమానులకు అలరింపు




జేసీస్ రిథమ్స్ ఆధ్వర్యంలో సీజన్--24 సంగీత విభావరి




**హైదరాబాద్, సెప్టెంబర్ 6 (త్రైనెట్ న్యూస్):**
జేసీస్ రిథమ్స్ -- యూఫోరియా ఆధ్వర్యంలో "హ్యాపీనెస్... బియాండ్ మ్యూజిక్" పేరుతో సీజన్--24 'మెగా పవర్ మ్యూజిక్ మేనియా' సంగీత విభావరి ఆదివారం హైదరాబాద్ చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాయ గానసభ, కళా లలిత కళావేదికలో ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సాగిన ఈ కార్యక్రమం సంగీతాభిమానులను విశేషంగా అలరించింది.
కార్యక్రమానికి గౌరవ అతిథులుగా అంజని కుమారి పీవీపీ, త్రినాథరావు, లైఫ్ కోచ్ రామకృష్ణ తనికెళ్ల తదితరులు హాజరయ్యారు. ప్రత్యేక గాయనీమణులుగా రేణుక రమేష్, శ్రీదేవి పాల్గొని తమ గానంతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.
సంగీత కార్యక్రమంలో ఏడుకొండలు, మల్లేశం ఎన్., గోపీచంద్ ఎం., ఎన్.సి. కృష్ణమోహన్, కాష్, విజయ్ ఇంగువ, పద్మ సూరి, రోహిణి చంద్రహాస్, అపర్ణ ఎం., ప్రియ, సుజిత తదితర గాయనీ గాయకులు పాల్గొని పలు మధురమైన సినీ గీతాలను ఆలపించారు.
విభిన్న గీతాలతో సాగిన ఈ సంగీత విభావరి ఆద్యంతం ఉత్సాహభరితంగా కొనసాగింది. సంగీత ప్రియులు పెద్ద సంఖ్యలో హాజరై గాయనీ గాయకులను అభినందించారు.

## తెలుగు చిత్ర పరిశ్రమలో భానుమతి చెరగని ముద్ర




వంశి సంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ వంశీ రామరాజు



**హైదరాబాద్, చిక్కడపల్లి త్రైనెట్ న్యూస్ సెప్టెంబర్ 6:**
అను సిస్టర్స్ ఆధ్వర్యంలోని శ్రీ సుమధుర ఆర్ట్స్ అకాడమీ నిర్వహణలో ప్రముఖ సినీ నటి , నేపద్య గాయని భానుమతి 102వ జయంతి సందర్భంగా "మధుర మధురం చెల్లినేరయి..." పేరిట తెలుగు సినీ సంగీత విభావరి చిక్కడపల్లి త్యాగరాయ గానసభలోని కళా మారుతీ కళావేదిక లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వంశీ సంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ వంశీ రామరాజు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు చిత్ర పరిశ్రమలో భానుమతి చెరగని ముద్ర వేసుకున్నారని కీర్తించారు. ఈ సందర్భంగా ప్రముఖ గాయని ,గాయకులు ఏ. రేవతి, శ్రీమతి కె. శ్రీదేవి, బి. హర్షవికాస్ , శర్మ, శ్రీ రామ్ నెమునూరి, శశికుమార్ తదితరులు ఆలపించిన సినీ గీతాలు అలరించాయి.

edited, Printed, Published and Owned by:Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA. www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136